thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 128 కరీంనగర్ గురువారం, 17 జూలై 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## రూ. 5 కోట్ల డ్రగ్స్ సరఫరా, మహిళ అరెస్ట్

ముంబై : రూ.5 కోట్ల విలువైన డ్రగ్స్ సరఫరా చేస్తున్న ఒక విదేశీ మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. ఢిల్లీ నుండి ముంబైకి బస్సులో మాదకద్రవ్యాలను రవాణా చేస్తున్నట్లు వచ్చిన సమాచారం ప్రకారం డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ బృందం ఆ మహిళ ప్రయాణిస్తోన్న బస్సు వెంబడి కాపు కాచి చాకచక్యంగా పట్టుకున్నారు. సదరు నైజీరియన్ మహిళను ఆపి ఆమె సామాను తనిఖీ చేశారు. ఆమె లగేజీని పరిశీలించిన తర్వాత, అధికారులు స్ఫటికాకార పదార్థపు ప్యాకెట్, ఇంకా మాత్రలు కలిగిన ఫుడ్ ప్యాకెట్లు (ఓట్స్), జ్యూస్ టెట్రా ప్యాక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఫీల్డ్ టెస్ట్ కిట్‌ని ఉపయోగించి ల్యాబ్స్‌లో పరీక్షలు చేయగా ఆ ప్యాకెట్లలో 2.56 కిలోగ్రాముల మెథాంఫేటమిన్, 584 గ్రాముల ఎక్స్‌టసీ మాత్రలు ఉన్నట్టు నిర్ధారించారు. తదుపరి ఆపరేషన్‌లో సదరు సరుకును స్వీకరించాల్సిన వ్యక్తిని కూడా అరెస్టు చేశారు.



## బనకచర్లపై చర్చ జరగలేదు

దిల్లీ: తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా, గోదావరి జలాల అంశంలో ఉన్న సమస్యలపై చర్చించడానికి అధికారులు, ఇంజినీర్లతో కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆ కమిటీ నివేదిక మేరకు తదుపరి చర్యలు ఉంటాయన్నారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో కేంద్ర జలశక్తిశాఖ నిర్వహించిన సమావేశం అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో ఏపీ ప్రభుత్వం నుంచి గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు కడతామన్న ప్రతిపాదన చర్చకు రాలేదని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. అజెండాలో వారు కడతామనే ప్రతిపాదనే చర్చకు రానప్పుడు ఆపాలన్న చర్చే ఉండదన్నారు. ఇది అపెక్స్ కమిటీ భేటీ కాదని చెప్పారు. "తెలంగాణ హక్కులను కేసీఆర్ గతంలో ఏపీకి ధారాదత్తం చేశారు. ఆయన చేసిన తప్పులను సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నాం. పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ఈ సమావేశం జరిగింది. ఈ భేటీలో కేంద్ర ప్రభుత్వం కేవలం నిర్వాహక పాత్రే పోషించింది. కేంద్రం ఎవరివైపూ మాట్లాడలేదు. భేటీలో తీసుకున్న నిర్ణయాలన్నీ తెలంగాణ విజయమే. అనుమానించుకుంటూ పోతే ముందుకు సాగలేం. సమస్యలను పరిష్కరించుకునేందుకే ఉన్నాం.. గొడవలు పెట్టుకునేందుకు కాదు. ఇరు రాష్ట్రాలు గొడవలు పెట్టుకోవాలని కొందరు చూస్తున్నారు. వివాదాలు లేకుండా సమస్యలను పరిష్కరించుకోవడమే మా అజెండా"అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.



## ఏసీబీ వలలో పంచాయతీ రాజ్ ఇంజినీర్ ఇన్ చీఫ్

హైదరాబాద్: తెలంగాణ పంచాయతీరాజ్ ఇంజినీర్ ఇన్ చీఫ్ కనకరత్నం ఏసీబీ వలలో చిక్కారు. డీఈ బదిలీ విషయంలో ఆయన రూ. 50వేలు డిమాండ్ చేశారు. లంచం డబ్బు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఈ ఏడాది మార్చి 31న కనకరత్నం పదవీవిరమణ పొందారు. అయితే, ప్రభుత్వం ఆయన పదవీకాలాన్ని మరో ఏడాదిపాటు పొడిగిచింది. కాగా సొంత శాఖలోని డీఈ తాండూరు నుంచి వికారాబాద్‌కు బదిలీ చేయాలని కోరగా.. కనకరత్నం రూ.50వేలు లంచం అడిగారు. దీంతో డీఈ ఏసీబీని ఆశ్రయించారు. దీంతో కనకరత్నం లంచం తీసుకుంటుండగా.. ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పంచాయతీ రాజ్ కార్యాలయంతోపాటు కేపీహెచ్‌బీ కాలనీలోని ఆయన నివాసంలోనూ సోదాలు నిర్వహించారు. అనంతరం కనకరత్నంను అరెస్టు చేసినట్లు ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ వెల్లడించారు.





## మేడిగడ్డ ఆనకట్టపైనే చర్చ పెడదాం.. రేవంత్‌రెడ్డికి కేటీఆర్ సవాల్

హైదరాబాద్: కూలిందంటున్న మేడిగడ్డ ఆనకట్టపైనే చర్చ పెడదామని.. సీఎం రేవంత్‌రెడ్డి ఈ సవాల్‌ను స్వీకరించాలని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. సీఎం సవాల్‌కు ప్రతిసవాల్‌గా చర్చకు వెళితే పారిపోయారని, మళ్లీ చర్చకు పిలుస్తున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణ భవన్‌లో జరిగిన దళితబంధు సాధన సమితి సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. దమ్ముంటే మేడిగడ్డ ఆనకట్టమీద చర్చకు తాము విసిరిన సవాల్‌ను స్వీకరించాలన్నారు. "సీఎం తన స్థాయిని మరిచి పదే పదే దిగజారుడు మాటలు మాట్లాడుతున్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయమంటే బెదిరింపులకు పాల్పడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మేనిఫెస్టో ఈ శతాబ్దపు అతిపెద్ద మోసం. 420 హామీలు ఇచ్చి తెలంగాణలోని సబ్బండ వర్గాలను నిట్టనిలువునా మోసం చేస్తోంది. గత ప్రభుత్వం ఎంపిక చేసిన ప్రతి ఒక్క దళిత బిడ్డకు 'దళిత బంధు' ఇవ్వాలి. ఫ్రీజింగ్ వెంటనే తొలగించి, కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు రూ.12లక్షల దళితబంధు ప్రారంభించాలని డిప్యూటీ సీఎం భట్టికి లేఖ రాస్తా"అని కేటీఆర్ అన్నారు.

**సీఎం రేవంత్ క్షమాపణ చెప్పాలి:** తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీలో మొదటి అంశమే బనకచర్ల అని భారత రాష్ట్ర సమితి నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. కానీ.. బనకచర్ల ప్రస్తావనే రాలేదని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారని.. ఆయన మాటలు, చేతలకు పొంతన ఉండదని విమర్శించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. బనకచర్ల ప్రాజెక్టు, ఇతర అంశాల పరిష్కారానికే కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారని ఆయన చెప్పారు. "రాష్ట్రంలో భాజపా, తెదేపా రిమోట్ పాలన కొనసాగుతోంది. కమిటీ నిర్ణయాన్ని అంగీకరిస్తామని సీఎం రేవంత్ చెప్పడం సబబు కాదు. బనకచర్లపై కేంద్రం భేటీయే తప్పు.. సీఎం పాల్గొనడం మరో తప్పు. 4 కేంద్ర సంస్థలు తిరస్కరించిన ప్రతిపాదనపై సమావేశం ఎలా నిర్వహిస్తారు? రాష్ట్రానికి ద్రోహం చేస్తూ సీఎం మరణశాసనం రాశారు. బేషరతుగా ఆయన క్షమాపణ చెప్పాలి" అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# రైతులకు శుభవార్త...

## 3 కీలక నిర్ణయాలకు కేంద్ర కేబినెట్ ఆమోదం



## 100 జిల్లాల్లో.. 'పీఎం ధన్ ధాన్య కృషి యోజన'

ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన బుధవారం ఆయన నివాసంలో జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో మూడు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. దేశ వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ, పునరుత్పాదక ఇంధన రంగాన్ని బలోపేతం చేసే దిశగా కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ భేటీలో పీఎం ధన్ ధాన్య కృషి యోజన పథకాన్ని కేబినెట్ ఆమోదించింది.

ఈ పథకం ద్వారా దేశ వ్యాప్తంగా ఉన్న 1.70 కోట్ల మంది అన్నదాతలకు ప్రత్యక్షంగా లబ్ధి చేకూరనుంది. కేంద్ర కేబినెట్ నిర్ణయాల గురించి కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు.

**ప్రధానమంత్రి ధన్-ధాన్య కృషి యోజన...** కేంద్ర మంత్రివర్గం "ప్రధానమంత్రి ధన్-ధాన్య కృషి యోజన" ను 2025-26 నుండి ఆరు సంవత్సరాల కాలానికి ఆమోదించింది. ఈ పథకం ద్వారా 100 వ్యవసాయ జిల్లాలను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ పథకం నీతి ఆయోగ్ 'ఆకాంక్ష జిల్లాల' కార్యక్రమం నుంచి ప్రేరణ పొందింది, అయితే ఇది ప్రత్యేకంగా వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపై దృష్టి సారిస్తుంది.

**పథకం లక్ష్యాలు:** వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం. పంట వైవిధ్యాన్ని ప్రోత్సహించడం. సుస్థిర వ్యవసాయ పద్ధతులను అనుసరించడం. పంచాయతీ, బ్లాక్ స్థాయిలో నిల్వ సౌకర్యాలను పెంచడం. నీటిపారుదల వ్యవస్థను మెరుగుపరచడం. ఈ పథకం 11 మంత్రిత్వ శాఖల పరిధిలోని 36 పథకాల సమన్వయం ద్వారా అమలు చేయబడుతుంది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు, ప్రైవేట్ రంగ భాగస్వామ్యం కూడా ఉంటాయి. తక్కువ ఉత్పాదకత, తక్కువ పంట సైకిల్, తక్కువ రుణ పంపిణీ వంటి మూడు ప్రధాన ప్రమాణాల ఆధారంగా 100 జిల్లాలను ఎంపిక చేస్తారు. ప్రతి రాష్ట్రం నుంచి కనీసం ఒక జిల్లాను చేర్చుకుంటారు. కేంద్ర కేబినెట్ 6 సంవత్సరాల కాలానికి రూ.24,000 కోట్ల వార్షిక వ్యయంతో కూడిన ప్రధానమంత్రి ధన్-ధాన్య కృషి యోజనను ఆమోదించింది. ఈ పథకం 36 ఇప్పటికే ఉన్న పథకాలను ఏకీకృతం చేస్తుంది.

**పునరుత్పాదక ఇంధన రంగంలో భారీ పెట్టుబడులు...** ఎన్‌టీపీసీ లిమిటెడ్‌కు పునరుత్పాదక ఇంధన రంగంలో పెట్టుబడుల కోసం ప్రస్తుత పరిమితికి మించి రూ. 20,000 కోట్ల వరకు పెట్టుబడి పెట్టడానికి అనుమతి ఇచ్చింది. ఈ పెట్టుబడి ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్, దాని అనుబంధ సంస్థలు, జాయింట్ వెంచర్ల ద్వారా చేయబడుతుంది. దీని లక్ష్యం 2032 నాటికి 60 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని సాధించడం. అదేవిధంగా, ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్‌కు కూడా రూ. 7,000 కోట్ల పెట్టుబడికి ప్రత్యేక మినహాయింపు లభించింది. ఈ మొత్తాన్ని అది తన పూర్తి యాజమాన్యంలోని అనుబంధ సంస్థ ఎన్ఎల్‌సి ఇండియా రెన్యూవబుల్స్ లిమిటెడ్ ద్వారా పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులలో పెట్టుబడి పెడుతుంది. ఇది కంపెనీకి నిర్వహణ, ఆర్థిక సౌలభ్యాన్ని అందిస్తుంది. కేంద్ర కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాల గురించి కేంద్ర సమాచారం, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి ధన్-ధాన్య కృషి యోజన పంట కోత తర్వాత నిల్వ సామర్థ్యాన్ని పెంచుతుందని, నీటిపారుదల సౌకర్యాలను మెరుగుపరుస్తుందని, వ్యవసాయ ఉత్పాదకతను పెంచుతుందని చెప్పారు.

# జల వివాదాలపై.... సుదీర్ఘ చర్చ



## 'బనకచర్ల ' సింగిల్ పాయింట్ అజెండాతో ఏపీ... 13 అంశాలతో తెలంగాణ సర్కార్...

దిల్లీ: తెలుగు రాష్ట్రాల మధ్య ఉన్న జల అంశాలపై చర్చించేందుకు ఏపీ, తెలంగాణ సీఎంలు భేటీ అయ్యారు. దిల్లీలోని శ్రమశక్తి భవన్‌లో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ ఆధ్వర్యంలో ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. భేటీ ప్రారంభంలో సీఆర్ పాటిల్‌తో పాటు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి పరస్పరం కరచాలనం చేసుకున్నారు. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు అనుసంధానం సింగిల్ పాయింట్ అజెండాను ఏపీ.. 13 అంశాలను తెలంగాణ ప్రతిపాదించాయి. ఇరు రాష్ట్రాల ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం అజెండాలో చేర్చింది. ఈ భేటీకి ఏపీ, తెలంగాణ జలవనరుల శాఖ మంత్రులు నిమ్మల రామానాయుడు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఇరు రాష్ట్రాల సీఎస్‌లు, జలవనరుల శాఖ కార్యదర్శులు, ఇంజినీర్లు హాజరయ్యారు. సమావేశానికి ముందు ఆయా రాష్ట్రాల అధికారులతో ఇరువురు సీఎంలు సమావేశమయ్యారు. భేటీలో లేవనెత్తాల్సిన అంశాలు, సాంకేతికంగా ఇవ్వాల్సిన సమాధానాలపై చర్చించారు. సీఎంలు తమ అధికారిక నివాసాల్లో సుమారు గంటన్నరపాటు సీఎస్‌లు, నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులతో సమీక్షించారు.

**బనకచర్లతో ఎగువ రాష్ట్రాలకు ఎలాంటి నష్టం ఉండదు: ఏపీ...** గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు అనుసంధానం సింగిల్ పాయింట్ అజెండాను ప్రతిపాదించిన ఏపీ.. ఈ ప్రాజెక్టు లక్ష్యాలను నివేదిక రూపంలో సమర్పించింది. సముద్రంలో వృథాగా కలిసే జలాలనే వినియోగిస్తామని వివరించింది. ఈ సందర్భంగా గోదావరిలో వందేళ్ల సరాసరి ప్రవాహాల గణాంకాలను పేర్కొంది. ఏటా 3వేల టీఎంసీలు సముద్రంలో కలుస్తున్నాయని తెలిపింది. బనకచర్ల ద్వారా గరిష్ఠంగా 200 టీఎంసీలే తరలిస్తామని వివరించింది. ఈ ప్రాజెక్టు వల్ల ఎగువ రాష్ట్రాలకు ఎలాంటి నష్టం ఉండదని..11 ఏళ్లుగా తెలంగాణలో కట్టిన ఏ ప్రాజెక్టుకూ అభ్యంతరం చెప్పలేదని పేర్కొంది. దిగువ రాష్ట్రంగా తమ చర్యలను తెలంగాణ, కేంద్ర ప్రభుత్వం అర్థం చేసుకోవాలని కోరింది.

**తెలంగాణ ప్రతిపాదించిన 13 అంశాలివే..** పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, డిండి ఎత్తిపోతల పథకానికి అనుమతులు ఇవ్వాలి. శ్రీశైలం నుంచి వేరే బేసిన్‌కి ఆంధ్రప్రదేశ్ నీటి తరలింపు పనులను వెంటనే ఆపేయాలి ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రారంభించిన ప్రాజెక్టులకు సహకరించేలా కృష్ణా ట్రైబ్యునల్‌లో మద్దతుగా వాదించేలా ఏపీని ఒప్పించాలి. కృష్ణానదీ జలాలను వేరే బేసిన్‌కు తరలించకుండా కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు చర్యలు తీసుకునేలా ఆదేశించాలి. కృష్ణా జలాలను అక్రమ తరలింపును అడ్డుకునేందుకు టెలిమెట్రీలను ఏర్పాటు చేసేందుకు ఏపీ అంగీకరించాలి. తుంగభద్ర బోర్డు నీటి తరలింపుపై చర్చించాలి. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పథకంపై ఎన్జీటీ ఉత్తర్వులను అమలు చేసే విధంగా కేంద్ర జలశక్తి శాఖ చర్యలు తీసుకోవాలి. ఈ పథకంపై చట్టపరంగానే ముందుకు వెళ్లాలి. శ్రీశైలం కుడి కాలువ ద్వారా ఎక్కువ నీటి తరలింపును నియంత్రించాలి. శ్రీశైలం ప్రాజెక్టులో కొత్త ప్రాజెక్టులు హంద్రీనీవా, వెలిగొండ, గురు రాఘవేంద్ర నిర్మాణాలను నియంత్రించాలి. శ్రీశైలం డ్యాం సేఫ్టీకి తగిన చర్యలు తీసుకోవాలి. శ్రీశైలం నుంచి నీటి తరలింపు ద్వారా విద్యుత్ ఉత్పత్తికి తీవ్ర విఘాతం కలుగుతోంది.. దీనిని అడ్డుకోవాలి. పోలవరం ప్రాజెక్టు తరహాలోనే ఇచ్చంపల్లి ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వాలి. ఇచ్చంపల్లి నుంచి కావేరికి గోదావరి జలాల తరలింపుకు మేము సిద్ధం. అందులో 200 టీఎంసీల నీటిని వాడుకునేందుకు అనుమతులు ఇవ్వాలి. సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వాలి. ప్రాణహిత-చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టుకు ఏఐబీపీ కింద నిధులు ఇవ్వాలి. మహారాష్ట్ర ప్రభుత్వంతో కేంద్ర ప్రభుత్వమే చర్చలు జరిపి తుమ్మిడి హట్టి వద్ద బ్యారేజ్ నిర్మాణానికి సహకరించాలి.



# దసరా నాటికి ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పూర్తి

హైదరాబాద్: ఉప్పల్‌లో ఎలివేటెడ్ కారిడార్ పనులను తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. 2017లో ప్రారంభమైన ఉప్పల్- నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ పనులు కొన్నాళ్లుగా నిలిచిపోయాయి. నిర్మాణ పనులు అర్ధంతరంగా ఆపేయడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. గుంతల రోడ్డుపై అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కొన్ని కారణాల వల్ల ఎలివేటెడ్ కారిడార్ పనులు పూర్తి కాలేదని, ఈ విషయంలో ఎవరినీ తప్పు పట్టాల్సిన అవసరం లేదన్నారు. తొలుత నిర్మాణ పనులు చేపట్టిన గాయత్రీ సంస్థ తప్పుకోవడంతో పనులను



మరో సంస్థకు అప్పగించామన్నారు. త్వరగా నిర్మాణ పనులు పూర్తి చేసి దసరా నాటికి అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి తెలిపారు.

# వారానికి 100 గంటలు పనిచేసే ఏకైక వ్యక్తి మోదీ: ఇన్ఫోసిస్ నారాయణమూర్తి



పని గంటలపై కొంతకాలంగా దేశంలో పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో వారంలో 100 గంటలు పనిచేసే వ్యక్తి ప్రధాని మోదీ మాత్రమేనని ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకులు నారాయణమూర్తి అభిప్రాయపడ్డారు. ఎంపీ తేజస్వీ సూర్య ఈ విషయాన్ని తెలిపారు. నారాయణమూర్తితో కలిసి విమానంలో ప్రయాణించగా.. తమ మధ్య పని గంటలపై చర్చ జరిగినట్లు వెల్లడించారు. ముంబయి నుంచి బెంగళూరుకు తిరిగి వెళ్తుండగా నారాయణమూర్తితో కలిసి విమానంలో ప్రయాణించినట్లు తేజస్వీ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. తమ మధ్య ఎంతో స్ఫూర్తిదాయకమైన సంభాషణ జరిగిందన్నారు. భారత ఐటీ సేవల రంగానికి నారాయణమూర్తి మార్గదర్శకత్వం వహించి.. దానిని ప్రపంచ శక్తి కేంద్రంగా మార్చారన్నారు. ఇన్ఫోసిస్ లక్షలాది మంది మధ్యతరగతి కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు కారణమవుతుందన్నారు. ఈసందర్భంగా ఏఐ, నైతిక విలువలు తదితర అంశాల గురించి కూడా తమ మధ్య చర్చకు వచ్చాయని తెలిపారు. కాగా.. 'మీరు చెప్పిన వారానికి 70 గంటలు పని చేయడానికి ప్రయత్నిస్తున్నా' అని నారాయణమూర్తితో సరదాగా చెప్పానని తేజస్వీ పేర్కొన్నారు. అందుకు 'నాకు తెలిసి వారానికి 100 గంటలు పనిచేసే వ్యక్తి ఒక్క ప్రధాని నరేంద్ర మోదీ మాత్రమే' అని ఆయన బదులిచ్చారని తెలిపారు. ప్రపంచ దేశాలతో పోటీపడాలంటే భారత్‌లోని యువత వారానికి 70 గంటల పాటు పని చేయాలని నారాయణమూర్తి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. కొందరు దీన్ని సమర్థించగా.. మరికొందరు వ్యతిరేకించారు. వారానికి 90 గంటల పాటు పని చేయాలంటూ ఎల్ అండ్ టి ఛైర్మన్ ఎస్.ఎన్. సుబ్రహ్మణ్యన్ చేసిన వ్యాఖ్యలూ నెట్టింట చర్చకు దారితీశాయి.

# పెద్దపల్లిలో వీ హబ్ ఏర్పాటు చేస్తాం: మంత్రి శ్రీధర్‌బాబు



పెద్దపల్లి: మహిళలకు ఉపాధి కల్పించే కార్యక్రమాలు చేపట్టామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. పెద్దపల్లిలో ఏర్పాటుచేసిన ఇందిరాశక్తి సంబరాల సభకు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, ఎమ్మెల్యే విజయరమణరావుతో కలిసి శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... "పెద్దపల్లి జిల్లాలో మహిళా సంఘాల నుంచి 9 బస్సులను ఆర్టీసీలో అద్దెకు తీసుకున్నాం. గతంలో కొందరు పెద్దమనుషుల నుంచే ఆర్టీసీ బస్సులు అద్దెకు తీసుకునేవారు. విద్యార్థుల యూనిఫాంలు కుట్టే పనులను మహిళా సంఘాలకే అప్పగించాం. సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు, రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసే అవకాశం కూడా మహిళలకే ఇచ్చాం. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలని ఈ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పెద్దపల్లిలో వీ హబ్ ఏర్పాటు చేస్తాం. మాజీ సీఎం కేసీఆర్ ఆంధ్ర ప్రాంతానికి నీళ్లు ఇవ్వడం గురించి మాత్రమే ఆలోచించారు. రాష్ట్ర జలహక్కుల విషయంలో ఎట్టిపరిస్థితుల్లోనూ మేం రాజీపడేది లేదు" అని శ్రీధర్‌బాబు అన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఆడబిడ్డలు ఆశీర్వదిస్తేనే ఇల్లు అయినా, ప్రభుత్వం అయినా చల్లగా ఉంటుందన్నారు. " ప్రభుత్వం ఆర్థికంగా కష్టాల్లో ఉన్నప్పటికీ ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నాం. ఏ వ్యాపారమైన మహిళలకే ఇవ్వాలని మంత్రి సీతక్క చెప్పారు. ఇల్లు ఇచ్చినా, రేషన్ కార్డు ఇచ్చినా మహిళల పేరు మీదే ఇవ్వాలంటున్నారు. రుణమాఫీ కింద రైతుల ఖాతాల్లో ఒకేసారి రూ.21వేల కోట్లు వేశాం. రైతు భరోసా కింద రైతుల ఖాతాల్లో 9 రోజుల్లోనే రూ.9వేల కోట్లు వేశాం. తక్కువ ఇబ్బందులు, ఎక్కువ ఆదాయం వచ్చే పంటలను రైతులు ఎంచుకోవాలి" అని సూచించారు.



# విశ్రాంత ఈఎన్సీ మురళీధర్‌రావుకు రిమాండ్

హైదరాబాద్: విశ్రాంత ఈఎన్సీ మురళీధర్‌రావుకు రిమాండ్ విధించారు. ఏసీబీ కోర్టు ఆయనకు 14రోజుల రిమాండ్ విధించింది. మురళీధర్‌రావును చంచల్‌గూడ జైలుకు పోలీసులు తరలిస్తున్నారు. అక్రమాస్తుల కేసులో మంగళవారం ఆయన్ను అరెస్టు చేశారు. ఆయన పేరిట భారీగా ఆస్తులున్నట్లు గుర్తించారు. మంగళవారం బంజారాహిల్స్‌లోని మురళీధర్‌రావు ఇంటితో పాటు మరో 11 ప్రాంతాల్లోనూ ఏకకాలంలో సోదాలు నిర్వహించారు.

ఆయనతోపాటు కుటుంబ సభ్యులు, బినామీల పేరిట ఉన్న చర, స్థిరాస్తుల్ని గుర్తించారు. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు తనిఖీలు కొనసాగాయి.



# 'బ్లడ్‌మనీ'కి అంగీకరించం శిక్ష పడాల్సిందే

కేరళ నర్సు నిమిష ప్రియ కేసులో తీవ్ర ఉత్కంఠ కొనసాగుతోంది. నేడు అమలుకావాల్సిన ఆమె మరణ శిక్షను యెమెన్ ప్రభుత్వం తాత్కాలికంగా వాయిదా వేయడంతో కాస్త ఊరట లభించింది. అయితే మృతుడు తలాల్ అదిబ్ మెహది కుటుంబం మాత్రం ఆమెకు శిక్ష పడాల్సిందేనని పట్టుబడుతోంది. నేరానికి క్షమాపణ ఉండదని మృతుడు సోదరుడు అబ్దుల్ ఫత్తా మెహది స్పష్టంచేశారు. ఆమెకు శిక్ష పడాల్సిందేనని, బ్లడ్‌మనీకి అంగీకరించబోమని వెల్లడించారు. శిక్ష అమలు వాయిదా అనంతరం అతడు ఫేస్‌బుక్‌లో పోస్టు పెట్టారు. "మధ్యవర్తిత్వం, సయోధ్య కోసం ప్రస్తుతం జరుగుతోన్న ప్రయత్నాలు కొత్తవేమీ కావు. మాకు ఎలాంటి ఆశ్చర్యాన్ని కలిగించడం లేదు. అలాగే మేం ఎదుర్కొన్న ఒత్తిళ్లు మా అభిప్రాయాన్ని మార్చవు. ఈ వాయిదాను మేం ఊహించలేదు. డబ్బుతో మనిషి ప్రాణానికి వెలకట్టలేం. మాకు న్యాయం దక్కాల్సిందే" అని అర్థం వచ్చేలా పోస్టులో రాసుకొచ్చారు. అలాగే దోషిని బాధితురాలిగా చిత్రీకరించే ప్రయత్నం చేయొద్దని వ్యాఖ్యానించారు.

**నిమిష ప్రియ మరణశిక్ష అమలు వాయిదా..!...** కాగా.. నిమిష మరణశిక్ష వాయిదా పడిన విషయాన్ని భారత విదేశీ వ్యవహారాల శాఖ మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. యెమెన్ జైలు అధికారులతోపాటు ప్రాసిక్యూషన్ కార్యాలయంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది. "నిమిష, బాధిత కుటుంబాలు పరస్పర అంగీకారానికి వచ్చి కేసును పరిష్కరించుకునేందుకు మరింత సమయం ఇవ్వాలని గత కొన్ని రోజులుగా యెమెన్ ప్రభుత్వాన్ని భారత్ కోరుతోంది. ఈవిషయంలో స్థానిక జైలు అధికారులు, ప్రాసిక్యూటర్‌తో నిరంతరం జరిపిన సంప్రదింపులు ఫలించాయి" అని పేర్కొంది. ఇదిలాఉంటే.. బాధిత కుటుంబానికి ఒక మిలియన్ డాలర్ల (దాదాపు రూ.8.6కోట్ల) క్షమాధనాన్ని ఇచ్చేందుకు నిమిష ప్రియ కుటుంబం సిద్ధమైంది. ఇందుకు వారు అంగీకరిస్తే.. నిమిష ప్రియకు మరణశిక్ష తప్పే అవకాశం ఉంది. ఈ క్షమాధనాన్ని తీసుకునేలా బాధిత కుటుంబాన్ని ఒప్పించేందుకు మత గురువు కాంతాపురం ఏపీ అబూబకర్ ముస్లియార్ సంప్రదింపులు జరుపుతున్నారు. ఆ చర్చలు ఎలాంటి ఫలితాన్ని ఇస్తాయోనన్న ఉత్కంఠ నెలకొంది.




# నిన్నటి ఆయుధాలతో నేటి యుద్ధం జయించలేం..

భారత్ తన రక్షణ సామర్థ్యాలను తక్షణం మెరుగుపరుచుకోవాల్సి ఉందని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అనిల్ చౌహాన్ స్పష్టం చేశారు. రేపటి టెక్నాలజీని వినియోగించి ఇవాళ యుద్ధరంగంలో పోరాడాల్సిన పరిస్థితులు నెలకొని ఉన్నాయన్నారు. అలాంటి సమయంలో నిన్నటి ఆయుధాలతో నేడు యుద్ధం చేసి జయించలేమని వ్యాఖ్యానించారు. బుధవారం దిల్లీలో జరిగిన ఒక వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. "మన వ్యూహాత్మక మిషన్లకు కీలకమైన సాంకేతికత కోసం విదేశాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలి. దిగుమతి చేసుకున్న టెక్నాలజీపై ఆధారపడటం వల్ల మన సంసిద్ధత దెబ్బతింటుంది" అని స్వదేశీ సాంకేతికతను వేగంగా అభివృద్ధి చేసుకోవాల్సిన ఆవశ్యకతను చౌహాన్ మరోసారి గుర్తుచేశారు. ఇక ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్ ప్రయోగించిన డ్రోన్లు, ఆయుధాలను సమర్థవంతంగా నిర్వీర్యం చేశామని, వాటివల్ల భారత సైన్యం, పౌరులకు చెందిన మౌలిక సదుపాయాలకు ఎలాంటి నష్టం కలగలేదని చెప్పారు.

**పహల్గాంపై ప్రధాని సమాధానమివ్వాల్సిందే: కాంగ్రెస్...** ఆపరేషన్ సిందూర్ తర్వాత ఆత్మనిర్భర్ భారత్ గురించి చౌహాన్ గతంలో కీలక వ్యాఖ్యలు చేశారు. "పాకిస్థాన్ సొంత రక్షణవ్యవస్థలు బలంగా లేకపోవడంతో చైనాపై ఆధారపడింది. భారత్ ఆకాశ్ వంటి స్వదేశీ వ్యవస్థలనే ఉపయోగించింది. స్పేస్, శాటిలైట్ ఇంటెలిజెన్స్ అందరికీ అందుబాటులో ఉంది.

మేము మా సొంత శాటిలైట్ వనరులతో సమర్థవంతంగా ఉగ్రశిబిరాలపై దాడులు నిర్వహించాం. ఆ సమయంలో చైనా లేదా విదేశీ శాటిలైట్ చిత్రాలపై దాయాది దేశం ఆధారపడింది" అని అన్నారు. స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈలు, పెద్ద పరిశ్రమలు ఇప్పుడు రక్షణవ్యవస్థలో పెట్టుబడులు పెడుతున్నాయన్నారు. "యుద్ధమంటూ వచ్చినప్పుడు నష్టం జరుగుతుంది. అయితే, నష్ట తీవ్రత కంటే.. ప్రత్యర్థులపై మన స్పందన ఎలా ఉందనేది ముఖ్యం. కేవలం మూడు రోజుల్లోనే సమర్థవంతంగా, పౌరులకు ఎలాంటి నష్టం కలిగించకుండా మేం స్పందించాం" అని చెప్పారు. భారత్ దీర్ఘకాల యుద్ధాలను ఎప్పుడూ కోరుకోదని.. దానివల్ల దేశ అభివృద్ధి మందగిస్తుందన్నారు. అలాగే రక్షణ రంగంలో ఆటోమేషన్ విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పిటిషన్లపై హైకోర్టులో విచారణ



హైదరాబాద్: మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది.

నేరెడుచెర్ల, మఠంపల్లి పీఎస్‌లలో నమోదైన కేసులను కొట్టేయాలని ఆయన మూడు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. ఎన్నికల సందర్భంగా నమోదైన కేసులను కొట్టేయాలని కోరారు. ఈ పిటిషన్లపై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. అనంతరం తదుపరి విచారణను హైకోర్టు ఈ నెల 18వ తేదీకి వాయిదా వేసింది.



# ఆలూ చిప్స్ గోదాములో అగ్నిప్రమాదం

హైదరాబాద్: జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని పాపిరెడ్డి నగర్ కాలనీలో అగ్ని ప్రమాదం జరిగింది.

సూర్య ఎంటర్ ప్రైజెస్ ఆలు చిప్స్ గోదాములో ఈ తెల్లవారుజామున మంటలు చెలరేగాయి. నివాస ప్రాంతాల్లో గోదాము ఉండటంతో కాలనీ వాసులు భయాందోళనకు గురయ్యారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకొని రెండు ఫైరింజన్లతో మంటలు ఆర్పివేశారు.

పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# రష్యాతో వ్యాపారం చేస్తే.. భారత్‌పై 100% సుంకం

ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధాన్ని ఆపేందుకు రష్యాను ఆర్థికంగా దెబ్బతీసేలా అమెరికా ప్రయత్నిస్తుంది. అందులోభాగంగా ఆ దేశంతో వ్యాపార సంబంధాలు కొనసాగిస్తున్న దేశాలపై సుంకాలు విధిస్తామని బెదిరింపులకు పాల్పడింది. ఈ క్రమంలో మాస్కో వ్యాపార సంబంధాలు కొనసాగిస్తే 100 శాతం సుంకం విధిస్తామని భారత్‌తో సహా చైనా, బ్రెజిల్ దేశాలను నాటో హెచ్చరించింది. నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టె అమెరికా సెనెటర్లతో సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 'చైనా అధ్యక్షుడు, భారత ప్రధాని, బ్రెజిల్ అధ్యక్షుడు ఎవరైనా రష్యాతో వ్యాపారం చేస్తూ.. వారి నుంచి చమురు, గ్యాస్ కొనుగోలు చేస్తే తీవ్రంగా పరిగణిస్తాం. ఆయా దేశాలపై 100 శాతం సుంకం విధిస్తాం. మాస్కోలోని ఆ వ్యక్తి (వ్లాదిమిర్ పుతిన్‌ను ఉద్దేశిస్తూ) శాంతి చర్చలకు రాకపోతే పరిస్థితి తీవ్రంగా ఉంటుంది.

మా పరిణామాలు ఈ దేశాలను తీవ్రంగా దెబ్బతీస్తాయి. కాబట్టి వ్లాదిమిర్ పుతిన్‌కు వెంటనే ఫోన్ చేసి శాంతి చర్చలను సీరియస్‌గా తీసుకోవాలని ఒత్తిడి తీసుకురండి. లేకుంటే మూడు దేశాలకు భారీ ఎదురుదెబ్బలు తగులుతాయి' అని హెచ్చరికలు చేశారు.

**రష్యా ఇంధనం కొంటే 500% సుంకం తప్పదు...** ఈసందర్భంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఉక్రెయిన్‌కు ఎయిర్‌డిఫెన్స్‌లు మాత్రమే కాకుండా క్షిపణులు భారీగా సరఫరా చేయనున్నారని వెల్లడించారు. ఇక, రష్యాపై ట్రంప్ తీసుకుంటున్న చర్యలను యూఎస్ రిపబ్లికన్ సెనెటర్ థామ్ టిల్లిస్ ప్రశంసించారు. కానీ, 50 రోజుల వరకు సమయం ఇవ్వడం తనను ఆందోళనకు గురిచేస్తుందన్నారు. ఈ సమయంలో పుతిన్ యుద్ధంలో గెలవడానికి ప్రయత్నిస్తారన్నారు. హత్యలు చేసి, మరింత భూభాగాన్ని కాజేసి ఆ తర్వాత శాంతి చర్చలకు వచ్చేందుకు ముందుకొస్తారన్నారు. ఇదిలాఉండగా.. ఉక్రెయిన్ యుద్ధం ముగింపు వ్యవహారంలో రష్యా వైఖరిపై ట్రంప్ సీరియస్‌గా ఉన్నారు. ఈసందర్భంగా యుద్ధం ముగింపునకు 50 రోజుల్లోపు ఒప్పందం కుదుర్చుకోకపోతే పెద్దఎత్తున టారిఫ్‌లు విధిస్తామని మాస్కోను హెచ్చరించారు. అయితే, ఈ బెదిరింపులను రష్యా కొట్టిపారేసింది. అదనపు ఆంక్షలను ఎదుర్కొనేందుకు తాము సన్నద్ధంగా ఉన్నట్లు ఆ దేశ విదేశాంగశాఖ మంత్రి సెర్గెయ్ లావ్రోవ్ పేర్కొన్నారు.

# అక్కినేని, దుక్కిపాటి లది అద్వితీయ అనుబంధం

## - జూలై 17...దుక్కిపాటి మధుసూదనరావు జయంతి




దుక్కిపాటి మధుసూదనరావు ( జూలై 17, 1917 మార్చి 26, 2006) కు తెలుగు సినిమాతో 1940 నుంచే అనుబంధం ఉంది. అక్కినేని నాగేశ్వరరావు సినీ జీవితాన్ని ప్రభావితం చేసిన అతి ముఖ్యుల్లో దుక్కిపాటి ఒక్కరు. అక్కినేనికి చిత్రసీమలో మార్గదర్శిగా నిలచి ఆయన నటునిగా సినీ చరిత్రలో నిలచి పోయేలా చేయడంలో ప్రధాన భూమిక పోషించారు దుక్కిపాటి. అన్నపూర్ణ పిక్చర్స్ పతాకంపై సినిమాలు సిర్మించిన ప్రముఖ తెలుగు నిర్మాత. దుక్కిపాటి 1951సెప్టెంబరు10వ తేదీన అక్కినేని నాగేశ్వరరావు, కాట్రగడ్డ శ్రీనివాసరావు, కొరటాల ప్రకాశరావు టి.వి.ఎ.సూర్యారావు లతో కలసి అన్నపూర్ణ పిక్చర్స్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థను స్థాపించి, మొదటి ప్రయత్నంగా “దొంగరాముడు” సినిమాను తీశారు. దుక్కిపాటి తనని అమ్మకన్నా మిన్నగా పెంచి పోషించిన సవతితల్లి అన్నపూర్ణ పేరుతో నిర్మాణ సంస్థను ప్రారంభించారు. దానికి అక్కినేని నాగేశ్వరరావుని ఛైర్మన్ ను చేశారు. కృష్ణా జిల్లా గుడివాడ తాలూకా పెయ్యేరు గ్రామంలో దుక్కిపాటి మధుసూదనరావు జూలై 17, 1917 న సంపన్న వ్యవసాయ కుటుంబంలో గంగాజలం, సీతారామ స్వామి దంపతులకు జన్మించారు. బందరు నోబుల్ కళాశాలలో బి.ఏ చదివారు. ఆంధ్రా యూనివర్సిటీ స్థాయిలో ఇంగ్లీష్ సబ్జెక్ట్ లో యూనివర్సిటీ గోల్డ్ మెడల్ సాధించారు. చదువు పూర్తి చేసుకున్న దుక్కిపాటి, తాను కార్యదర్శిగా ఎక్సెల్సియల్ క్లబ్బు అనే నాటక సంస్థను ప్రారంభించారు. కోడూరి అచ్చయ్య, ఎం.ఆర్.అప్పారావు వంటి మిత్రులతో కలసి ఆ క్లబ్బు పక్షాన నాటకాలు విరివిగా ప్రదర్శించారు. ఎక్సెల్సియల్ క్లబ్బులో దుక్కిపాటితో పాటు పెండ్యాల, బుద్ధిరాజు శ్రీరామమూర్తి వంటివారు ఉండేవారు. వారి సహకారంతో ఆయన ఆశాజ్యోతి, సత్యాన్వేషణ, తెలుగుతల్లి వంటి సాంఘిక నాటకాలను రాయించి చేపట్టారు. అవి ఘన విజయాలను నమోదు చేసుకున్నాయి. ఆ సమయంలో దుక్కిపాటికి అక్కినేనితో పరిచయం విచిత్రంగా కలిగింది. అప్పటికే అక్కినేని ధర్మపత్ని చిత్రంలో నటించి వెనక్కి వచ్చేశారు. బుద్ధిరాజు శ్రీరామమూర్తి సలహాతో ‘విప్రనారాయణ’ నాటకంలో దేవదేవి పాత్ర పోషిస్తున్నారు. ఆ నాటక ప్రదర్శన చూసిన దుక్కిపాటి, తమకు కథానాయిక/స్త్రీ పాత్ర లేని లోటు తీరిందని అక్కినేనిని హీరోయిన్ని చేశారు. అలా వారంతా నాటకాల్లో బిజీగా ఉన్నప్పుడే ఘంటసాల బలరామయ్య ఓ రైల్వేస్టేషన్లో అక్కినేనిని చూసి తన సినిమాకు ఆయనే తగిన వ్యక్తి అని నిర్ధారించుకొని చిరునామా తీసుకొన్నారు. తర్వాత గుడివాడకు వచ్చి అక్కినేనికి కబురు చేశారు. దుక్కిపాటి, రామబ్రహ్మం (అక్కినేని సోదరుడు) ఇద్దరూ అక్కినేనిని ఘంటసాల బలరామయ్య వద్దకు తీసుకెళ్లారు. ఆయన వారిని మద్రాసు కొచ్చి ‘ప్రతిభ’ ఆఫీసులో సంప్రదించ మన్నారు. దుక్కిపాటి, మరో మిత్రుడు సూర్యప్రకాశరావుతో కలసి అక్కినేనిని తీసుకొని మద్రాసులో ‘ప్రతిభ’ ఆఫీసుకు వెళ్లగా, పేకేటి అక్కినేని స్వాగతించారు. అలా ‘సీతారామ జననంలో అక్కినేని హీరో అయ్యారు. ఆ తర్వాత దుక్కిపాటి, బలరామయ్య, చల్లపల్లి రాజాలతో కలసి గూడవల్లి రామబ్రహ్మం దగ్గరకెళ్లి అక్కినేనిని ‘మాయాలోకం’లో చిత్రానికి తీసుకొమ్మని సూచించారు. దుక్కిపాటి మధుసూదనరావు తనని అమ్మకన్నా మిన్నగా పెంచి పోషించిన సవతితల్లి “అన్నపూర్ణ” పేరుతో నిర్మాణ సంస్థను ప్రారంభించారు. దానికి అక్కినేని నాగేశ్వరరావుని ఛైర్మన్ని చేశారు. ఆ సంస్థ ద్వారా తొలిసారి “దొంగరాముడు” చిత్రం నిర్మించారు. కె.వి.రెడ్డి దర్శకత్వంలో అక్కినేని, సావిత్రల జంట కన్నుల పండువుగా నటించడంతో అది ఘనవిజయం సాధించింది. దుక్కిపాటి ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. తోడికోడళ్ళు, మాంగల్యబలం, వెలుగునీడలు, చదువుకున్న అమ్మాయిలు, ఇద్దరు మిత్రులు, డాక్టర్ చక్రవర్తి, ఆత్మ గౌరవం, పూలరంగడు, విచిత్రబంధం, ప్రేమలేఖలు, రాధాకృష్ణ, పెళ్లీడు పిల్లలు, అమెరికా అబ్బాయి... వంటి అద్భుతమైన చిత్రాలెన్నో దుక్కిపాటి నిర్మించారు. డాక్టర్ చక్రవర్తి చిత్రం రాష్ట్ర ప్రభుత్వం నెలకొల్పిన తొలి నంది అవార్డును అందుకోవడం విశేషం. అధిక చిత్రాలు ఘనవిజయం సాధించాయనడంలో సందేహం లేదు. తెలుగులో ద్విపాత్రాభినయం చేసిన మొదటి సినిమా “ఇద్దరు మిత్రులు”. అన్నపూర్ణ సంస్థ నిర్మించే సినిమాలకు ఎక్కువగా ఆదుర్తి సుబ్బారావు దర్శకత్వం వహించే వారు. దుక్కిపాటి తన సినిమాలలో కొర్రపాటి గంగాధరరావు, యుద్దనపూడి సులోచనరాణి, గొల్లపూడి మారుతీరావు, ముప్పాళ్ల రంగనాయకమ్మ (సంభాషణల రచయిత్రి), కె.విశ్వనాథ్ (దర్శకుడు), ఆశాలత కులకర్ణి, జి. రామకృష్ణ, జీడిగుంట రామచంద్ర మూర్తి, శారద వంటి కళాకారులను పరిచయం చేశారు. తెలుగు చలనచిత్ర పరిశ్రమ హైదరాబాద్‌కు తరలి రావడానికి అక్కినేనితోపాటు దుక్కిపాటి మధుసూదనరావు ఎంతో కృషి చేశారు. అందుకే ప్రతిష్ఠాత్మకమైన రఘుపతి వెంకయ్య అవార్డుతో రాష్ట్ర ప్రభుత్వం ఆయన్ని సత్కరించింది. అలా దుక్కిపాటి, అక్కినేని ఇద్దరూ తమ సంబంధం, బంధం, అనుబంధం అద్వితీయం అని నిరూపించారు. దుక్కిపాటి 90 యేళ్ళ వయసులో 26 మార్చి, 2006 రోజున మరణించారు.

**రామ కిష్టయ్య సంగనభట్ల - 9440595494**

# తెలంగాణ ఉద్యమ స్వరం...బహుజన చైతన్యానికి సజీవ రూపం...ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్




ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్ - తెలంగాణ ఉద్యమ చరిత్రలో ఓ మేధో దీప్తి, బహుజన హక్కుల కోసం నిరంతరం పోరాడిన మానవతా వాది. ఆయన జీవితం సాధారణమైనది కాదుబీ సామాజిక అసమానతల పట్ల ప్రశ్నించే దీక్షతో నిండినది. సామాజిక న్యాయమే ధ్యేయంగా, తెలంగాణలో వెనకబడిన కులలాను ఒకే వేదిక మీదికి రప్పించి, ఉద్యమం నిర్మాణం కోసం అహరహం శ్రమించిన సామాజిక సేవా తత్పరుడు, సామాజిక న్యాయ జె ఎ సి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ ప్రభంజన్. కేంద్ర ప్రభుత్వంలోని ఉద్యోగ హోదాల బంధాల నుండి బయటకు వచ్చి తెలంగాణ ఉద్యమానికి, బహుజన చైతన్యానికి తన జీవితాన్ని అంకితంగా పెట్టిన ఆయన ఆచరణ వాది, తాత్విక నాయకుడు, సంఘ సంచాలకుడు. ఆయన మరణం తెలంగాణ ప్రజాస్వామ్య ఉద్యమానికి తీరని లోటుగా నిలిచింది. ప్రభంజన్ యాదవ్ జనగామ జిల్లా పాలకుర్తి మండలం గూడూరు గ్రామంలో జన్మించారు. బీసీ వర్గానికి చెందిన ఆయన విద్యాభ్యాసంలో మేధస్సుతో ముందంజ వేస్తూ కేంద్ర ప్రభుత్వంలోని ఆల్ ఇండియా రేడియో, తదుపరి ఢిల్లీలోని ప్లానింగ్ కమిషన్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో పనిచేశారు. అయితే వ్యక్తిగత పురోగతికి తలవంచని ఆయన, సమాజంలోని వలసబాట పట్టిన వర్గాల శ్రేయస్సే తన ధ్యేయంగా భావించారు. పదవులు, హోదాలు వదిలిపెట్టి ప్రజా సేవకే తన జీవన యానం అంకితం చేశారు. ఆయన కార్యదీక్ష, అంకిత భావం, చిత్తశుద్ధి ఓ ఆదర్శ అద్భుత ఉదాహరణగా నిలుస్తుంది. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం జోరందుకున్న కాలంలో ఆయన ధ్వని ప్రత్యేకంగా వినిపించేది. కేవలం ప్రాంతీయ భావోద్వేగానికి పరిమితం కాకుండా, తెలంగాణ ఉద్యమాన్ని బహుజన సమాజం సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం కోసం చేసే సంక్లిష్ట పోరాటంగా ఆయన చూపించారు. తెలంగాణ కోసం ఎందుకు ప్రత్యేక రాష్ట్రం కావాలి అనే ప్రశ్నకు సమాజ శాస్త్రపరమైన, చారిత్రక ఆధారాలపై నిలబడి సమగ్రమైన సమాధానాలు అందించిన అరుదైన ఆలోచనా నాయకుడు. తెలంగాణ బహుజన చరిత్ర, వారి సమస్యలు, అభ్యుదయ మార్గాలపై ఆయన అనేక వేదికల్లో ప్రసంగిస్తూ ప్రజల్లో చైతన్యం రగిలించారు.

ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్ రచనా రంగంలోనూ తన మేధస్సును చాటి చెప్పారు. అనేక సామాజిక, రాజకీయ అంశాలపై ఆయన వ్యాసాలు, పుస్తకాలు వెలువరించారు. అంబేద్కర్, ఫూలే, పెరియార్, కంచె ఐలయ్యల తాత్విక దార్శనికత్వాన్ని అభ్యసించి, తనదైన విలక్షణ దృక్కోణంతో తెలంగాణ కదలికలకు మార్గనిర్దేశం చేశారు. ఆయన అభిప్రాయాల్లో స్పష్టత, తీక్షణత, మరియు ప్రజల పట్ల బాధ్యత కలగలసినవి. ఆయన మాట్లాడే ప్రతి మాటలో సమస్యల పట్ల తీవ్రత, పరిష్కారాల పట్ల ఆశాభావం ఉండేది. కళాశాలల్లో అధ్యాపకుడిగా ఉన్న సమయంలో ఆయన విద్యార్థుల్ని కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా సమాజంపై ఆలోచించే యువతగా తీర్చిదిద్దే ప్రయత్నం చేశారు. విద్య ద్వారా సమాజాన్ని మారుస్తున్న తాత్విక దిశ ఆయన నమ్మకం. పలు తరం విద్యార్థులకు ఆయన మార్గదర్శిగా నిలిచారు. ఉద్యమాల తీరులో మార్పులు తెచ్చేందుకు విద్యారంగం నుంచే ప్రారంభించాలన్న సంకల్పంతో ఆయన సాగిన ప్రయాణం యువతలో విశేష స్పందనకు దారి తీసింది. ప్రభంజన్ యాదవ్ సామాజిక అనుసంధానాలే కాకుండా, వ్యక్తిత్వం కూడా ఎంతో గౌరవనీయం. ఆయన వ్యక్తిగత జీవితంలో ఒంటరిగా నిలబడి ఉద్యమాన్ని నడిపిన తీరు ఎంతో మందికి ఆదర్శంగా నిలిచింది. నిస్వార్థ సేవా దృక్పథం, చిత్తశుద్ధితో కూడిన ఉద్యమ అనుభూతి ఆయనను నిస్సందేహంగా ఓ గొప్ప ప్రజా మేధావిగా నిలిపాయి. ఆయన బహుజన చైతన్యం కోసం చెప్పిన ప్రసంగాలు, రాసిన రచనలు, శ్రమించిన సంఘటనలు అన్ని కలిపి ఒక ఉద్యమోద్యమ పాఠశాలగా నిలిచాయి. 2025 జూలై 16న ఆయన హైదరాబాద్‌లో మృతి చెందారు. కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతూ కూడా ప్రజల మధ్య ఉండే ప్రయత్నం చేశారు. ఆయన చివరి రోజుల్లో కూడా తను నమ్మిన సిద్ధాంతాలకే కట్టుబడి జీవించారు. ఆయన మృతిపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ స్పందిస్తూ...తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో జర్నలిస్టు మేధావిగా, యాక్టివిస్ట్‌గా ప్రభంజన్ యాదవ్ చేసిన కృషిని మరువలేనిదని అన్నారు. ప్రొఫెసర్ కంచె ఐలయ్య, ఇతర సాహితీవేత్తలు, విద్యావేత్తలు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ‘ఇంత స్పష్టతతో మాట్లాడే బహుజన తాత్వికుడు నేడు తెలుగునాట అరుదు’ అనే మాటలు పలువురు అన్నారు. ప్రభంజన్ యాదవ్ గారి జీవితం మనకు కొన్ని ముఖ్యమైన బోధనలు ఇస్తుంది. సమాజంలో మార్పు తెచ్చాలంటే మొదట మనమే మారాలి. భవిష్యత్ తరాలకు సమాన హక్కులు, సమాన అవకాశాలు కల్పించాలంటే త్యాగంతో కూడిన ఉద్యమ ధోరణి అవసరం. సమాజాన్ని నిద్రలేపే ధ్వని అవసరం. ఆయన ధ్వని అలా వినిపించిన గొంతు. తెలంగాణ ఉద్యమం ఆయనను స్ఫూర్తిగా తీసుకుని సాగితేనే ఆయన ఆశయాలకు సార్థకత చేకూరుతుంది. ఆయన జీవితం, రచన, ఉద్యమం %-% ఇవన్నీ కలిపి తెలుగు సమాజానికి ఓ గొప్ప వారసత్వంగా మిగిలిపోతాయి. ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్ వంటి మేధావులు సామాజిక పరివర్తనకు అంతులేని దీపాలు. వారు వెలిగించిన వెలుగు ఎన్నటికీ మింగి పోదు. వారు చూపిన మార్గం ఎన్నటికీ కనుమరుగవదు. తెలంగాణకు ఆయన ఒక విలువైన ఆస్తి. ఆయన చరిత్రను, తాత్వికతను భవిష్యత్ తరాలు గుర్తు పెట్టుకోవాలి. ఆయన నడిపిన దీక్షార్థాన్ని కొనసాగించాల్సిన బాధ్యత ప్రతి సామాజిక కార్యకర్తకు ఉంది. ఆయన పేరుని చెరగని అక్షరాలుగా లిఖించుకోవాలి. ఉద్యమం కొనసాగాలి... ఉద్యమ స్ఫూర్తి నిండాలి... ప్రభంజన్ యాదవ్ చూపించిన మార్గంలో ప్రజలు ముందుకెళ్లాలి. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# విలక్షణ నటుడు రంగనాథ్

## జూలై 17... రంగనాథ్ జయంతి



ఒక విలక్షణమైన నటునిగా, హీరోగా, క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా, కవిగా రచయితగా దర్శకుడిగా తెలుగు ప్రజల హృదయాలలో సుస్థిర స్థానాన్ని పొందారు రంగనాథ్ గా సుపరిచితులయిన తిరుమల సుందర శ్రీరంగనాథ్. అవకాశం చేతులోకి వచ్చీ, సమయాను కూలంగా లేక రెండు సినిమాలలో హీరోగా నటించే అవకాశం కోల్పోవడం, రెండు చిత్రాలలో నటించిన ఇరువురు హీరోలుగా దూసుకు వెళ్ళిన సంఘటనలను రంగనాథ్ పలు సందర్భాలలో వెల్లడించే వారు. రంగనాథ్ కుటుంబంలో ఎవరు సినీ నేపథ్యం ఉన్న వారు కారు. తాతగారి ఇంట్లో ఆయన పెరిగిన వాతావరణం ఆయనను కళాకారుడిగా మారేలా చేసింది. తాతగారి ఇంట్లో అందరూ గాయకులు కావడంతో రంగనాథ్ కూడా ఏదో ఒక కళలో రాణించాలి అనే భావించగా, చిన్నతనంలో నాటకరంగం వైపు దృషి నిలిపి, అనేక నాటకాలలో వివిధ పాత్రలను వేసారు. అక్కడినుంచి సినీరంగం వైపు రావాలనే ఆకాంక్ష మొదలైంది. తల్లి ప్రోత్సాహం కూడా తోడైంది. రంగనాథ్ తల్లి జానకి గాయని కావాలనుకునే వారట. అదే టైమ్‌లో ఎస్.జానకి కూడా గాయని అయ్యారు. కొన్ని కారణాల వల్ల ఆవిడ కోరిక నెరవేరక పోవడంతో కొడుకు అయినా ఆర్టిస్టు కావాలనుకుంది. దక్షిణాది సినీ రాజధానిగా ఉన్న చెన్నై నగరంలో 1949లో జూలై 17న టి.ఆర్.సుందరరాజన్, జానకీదేవి దంపతులకు జన్మించిన రంగనాథ్, 1969లో బుద్ధిమంతుడు సినిమాతో తొలిసారి వెండితెరపై కనిపించారు. చందన (1974) చిత్రంలో హీరోగా ప్రేక్షకుల ముందుకొచ్చారు. ఆయన తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం నుండి డిగ్రీ చేశారు. రైల్వేశాఖలో టికెట్ కలెక్టర్‌గా కొంతకాలం పనిచేశారు. బాపు తీసిన అందాల రాముడులో రాముని వేషానికి అయాచితంగా , అనూహ్యంగా అవకాశం తలుపు తట్టింది. అదే సమయంలో గిరిబాబు ఆయనను హీరోగా పెట్టి సినిమా తీయాలని అనుకున్నారు. దానిలో నటిస్తున్న సమయాన హీరో అవకాశాలు తప్పిపోయాయి. రెండు సినిమాలు చేజారి పోయాయి. ‘ఇద్దరూ ఇద్దరే’లో కృష్ణంరాజు, నటించి పైకొచ్చారు. ‘భారతంలో అమ్మాయి’లో మురళీమోహన్ హీరోగా చేసి క్లిక్ అయ్యారని రంగనాథ్ పలు సందర్భాలలో చెపుతుండే వారు. అలా 1969లో బుద్ధిమంతుడు సినిమాతో వెండితెరకు పరిచయమై సుమారు 300 సినిమాలలో నటించాడు. హీరోగా, విలన్‌గా, క్యారెక్టర్ నటుడిగా సినిమా ప్రేక్షకులను మెప్పించారు. మొగుడ్స్ పెళ్లామ్స్ చిత్రానికి దర్శకత్వం వహించారు. కొన్ని టీ.వీ.సీరియళ్లలో కూడా నటించారు. ఎక్కువగా కుటుంబ కథా చిత్రాల్లో నటించటం ఆయనను మహిళ ప్రేక్షకులకు దగ్గర చేసింది. కానీ సినీ రంగంలో వచ్చిన మార్పులు కారణంగా కెరీర్ స్టార్టింగ్ లోనే ఒడిదుడుకులు వచ్చాయి. దీంతో మరో మార్గం లేక విలన్ గా మారారు. ‘గువ్వల జంట’ సినిమాతో తొలి సారిగా ప్రతి నాయక పాత్రలో అలరించారు. ఆ తరువాత క్యారెక్టర్ ఆర్టిస్ట్ గాను మెప్పించారు. వెండితెర మీదే కాదు.. బుల్లి తెర మీద కూడా తన నటనతో ఆకట్టుకున్నారు. రంగనాథ్ పౌరాణిక నేపథ్యంతో తెరకెక్కిన భాగవతం సీరియల్ తో పాటు, రాఘవేంద్రరావు దర్శకత్వ పర్యవేక్షణలో తెరకెక్కిన శాంతినివాసం సీరియల్ లోనూ కీలక పాత్రలో నటించారు. రంగనాథ్ నటుడే కాదు మంచి కవి, రచయిత కూడా. వీరు రచించిన కవితా సుదర్శనం, అంతరంగ మథనం, ఈ చీకటి తొలగాలి, పద పరిమళం, అక్షర సాక్ష్యం, రంగనాథ్ కథలు, రంగనాథ్ నడత పుస్తకాలు అచ్చయ్యాయి. సినీరంగంతో అనుబంధాన్ని కొనసాగిస్తున్న ఆయన అర్థాంతరంగా డిసెంబరు 19, 2015 న హైదరాబాదు లోని తన స్వగృహంలో ఆత్మ హత్యకు పాల్పడి లోకాన్ని వదిలి వెళ్లారు.

**రామ కిష్టయ్య సంగనభట్ల - 9440595494**

# ‘సాఫ్ట్ వేర్’ కల చెదురుతోంది..?



ఒకప్పుడు ఇంజనీరింగ్ సీటు వస్తే జీవితం స్థిరపడిపోయి నట్టేనని చాలామంది నమ్మేవారు. మంచి కాలేజీలో సీటు వస్తే ఇక తిరుగులేదని భావించేవారు. కానీ కాలం మారింది. ఇప్పుడు ఐఐటీలు వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో చదివిన విద్యార్థులకు కూడా క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలు రావడం కష్టంగా మారింది. ఇక సాధారణ కాలేజీల పరిస్థితి చెప్పనక్కర్లేదు.

**- ప్రాక్టికల్ స్కిల్స్ లోపం ప్రధాన కారణం...** ఈ పరిస్థితికి ప్రధాన కారణం విద్యార్థులలో ప్రాక్టికల్ స్కిల్స్ లోపించడమే. కేవలం మార్కుల కోసం చదివి, సబ్జెక్టుపై లోతైన అవగాహన లేదా ఆసక్తి లేనివారు ఉద్యోగాల్లో అవసరమయ్యే నైపుణ్యాలను పెంపొందించుకోలేకపోతున్నారు. కోర్సు పూర్తయితే చాలు అనే ధోరణి మారాలి. ఉద్యోగం అనేది మెరుగైన నైపుణ్యం ఉన్నవారికే లభిస్తుంది. కేవలం సర్టిఫికేట్ ఉన్నవారికే కాదు.

**- ఐటీ రంగంపై ఏఐ ప్రభావం....** ఎంట్రీ-లెవల్ ఐటీ ఉద్యోగాలు వేగంగా కృత్రిమ మేధస్సు (%ూ×%) తో భర్తీ అవుతున్నాయి. గతంలో ముగ్గురు వ్యక్తులు చేయాల్సిన పనిని ఇప్పుడు ఒక వ్యక్తి AI సహాయంతో తక్కువ ఖర్చుతో పూర్తి చేయగలుగుతున్నారు. మధ్యస్థాయి, చిన్న కంపెనీలు ఈ మార్పును మరింత వేగంగా అమలు చేస్తూ ఉద్యోగ అవకాశాలపై మరింత ఒత్తిడిని పెంచుతున్నాయి. అమెరికాలో కంప్యూటర్ సైన్స్ గ్రాడ్యుయేట్లలో నిరుద్యోగ శాతం 7.5% ఉండటం ఆందోళన కలిగించే విషయం. యూకేలో ఒక్క ఇంటర్వ్యూ అవకాశం పొందడానికి 1000 అప్లికేషన్లు సమర్పించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**-ఇతర రంగాల్లో అవకాశాలు...** ఐటీ రంగం మాత్రమే కాదు, అనేక ఫీల్డ్-బేస్డ్ రంగాలు ఇంకా %ూ×% ప్రభావానికి అతీతంగా ఉన్నాయి. ఉదాహరణకు చూస్తే.. నిర్మాణ రంగంలో సివిల్ ఇంజనీర్లు, ఆర్కిటెక్టులు, సైట్ సూపర్వైజర్లకు డిమాండ్ ఉంది. ఫ్యాక్టరీ పనుల్లో మెకానికల్, ఎలక్ట్రికల్ రంగాల్లో హ్యాండ్స్-ఆన్ (ప్రత్యక్ష) ఉద్యోగాలు ఉన్నాయి. ప్లంబింగ్, కార్పెంటరీ, ఎలక్ట్రీషియన్ వృత్తులకు మార్కెట్లో ఫుల్ డిమాండ్ ఉంది. ఇవన్నీ “డిగ్నిటీ ఆఫ్ లేబర్” ఉన్న ఉద్యోగాలు, వాటి అవసరం ఎప్పటికీ ఉంటుంది. వీటిలో ఆధునికతను జోడించి కొత్త మార్గాలను అన్వేషించాలి.

**- AI తో పోటీకి కొత్త నైపుణ్యాలు అవసరం** AI వల్ల కొన్ని ఉద్యోగాలు కనుమరుగు అవుతున్నప్పటికీ, అనేక కొత్త ఉద్యోగాలు కూడా పుట్టుకొస్తున్నాయి. మెషీన్ లెర్నింగ్ ఇంజనీర్, AI ట్రైనర్, చాట్‌బాట్ టెస్టర్, డేటా లేబలర్, మోడల్ ఆడిటర్ లాంటివి కొత్తగా వచ్చాయి. ఈ కొత్త ఉద్యోగాలను పొందాలంటే కొత్త నైపుణ్యాలను నేర్చుకోవాలి. ప్రస్తుత విద్యా వ్యవస్థ ఈ దిశగా మారాలి. విద్యార్థులు కూడా మార్కులకు పరిమితం కాకుండా ప్రాక్టికల్ నాలెడ్జ్ , అప్లికేషన్-బేస్డ్ లెర్నింగ్ పై దృష్టి పెట్టాలి. విద్యార్థులు కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా, ప్రాక్టికల్ స్కిల్స్ నేర్చుకోవాలి. ఇంటర్న్‌షిప్‌లు, ప్రాజెక్టులు, స్టార్టప్ మైండ్‌సెట్ ను మెరుగుపరచుకోవాలి. కళాశాలలు ఆధునిక టెక్నాలజీలపై ఆధారపడే కరిక్యులమ్ ను అమలులోకి తేవాలి. తల్లిదండ్రులు ఐటీ ఉద్యోగమే అన్న లక్ష్యాన్ని తొలగించి, పిల్లల ఆసక్తులకు తగ్గ దారిని ప్రోత్సహించాలి. ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థలు, వృత్తి విద్యను ప్రోత్సహించాలి. యువత నూతన రంగాల్లో అవకాశాలు ఎక్కడున్నాయో తెలుసుకొని, ఆ దిశగా అడుగులు వేయాలి. ఐటీ రంగం పూర్తిగా అంతరించిపోయినట్టేమీ కాదు. కానీ పాత విధానాలు మరిచిపోవాలి. కొత్త శిక్షణ, కొత్త అభిరుచులు, కొత్త పనితీరు అవసరం. “ఐటీ జాబ్ అంటే లైఫ్ సెటిల్” అన్న కాలం ముగిసింది. ఇప్పుడు ఎవరికైతే నైపుణ్యం, స్మార్ట్ వర్క్ ఉన్నాయో వారికే ముందుకు వెళ్లే అవకాశముంది. అందుకే యువతా, మార్పును అంగీకరించండి, కొత్త విషయాలు నేర్చుకోండి, ఆచరణలో పెట్టండి. ఈ మారిన యుగంలో మీ స్థానాన్ని మీరు ఖచ్చితంగా సంపాదించుకోగలరు.

చురకలు

## సంపాదకీయం

### సింగపూర్: ఖరీదైన నగరంగా అగ్రస్థానం.. కారణమేంటి?

విలాసవంతమైన జీవనం కోరుకునే ధనవంతులకు ప్రపంచవ్యాప్తంగా ఎన్నో నగరాలు ఆకర్షణీయంగా నిలుస్తుంటాయి. అయితే తాజాగా విడుదలైన జూలియస్ బేర్ 'గ్లోబల్ వెల్త్ అండ్ లైఫ్‌స్టైల్ రిపోర్ట్ 2025' ప్రకారం, సింగపూర్ వరుసగా మూడోసారి ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన నగరంగా తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. ఈ నివేది క కనీసం ఒక మిలియన్ డాలర్ల సంపద కలిగిన వ్యక్తులు వినియోగించే విలాస వస్తువులు, సేవల వ్యయాలను విశ్లేషిస్తుంది. 2025 ఫిబ్రవరి–మార్చి మధ్య సేకరించిన డేటాను ఆధారంగా చేసుకుని ఈ 'లైఫ్‌స్టైల్ ఇండెక్స్' రూపొందించబడింది.

**సింగపూర్ ఇంత ఖరీదైన నగరంగా మారడానికి కారణాలేంటి?...** సింగపూర్ అత్యంత ఖరీదైన నగరంగా మారడానికి అనే క కారణాలున్నాయి. ఈ నగరం ఆర్థికంగా, రాజకీయంగా అత్యంత స్థిరమైన వాతావర ణాన్ని కలిగి ఉంది. అంతర్జాతీయ వ్యాపా రాలకు అత్యంత అనుకూలమైన వాతావ రణాన్ని అందిస్తుంది. విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి తీసుకున్న విధానపరమైన మార్పులు కూడా ఒక కారణం. స్థానికులు విలాసవంతమైన వస్తువులు, సేవలపై అధికంగా ఖర్చు చేస్తుంటారు. ముఖ్యంగా బంగారం, హెల్త్‌కేర్, విద్య, ఫుట్‌వేర్, ఆహా రం వంటి రంగాల్లో సింగపూర్‌లో ఖర్చులు గణనీయంగా ఎక్కువగా ఉన్నాయి. ఈ అంశాలన్నీ కలసి సింగపూర్‌లో జీవన వ్యయాన్ని గణనీయంగా పెంచి, ఈ నగరాన్ని అగ్రస్థానంలో నిలబెట్టాయి.

**– హాంగ్‌కాంగ్‌ను వెనక్కి నెట్టి లండన్‌కు రెండో స్థానం...** గత ఏడాది రెండో స్థానంలో ఉన్న హాంగ్‌కాంగ్ ఈసారి మూడో స్థానానికి పడిపోయింది. దాని స్థానంలో లండన్ రెండో స్థానాన్ని దక్కించుకుంది. యూరప్‌లోని జ్యూరిచ్, మిలాన్, పారిస్ వంటి నగరాలు కూడా అత్యంత ఖరీదైన నగరాల జాబితాలో తమ స్థానాన్ని పదిలం చేసుకున్నాయి.

**టాప్ 10 ఖరీదైన నగరాల జాబితా:....** 1. సింగపూర్, 2. లండన్ 3. హాంగ్‌కాంగ్ 4. షాంఘై 5. మొనాకో 6. జ్యూరిచ్ 7. న్యూయార్క్ 8. పారిస్ 9. సావో పాలో 10. మిలాన్

**– అంతర్జాతీయ పరిణామాల ప్రభావం...** నివేదిక ప్రకారం, కరోనా అనంతర పరిస్థి తులు మెరుగుపడినప్పటికీ, ద్రవ్యోల్బణం, భౌగోళిక రాజకీయ అనిశ్చితి, విదేశీ మారక ద్రవ్య మార్పుల ప్రభావం ఇంకా కొనసాగు తూనే ఉంది. ఈ అంశాలు ప్రపంచ వ్యాప్తంగా నగరాల జీవన వ్యయాలపై ప్రభావం చూపుతున్నాయి. విలాసవంతమైన జీవితం అనేది చాలా మందికి ఒక స్వప్నం. అయితే, దానిని పొందడానికి అయ్యే ఖర్చు కూడా అదే స్థాయిలో పెరుగుతుందని ఈ నివేదిక స్పష్టం చేస్తుంది. ప్రపంచంలోని ధనవంతులకే సరిపోయే నగరాల్లో, సింగపూర్ మరోసారి తన అగ్రస్థానాన్ని నిల బెట్టుకోవడం ఆకట్టుకుంటుంది. అయితే, సాధారణ వ్యక్తులకు మాత్రం ఈ నగరాలు ఒక సుదూర స్వప్నంగానే మిగిలిపోవచ్చు.

# ఉపాసన, ఉపవాసాలకు ఉద్దిష్టమైనది దక్షిణాయణం




మన పూర్వీకులు సూర్య భగవానుని గమనం ప్రకారం యుగాలుగానూ, యుగాలను సంవత్సరములుగానూ, సంవత్సరములను మాసములు గానూ, మాసములను వారములు గానూ, వారములను రోజులు గానూ, రోజులను జాములు గానూ, జాములను ఘడియలు గానూ కాల గమనాన్ని తెలుసు కోవటానికి విభజించారు. సంవత్సరంలో ఉన్న 12 మాసములను రెండు ఆయనాలుగా విభజించారు. సూర్య భగవానుడు మకర రాశిలో ప్రవేశించినప్పుడు ఉత్తరాయణం, కర్కాటక రాశిలో ప్రవేశించినప్పుడు దక్షిణాయణం ఏర్పడతాయి. ఖగోళ శాస్త్రం ప్రకారం జనవరి 15 నుంచి జూలై 16 వరకు ఉత్తరాయణం, జూలై 17 నుంచి జనవరి 14 వరకు దక్షిణాయనం అని అంటారు. సాయన ఉత్తరాయణం ప్రతి సంవత్సరం డిశంబర్ 21–22 తేదీల్లో ప్రారంభం అవుతుంది. అలాగే సాయన దక్షిణాయణం జూన్ 21–22 తేదీల్లో ప్రారంభం అవుతుంది. అయితే భారతీయ గ్రహగణితం నిర్ణయ గణితం కాబట్టి ఆయనాంశ కారణంగా సాయన, నిర్ణయ సంక్రాంతుల్లో ఇలా మార్పు కననిపిస్తుంది. ఖగోళ శాస్త్రం ప్రకారం.. సూర్యుడి గమనంలో మార్పులే ఉత్తరాయణ, దక్షిణాయనాలు. 'అయనం' అంటే ప్రయాణం అని అర్ధం. దక్షిణాయనం అంటే దక్షిణ దిశగా ప్రయాణం చేయడమనే అర్ధం వస్తుంది. సూర్యుడు తూర్పు దిశలో ఉదయిస్తాడని తెలుసు. కానీ సూర్యోదయాన్ని గమనిస్తే, అది తూర్పు దిక్కున జరగదు. సూర్యుడు సరిగ్గా తూర్పు దిశ మధ్యలో ఉదయించేది ఏడాదిలో 2 రోజులు మాత్రమే. అవి మార్చి 21, సెప్టెంబరు 23. మిగతా ఆరు నెలలు ఈశాన్యానికి దగ్గరగా, మరో 6 నెలల ఆగ్నేయానికి దగ్గరగా సూర్యోదయం జరుగుతుంది. సూర్యుడు ఈశాన్యానికి దగ్గరగా ఉదయించే కాలాన్ని ఉత్తరాయణం అని, ఆగ్నేయానికి దగ్గరగా ఉదయించే కాలాన్ని దక్షిణాయణం అని అంటారు. ఈ దక్షిణాయనంలో సూర్యుడు భూమధ్య రేఖకు దక్షిణ దిశలో పయనిస్తాడు. సూర్య గమణాన్ని బట్టి మన భారతీయులు కాలాన్ని రెండు భాగాలుగా విభజించారు . భూమధ్యరేఖకు ఉత్తరదిశలో సూర్యుడు కనిపిస్తే ఉత్తరాయణమని, దక్షిణంగా సంచరించినప్పుడు దక్షిణాయమని అన్నారు. ఏడాదిలో 6నెలలు ఉత్తరాయణం.. 6నెలలు దక్షిణాయనం. సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించి నప్పుడు ఉత్తరాయణం.. కర్కాటక రాశిలోకి ప్రవేశించి నప్పుడు దక్షిణాయనం ప్రారంభమవుతుంది. సంక్రమణం ప్రవేశించిన తరువాత మొదటి 6గంటల 49 నిముషములు పుణ్యకాలంగా, 2 గంటల 16 నిమిషములు అత్యంత పుణ్యకాలంగా శాస్త్రములందు చెప్పబడింది. ఆ సమయంలో స్నాన, దాన, జపాదులేవైనా అధిక ఫలితాలనిస్తాయి. ఆధ్యాత్మిక పరంగా ఉత్తరాయణం దేవతలకు పగలు అయితే, దక్షిణాయనం దేవతలకు రాత్రి కాలం. ఈ కాలంలో శ్రీమహావిష్ణువు యోగనిద్రలో ఉంటాడు. ఇలాంటి సమయంలో మనిషి ఎదుగుదలకు దైవశక్తి సాయం ఎంతో అవసరం. అందుకే దేవతల శక్తిని ప్రేరేపించడనికి ఈ కాలంలో ఉపాసనలు చేస్తారు. అందువల్ల ఇది ఉపాసన కాలం అయ్యింది. శ్రీహరి ఆషాఢ శుద్ధ ఏకాదశి రోజున యోగ నిద్రలోకి వెళ్లి కార్తీక శుద్ధ ఏకాదశి నాడు నిద్రలేస్తారు. ఈ సమయంలో యోగులు, మఠాధిపతులు చాతుర్మాస దీక్షను చేపడతారు. శాస్త్రీయంగా దక్షిణాయనంలో సూర్యకాంతి భూమి మీద తక్కువగా ప్రసరిస్తుంది. ఫలితంగా జీవులలో రోగ నిరోధకశక్తి క్షీణించి రోగాల బారిన పడతారు. వీటిని నిరోధించడానికి ఈ కాలంలో బ్రహ్మచర్యం, ఉపసాన, తరుచుగా ఉపవాసాలు, పూజలు, వ్రతాల పేరుతో పాటించే నియమాలు రోగనిరోధక శక్తిని పెంచి, ఆరోగ్యాన్ని కలిగిస్తాయి. ఎలా చూసిన దక్షిణాయనంలో చేసే జప, దాన, పూజలు ఆరోగ్యాన్ని, అధ్యాత్మిక అనుభూతుని ప్రసాదించడంతో పాటు పరమాత్మ పాదాలను చేరుస్తాయి. దక్షిణాయనంలో పిండ ప్రదానాలు, పితృ తర్పణాలు చేయడం, సాత్వికాహారం ఫలితాన్నిస్తాయి. ముఖ్యంగా దక్షిణాయనం లోనె పితృ దేవతలు తమ సంతానం ఇచ్చే శ్రాద్ధాలు, విశేష తర్పణాలను స్వీకరించేందుకు భూమిపైకి వస్తారని అంటారు. ఈ సమయంలోనే పితృదేవతారాధనకు సంబంధించిన మహాలయ పక్షాలు వస్తాయి. పితృదేవతలను సంతృప్తిపరిస్తే, వారి అను గ్రహంతో సంతానాభివృద్ధి జరుగుతుంది. శ్రాద్ధాదులు నిర్వహించక పోవడం కూడా సంతాన లేమికి ఒక కారణమని పెద్దలు పేర్కొంటారు. బతికుండగా తల్లిదండ్రుల సేవ, మరణించాక శ్రాద్ధాలు చేయడం విధి, ఎంతో ముఖ్యం, శుభప్రదం. పితృ రుణం తీర్చుకోవడానికి అది మార్గం. అంతేకాదు కని పెంచిన తల్లిదండ్రులకు అది ఒక కృతజ్ఞతా పూర్వక చర్య. ధ్యానం, మంత్ర జపాలు, సూర్యోదయానికి ముందే లేచి పవిత్ర నదుల్లో స్నానాలు, పిండ ప్రదానాలు, పితృ తర్పణాలు, సాత్వికాహారం (శాకాహారం) తీసుకోవడం, అవసరంలో ఉన్న వారికి దానం చేయడం, అన్నదానం, తిల (నువ్వుల ) దానం, వస్త్ర దానం, విష్ణు పూజ, విష్ణు సహస్రనామ పారాయణ, సూర్యారాధన, ఆదిత్య హృదయ పారాయణం చేస్తే అవి శరీరానికి, మనసుకు మేలు చేస్తాయని, పాపాలు తొలగి పోతాయని శాస్త్రాలు తెలుపుతున్నాయి. ఈ ఏడు జూలై 16న దక్షిణాయనం ప్రారంభం అయింది.

**రామ కిష్టయ్య సంగనభట్ల – 9440595494**

# తుర్రేబాజ్ ఖాన్ పోరాటం... నేటికీ స్ఫూర్తి దాయకం

## – 1857 జూలై 17... తురేబాజ్ ఖాన్ నాయకత్వంలో బ్రిటిష్ రెసిడెన్సీపై దాడి జరిగిన దినం

భారత ప్రథమ స్వతంత్ర సంగ్రామంగా పేరెన్నిక గన్న 1857 సిపాయిల తిరుగుబాటు ఉత్తర భారతావనిలో ప్రారంభం అయినా దాని ప్రభావం దక్షిణ భారతదేశానికీ విస్తరించింది. ఈ తిరుగు బాటుకు నిజాం పరిపాలనా ప్రాంతమైన హైదరాబాద్ కు సంబంధాన్ని సూచించే చారిత్రక అంశమే తుర్రేబాజ్ ఖాన్ మార్గదర్శక జీవితం. ఆధునిక మారణ ఆయుధాలు కలిగి, అపారమైన సైనిక బలగాలున్న బ్రిటీష్ వారికి ఎదుర్కోవడం, ఎదురొడ్డి పోరాడడం ఆత్మహత్యా సదృశమని తెలియని వారుండరంటే అతిశయోక్తి కానేరదు. పోరు బాటలో మరణం పాలకులను తరిమి కొట్టేందుకు నడుం కట్టి, ఆయుధం చేతపట్టి, కదన రంగాన్ని ఎన్నుకుని పోరాడి అసువులు బాసి, అమరులైన పోరాట యోధులలో పఠాన్ తుర్రేబాజ్ ఖాన్ ఒకడు. అందుకే చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోయాడు. పఠాన్ తుర్రేబాజ్ ఖాన్ పరాక్రమాలకు పెట్టింది పేరైన రొహిల్లా సైనిక పటాలానికి చెందిన నాయకుడు. ప్రఖ్యాతి చెందిన అరబ్బులు, రొహిల్లాలు గల సైనిక దళానికి నాయకత్వం వహించిన తుర్రేబాజ్ ఖాన్, హైదరాబాద్ నివాసి పఠాన్ రుస్తుం ఖాన్ కుమారుడు. ఆయన బ్రిటిషు సైన్యంలో చేరి ఔరంగాబాదు బ్రిటీష్ కంటోన్మెంటులో జమేదారుగా పని చేశాడు. 1857లో మీరట్ లో ప్రారంభమైన తిరుగుబాటు బావుటా హైదరాబాద్ కు చేరడంతో... హైదరాబాద్లో తుర్రేబాజ్ ఖాన్, మౌల్వీ అల్లావుద్దీన్ నేతృత్వంలో జరిగిన తిరుగుబాటు, రెసిడెన్సీలో ఖైదీగా ఉన్న జమేదార్ చీదా ఖాన్ను విడిపించడానికి అవసర మైనది. చరిత్రాత్మక మక్కా మసీదు నుండి బయలుదేరి, బ్రిటిష్ ఆధిప త్యానికి చిహ్నమైన హైదారాబాద్ రెసిడెన్సీ మీద సుమారు ఐదు వందల మంది సాహసికులతో 1857జూలై 17న సాహసోపేతమైన దాడి చేశారు. రెసిడెన్సీ గోడకు సమీపంలో ఉన్న రెండు ఇళ్లను ఖాళీ చేయించి అందులో నుంచి గోడను ధ్వంసం చేసి రెసిడెన్సీలోకి ప్రవేశించారు. వీరి వెంట ఐదు వేలకు పైగా రొహిల్లాలు, అరబ్లు, విద్యార్థులు, ఇతర సామాన్యులూ ఉన్నారు. కానీ, దాడి గురించిన సమాచా రాన్ని నిజాం మంత్రి తురబ్ అలీ ఖాన్ బ్రిటీషర్లకు చేర వేయడంతో గోడను ధ్వంసం చేసి రెసిడెన్సీలోకి తుర్రేబాజ్ సారథ్యంలో తిరుగు బాటు దారులు ప్రవేశించగానే బ్రిటీష్ సైన్యం సాయుధులై ప్రతిదాడికి సిద్ధంగా ఉన్నారు. జులై 17 సాయంత్రం ఆరు.. ఏడు గంటల ప్రాంతంలో మొదలైన ఈ పోరాటం తెల్లవారు జామున నాలుగు గంటల వరకు జరిగింది. దాడిలో పలువురు సహచరులను కోల్పోయిన ఖాన్, బ్రిటిష్ – నిజాం బలగాలకు 1857 జూలై 22న పట్టు బడ్డారు. ఆయనకు ప్రభుత్వం ద్వీపాంతరవాస శిక్ష విధించి, యావదాస్తిని పాలకులు స్వాధీనం చేసుకున్నారు. కాపలాగా పెట్టిన సెంట్రీలలో కూడా మాతృభూమి పట్ల అభిమానాన్ని ప్రేరేపించి, వారి సహకారంతో 1859 జనవరి 18న జైలు నుండి తప్పించు కున్నాడు. ఆగ్రహించిన ప్రభుత్వం తుర్రేబాజ్ ఖాన్ను పట్టితెచ్చిన వారికి 5వేల రూపాయల నగదు నజరానాను జనవరి 19న ప్రకటించింది. నిజాం నవాబు ప్రకటించిన నజరానాకు ఆశపడిన కుర్బాన్ అలీ అనే నమ్మక ద్రోహి తుర్రేబాజ్ ఖాన్ ఆచూకిని బహిర్గతం చేశాడు. ఆ సమాచారంతో 1859 జనవరి 24న, మెదక్ జిల్లాలోని తూప్రాన్ అను గ్రామం మీద నిజాం, బ్రిటిష్ సైన్యాలు విరుచుకు పడ్డాయి. పోరాటంలో శత్రువు తుపాకి గుండ్లకు తుర్రేబాజ్ ఖాన్ గురైనాడు. తరువాత ఆ యోధుని మృత దేహాన్ని బ్రిటిషు సైన్యాలు హైదారాబాద్ కు తరలించాయి. ఆయన భౌతిక కాయానికి అంత్య క్రియలు జరపకుండా ఇనుప సంకెళ్ళతో కట్టేసి ప్రస్తుతం సుల్తాన్ బజారు పోలీసు స్టేషన్ ఉన్న చోట, ఇలాంటివి పునరావృతం కాకుండా, స్థానికుల్లో భయాందోళనలు కలిగించేందుకు బహిరంగంగా వేలాడ దీశారు. స్వాతంత్ర్య సంగ్రామ చరిత్ర పుటలలో స్థానం పొంది అమరుడై, చిరస్మరణీయుడైన తుర్రేబాజ్ ఖాన్ పఠాన్, శ్రీ మౌల్వీ అల్లావుద్దీన్ తదితర యోధుల దాడి సంఘటనలకు గుర్తుగా, వీరయోధుల స్మారకార్థం, హైదరాబాదు నగరం నడి బొడ్డున గల కోటిలోని సిటీ బస్టాండు వద్ద (అది అనాటి రెసిడెన్సీ ప్రాంతం) స్వతంత్ర భారత ప్రభుత్వం 1957లో స్మారక స్థూపాన్ని నిర్మించింది. అలాగే




కోటి విమెన్స్ కాలేజీ నుంచి పుల్లి బౌలీ ఎక్స్ రోడ్ వరకు ఉన్న దారికి తుర్రేబాజ్ ఖాన్ పేరు పెట్టారు. కానీ, దాన్ని ఆ పేరుతో వ్యవహరించడం మరిచి పోవడం జరిగింది. స్థానిక పోరాట యోధుడి గురించి స్మరించడం, పాఠ్యాంశాల్లో చేర్చడం, భావి తరాలకు తెలియ చేయడం అత్యవసరం. **రామ కిష్టయ్య సంగనభట్ల – 9440595494**

# లక్ష్యానికి దూరంగా అంతర్జాతీయ క్రిమినల్ న్యాయ స్థానం - జూలై 17...ప్రపంచ న్యాయ దినోత్సవం

ఒక్క అమాయకుడికి కూడా అన్యాయము జరగకూడదన్న సూత్రము న్యాయ వయ్వస్థకు పునాది. అంతర్జాతీయ న్యాయ దినోత్సవం, అనేది "అంతర్జాతీయ క్రిమినల్ జస్టిస్ దినోత్సవం" అని కూడా పిలువ బడుతుంది. దీనిని ప్రపంచ వ్యాప్తంగా జూలై 17 న జరుపుకుంటారు. యుద్ధ నేరాల ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజకీయ నేతలపై విచారణ జరిపేందుకు ఒక అంతర్జాతీయ న్యాయస్థానం ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను మొట్టమొదటిసారి 1919లో జరిగిన పారిస్ శాంతి సదస్సులో కమిషన్ ఆఫ్ రెస్పాన్సిబిలిటీస్ తెరపైకి తీసుకొచ్చింది. లీగ్ ఆఫ్ నేషన్స్ ఆధ్వర్యంలో నవంబరు 1–16, 1937 మధ్య జెనీవాలో జరిగిన సదస్సులో ఈ అంశాన్ని మరోసారి ప్రస్తావించారు. రెండో ప్రపంచ యుద్ధం సందర్భంగా చోటుచేసుకున్న దురాగతాలపై విచారణ జరిపేందుకు ఒక శాశ్వత అంతర్జాతీయ న్యాయస్థానాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని 1948లో మొదటిసారి ఐక్యరాజ్య సమితి సాధారణ సభలో గుర్తించారు. రెండో ప్రపంచ యుద్ధం తరువాత నాజీ యుద్ధ నేరాలపై దర్యాప్తు జరిపిన ఒక పరిశోధకుడు, న్యూరెంబర్గ్‌లో అమెరికా అధికారిక యంత్రాంగం జరిపిన పన్నెండు సైనిక విచారణల్లో ఒకట్కైన ఐన్‌శాట్జ్‌గ్రూపెన్ విచారణలో అమెరికా సంయుక్త రాష్ట్రాల ఆర్మీ ప్రధాన న్యాయవాదిగా వ్యవహరించిన బెంజమిన్ బి. ఫెరెంజ్... ఒక అంతర్జాతీయ చట్ట పాలన, ఒక అంతర్జాతీయ క్రిమినల్ న్యాయ స్థానం ఏర్పాటుకు ప్రధాన మద్దతుదారుగా మారారు. 1975లో ప్రచురించిన 'డిఫైనింగ్ ఇంటర్నేషనల్ అగ్రెషన్ – ది సెర్చ్ ఫర్ వరల్డ్ పీస్' అనే తన మొదటి పుస్తకంలో, ఒక అంతర్జాతీయ న్యాయస్థానం ఏర్పాటు కోసం వాదించారు. అలా ఒక శాశ్వత అంతర్జాతీయ న్యాయస్థానాన్ని సృష్టించాలని ప్రతిపాదన రావడంతో, 1989లో ఈ ఆలోచనకు రూప కల్పన చేసేందుకు, ముసాయిదాను తయారు చేసేందుకు నడుం బిగించ బడింది. యుగోస్లావియా, రువాండాల్లో యుద్ధ నేరాలపై విచారణ జరిపేందుకు న్యాయస్థానాలు తొలుత ఏర్పడ్డాయి. దీంతో ఒక శాశ్వత అంతర్జాతీయ క్రిమినల్ న్యాయస్థానం ఏర్పాటు అవసరం మరింత ప్రాధాన్యత పొందింది. ఇందుకు సంబంధించి ఒక




ఒప్పందాన్ని ఖరారు చేసే లక్ష్యంతో ఐక్య రాజ్య సమితి సాధారణ సభ జూన్ 1998లో రోమ్ నగరంలో ఒక సదస్సును ఏర్పాటు చేసింది. 21 దేశాలు ఈ ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయి. ఒప్పందానికి చైనా, ఇరాక్, ఇజ్రాయెల్, లిబియా, ఖతర్, యునైటెడ్ స్టేట్స్, యెమెన్ ఏడు దేశాలు వ్యతిరేకంగా ఓటు వేశాయి. జూలై 17, 1998న అంతర్జాతీయ క్రిమినల్ న్యాయ స్థానం రోమ్ శాసనం, 120 – 7 ఓట్ల తేడాతో ఆమోదిం చబడింది. ఇదే రోజున అంతర్జాతీయ న్యాయ దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా మారింది. ఏప్రిల్ 11, 2002న రోమ్ శాసనం సభ్య దేశాల ఆమోదంతో ఒక బంధన ఒప్పందంగా మారింది. శాసనం న్యాయబద్ధంగా జుల్కె 1, 2002 నుంచి అమల్లోకి వచ్చింది. ఐసీసీ (ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు) కు ఆ రోజు తరువాత జరిగిన నేరాలపై మాత్రమే విచారణ జరిపే అధికారాన్ని కల్పించారు. 18 మంది న్యాయమూర్తులతో కూడిన మొదటి ధర్మాసనాన్ని సభ్యదేశాల సభలో ఫిబ్రవరి 2003లో ఎన్నుకోవడం జరిగింది. ఈ న్యాయమూర్తులు మార్చి 1, 2003న న్యాయస్థాన ప్రారంభ సెషన్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. అంతర్జాతీయ న్యాయస్థానం, అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు రెండూ వేరు వేరు సంస్థలు. వీటి రెండిటికీ పరిధి ఉంది. అంతర్జాతీయ న్యాయస్థానం లేదా ప్రపంచ న్యాయస్థానం ఐక్యరాజ్యసమితి ప్రాథమిక న్యాయ అంగంగా నెదర్లాండ్ లోని హేగ్ నగరంలోగల, శాంతి సౌధం లో యున్నది. దీని ప్రధాన కార్యక్రమం, సభ్యదేశాల ద్వారా సమర్పించబడిన "న్యాయపర వాదనలు" ఆలకించడం, తీర్పు చెప్పడం. అయితే దీని యొక్క విచారణలు ఎక్కడైనా జరగవచ్చు. ఆగస్టు 2010 నాటికి, 113 దేశాలు న్యాయస్థానంలో సభ్య దేశాలయ్యాయి, దాదాపుగా అన్ని ఐరోపా మరియు దక్షిణ అమెరికా దేశాలు, ఆఫ్రికాలోని సగం దేశాలు ఇప్పుడు దీనిలో సభ్య దేశాలుగా ఉన్నాయి. మానవాళి చరిత్రలో మొట్టమొదటిసారి, ఒక అంతర్జాతీయ న్యాయస్థానానికి ఒక వ్యక్తికి నష్టపరిహారాన్ని మరో వ్యక్తి చెల్లించాలని ఆదేశించే అధికారాన్ని కల్పించారు. ఒక అంతర్జాతీయ న్యాయస్థానానికి ఇటువంటి అధికారం కల్పించడం కూడా ఇదే మొదటిసారి. కనీసం 139 దేశాల్లో అనుమానిత నేరాల గురించి న్యాయస్థానానికి ఫిర్యాదులు అందాయి. న్యాయస్థానం ఐదు కేసులపై విచారణలు ప్రారంభించింది: ఉత్తర ఉగాండా, డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్, డార్ఫూర్ (సూడాన్) మరియు రిపబ్లిక్ ఆఫ్ కెన్యా కేసులపై ఈ న్యాయస్థానం విచారణలు చేపట్టింది. న్యాయస్థానం పదహారు మంది వ్యక్తులను దోషులుగా నిర్ధారించింది. వీరిలో ఏడుగురు పరారీలో ఉండగా, ఇద్దరు మరణించారు (లేదా మరణించినట్లు విశ్వసిస్తున్నారు), నలుగురు నిర్బంధంలో ఉన్నారు. ముగ్గురు స్వచ్ఛందంగా న్యాయస్థానం ఎదుట లొంగి పోయారు. 2007 అక్టోబరు 4నాటికి కనీసం 139 దేశాల్లో అనుమానిత నేరాలకు సంబంధించి విచారణకర్తకు 2889 సమాచారాలు వచ్చాయి. అయితే ప్రాథమిక సమీక్ష తరువాత, ఎక్కువ సంఖ్యలో ఫిర్యాదులను న్యాయస్థానం యొక్క అధికార పరిధికి వెలుపల ఉన్న పరిస్థితులుగా గుర్తించి తోసిపుచ్చడం జరిగింది. ఐసిసికి 123 సభ్య దేశాల మద్దతు ఉందని చెపుతున్నా, ఐసిసి ఒక న్యాయ వ్యవస్థగా రోమ్ స్టాచ్యూట్‌కు కట్టుబడి, స్వతంత్రంగా, నిష్పాక్షికంగా పని చేస్తుందని ప్రకటిస్తున్నా, లక్ష్య సాధనకు బహుదూరంలో ఉంది. అమెరికా ఆంక్షల నీడలు అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసిసి) మీద కూడా పడడం, సభ్య దేశాల సహకార లోపం తదితర కారణాలతో ఆశించిన ఫలితం రావడం లేదు. **రామ కిష్టయ్య సంగనభట్ల – 9440595494**

చురకలు



# మంచం పడుతున్నారు..!

సిరిసిల్ల : జిల్లాలో విష జ్వరాలు ప్రబలుతున్నాయి. వర్షాకాలం ప్రారంభమవడం, పారిశుద్ధ్య నిర్వహణ అంతంత మాత్రమే ఉండటంతో విషజ్వరాలు వ్యాపిస్తున్నాయి. జిల్లాలో పలు ప్రభుత్వ, ప్రైవేటు అసుపత్రులకు జ్వర పీడితుల తాకిడి పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

**అప్రమత్తతే మందు**

జిల్లా అసుపత్రికి ప్రతిరోజు వివిధ వైద్య పరీక్షల కోసం వస్తున్న వారి సంఖ్య 400 నుంచి 600 వరకు ఉంటే అందులో దాదాపు 40కి పైగా మంది జ్వర బాధితులుంటున్నారు. జిల్లాలోని అన్ని ఆసుపత్రుల్లో మలేరియా, టైఫాయిడ్, దగ్గు, గొంతునొప్పి, ఒళ్లునొప్పి తదితర లక్షణాలతో బాధపడుతున్నారు.

ప్రస్తుత తరుణంలో పట్టణాల్లో, గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ అత్యంత కీలకం. వ్యక్తిగత, పరిసరాల శుభ్రతపై కూడా అవగాహన లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

జిల్లాలో పరిస్థితి మరింత తీవ్రతరం కాకముందే.. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో విస్తృతంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని జ్వర బాధితులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు జర్వం వచ్చినప్పుడు, లేదా



అలసట, ఇతర లక్షణాలు కనిపించినప్పుడు ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా, సొంత వైద్యం కాకుండా.. వెంటనే వైద్యలను సంప్రదించాలని నిపుణులు సూచిస్తున్నారు. లేదంటే కుటుంబ సభ్యులందరూ అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉంటుందని చెబుతున్నారు.

**ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు: కిరణ్, మున్సిపల్ ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్**

సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి మంగళ, శుక్రవారం వార్డు అధికారి, ఆర్పీలు, మున్సిపల్ పారిశుద్ధ్య విభాగం ఇన్‌ఛార్జిలు డ్రై డే కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మురుగు, వర్షంనీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో ఆయిల్ బాల్స్, కెమికల్స్, బ్లీచింగ్ ఫౌడర్ చల్లుతున్నారు.

# వయసుకు మించి.. పుస్తకాల సంచి

మిర్యాలగూడ : ప్రస్తుతం పాఠశాల పిల్లలను ఎక్కడ చూసినా కిలోల బరువు ఉన్న సంచులను భుజాలకు తగిలించుకుని వంగి వంగి నడుస్తూ కనిపిస్తున్నారు. కిలోల కొద్దీ బరువున్న సంచులను ఏళ్ల పాటు మోయడంతో పిల్లలు అనేక రకాల వ్యాధుల బారిన పడుతున్నట్లు వైద్యులు హెచ్చరిస్తున్నారు. మిర్యాలగూడకు చెందిన ఓ ప్రైవేటు పాఠశాలలో నాలుగో తరగతి విద్యార్థి రోజు వారీ మోయాల్సిన పుస్తకాలు 35 వరకు ఉన్నాయి.

**తల్లిదండ్రుల్లో మార్పు రావాలి...**


విద్యార్థులు ఇంటికి వచ్చి బడి సంచులు మోయలేక పోతున్నామని తల్లిదండ్రులతో మొర పెట్టుకున్నప్పటికీ..వారు పట్టించుకోట్లేదు. పైగా ఎన్ని పుస్తకాలు ఉంటే..బడి సంచి ఎంత ఎక్కువ బరువు ఉంటే ఆ పాఠశాల మంచిదనే భ్రమలో తల్లిదండ్రులు ఉంటున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బడి సంచి విద్యార్థి మొత్తం బరువులో 10శాతం కంటే తక్కువ ఉండాలి. ప్రస్తుతం 20శాతం పైగా ఉంటోంది. ఉమ్మడి జిల్లాలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో బరువు కనిష్ఠంగా 7 నుంచి 15 కిలోల వరకు ఉంటున్నట్లు నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**దీర్ఘకాలిక వ్యాధుల బారిన..**

అధిక బరువు ఉన్న బడి సంచులను విద్యార్థులు పదేళ్లపాటు మోయడం వల్ల అనేక అనారోగ్యాల బారిన పడుతున్నట్లు నిపుణులు చెప్తున్నారు. విద్యార్థికి అలసటతో పాటు మెడ, వెన్ను నొప్పి, ఎత్తు పెరగడంలో ఇబ్బందులు, కొందరిలో ఎదుగుదల లోపం సైతం వచ్చే ప్రమాదం ఉంది. మరో వైపు ఏళ్ల తరబడి ఒకే భంగిమలో సంచులు మోయడం వల్ల పలు దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

**ఇవి పాటిస్తే మేలు**

భోజనం డబ్బా, నీళ్ల సీసాను వేరే సంచిలో పెట్టాలి.



ఏ రోజు అవసరమైన పుస్తకాలు ఆ రోజే తీసుకెళ్లాలి.

బడి సంచి అధిక బరువుపై పాఠశాల యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లాలి.

అన్ని పుస్తకాలు పాఠశాలలోనే ఉంచి ఇంటిపని పుస్తకాలనే తీసుకెళ్లాలి.

ప్రభుత్వ ఆదేశాల మేరకు నో బ్యాగ్ డే నిర్వహించాలని పాఠశాల సిబ్బందికి సూచించాలి.

**అనేక అనారోగ్య సమస్యలు**

పాఠశాల సంచి అధిక బరువుతో వీపుపై ఏళ్ల తరబడి మోయడంతో మెడ, వెన్నుముక సమస్యలతో పాటు.. ఎత్తు పెరగడంలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీంతోపాటు సంచిని మోసేందుకు పిల్లలు తమకు తాత్కాలికంగా అణువైన ఓ భంగిమను ఎక్కువ కాలం ఉపయోగించడం వల్ల పెద్దయ్యాక కూడా వారు దానిని విడిచి పెట్టలేకపోతున్నారు. అనేక మంది కళాశాలకు వెళ్లిన తర్వాత కూడా వంగి నడవడం చూస్తూనే ఉన్నాం. డాక్టర్ సద్గుణ్‌రాజు, పిల్లల వైద్యుడు, మిర్యాలగూడ

# వాటాల మాట బాహాటమే!



కరీంనగర్ : నిబంధనల మేరకు పనులు చేసినా కాసులిస్తేనే కాగితాలు కదిలే తీరు ఉమ్మడి జిల్లాలో బాహాటంగానే సాగుతోంది. ఈ నెల 12న పంచాయతీరాజ్ శాఖ ఏఈ జగదీశ్‌బాబు అనిశా అధికారులకు పట్టుబడిన ఉదంతమే ఇందుకు నిదర్శనం. సీసీ రోడ్డు పనులకు ఎంబీ రికార్డు చేయడానికి రూ.90 వేలు డిమాండ్ చేయడంతో విధి లేని పరిస్థితుల్లో గుత్తేదారు అనిశా అధికారులను ఆశ్రయించారు. రూ.15 లక్షల విలువైన పనిలో కచ్చితంగా 6 శాతం కమీషన్ అడగడం చర్చనీయాంశంగా మారింది. ఇదే అధికారి 2017లో కరీంనగర్ గ్రామీణ మండల ఏఈగా పని చేస్తూ గుత్తేదారు నుంచి రూ.1.50 లక్షలు తీసుకుంటూ అనిశాకు చిక్కాడు. పలుకుబడితో తిరిగి ఉద్యోగంలో చేరి మరోసారి లంచం తీసుకుంటూ దొరకడం అవినీతి తీరుకు అద్దం పడుతోంది. గత నెల 17న కరీంనగర్‌లో పంచాయతీరాజ్ నిఘా, నాణ్యత విభాగంలో పని చేస్తున్న ఏఈ శరత్, సీనియర్ సహాయకుడు వేణుగోపాల్ రూ.8 వేలు లంచం తీసుకుంటూ అనిశాకు దొరికారు.

**కేటగిరీని బట్టి కమీషన్**

పంచాయతీరాజ్ శాఖలో ప్రతి పనికి సంబంధించి చెల్లించాల్సిన మొత్తంలో కేటగిరీని బట్టి 6 నుంచి 9 శాతం కమీషన్‌ను నిర్ణయించినట్లు తెలుస్తోంది. కాగా ఇటీవలి కాలంలో బిల్లులు సరిగ్గా రాకపోవడంతో అరకొరగా మంజూరయ్యే బిల్లుల్లో కచ్చితంగా 6 శాతాన్ని మాత్రం క్షేత్ర స్థాయి అధికారులు వసూలు చేస్తున్నారు. ఇందులో ఏఈ వాటాగా 3 శాతం, డీఈఈ వాటాగా 2 శాతం, మిగిలిన ఒక్క శాతం ఆ పై అధికారులకు వెళ్తున్నట్లు సమాచారం. ఇదేమని అడిగితే 'మీకు తెలియనిది కాదు కదా? పై అధికారులకు వాటాలివ్వాలి. లేదంటే సంతకాలు కావు' అని ఏఈ స్థాయి అధికారుల నుంచి వస్తోంది. ఇక కొన్ని చోట్ల బిల్లుల సంగతి దేవుడెరుగు.. పని మంజూరై టెండర్లు పూర్తి కాగానే చేతివాటం ప్రదర్శించే అధికారులూ ఈ శాఖలో ఎక్కువే.

**అందితే సరే.. లేకుంటే కొర్రీలు**

మామూళ్ల వాసన వస్తే గాని ఈ శాఖలోని కొందరు అధికారులకు రాత్రి నిద్ర పట్టదు. అందుకే పని ప్రారంభం నుంచి పర్యవేక్షణలు, పరిశీలనలు, కొలతలు, ఉన్నతాధికారులకు దస్త్రాలు పంపడం వంటి పనులకు కొర్రీలు పెట్టడం పరిపాటిగా మారింది. ఒకే గుత్తేదారు ఎక్కువ పనులు చేపట్టిన సందర్భాల్లోనూ 'దేని కమీషన్ దానిదే' అన్న ధోరణి కనిపిస్తోంది. దస్త్రం కదలాలంటే కచ్చితంగా ఎంతో కొంత జేబులో పెట్టాల్సిందే.! లేదంటే ఉన్నతాధికారుల సంతకాలు కాలేదని, ఇంకా పనికి సంబంధించిన కొసరు పనులు పక్కాగా లేవని తిరకాసు పెట్టడం మామూలైపోయింది. ఇక అష్టకష్టాలు పడి, కమీషన్‌లు ఇచ్చిన తర్వాత బిల్లుకు సంబంధించిన చెక్కు చేతిలోకి వచ్చినప్పుడు కార్యాలయంలోని అటెండర్ మొదలు ఇతర సిబ్బంది చేతుల్లో పచ్చనోట్లు పెట్టి తీరాల్సిందే.! ఇప్పటికైనా పంచాయతీరాజ్ శాఖలో వేళ్లూనుకుపోయిన అవినీతిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలి. ప్రతి పనికీ చేయి చాపేవాళ్లను గుర్తిస్తూ శాఖాపరంగా చర్యలు తీసుకోవాలన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

# శివారు ప్రాంతాల్లో వసతులు పట్టవా!



జమ్మికుంట: జమ్మికుంట పురపరిధిలోని విలీన గ్రామాలు సరైన రోడ్లు, మురుగు కాలువలకు నోచుకోవడం లేదు. 2019లో జమ్మికుంట మున్సిపల్‌లో కొత్తపల్లి, ధర్మారం, రామన్నపల్లి గ్రామాలు విలీనమయ్యాయి. పురపాలికలో విలీనంతో ఆయా గ్రామాలు అభివృద్ధి చెందుతాయనుకుంటే.. కనీస మౌలిక వసతులు కల్పించటంలో అధికారులు విఫలమవుతున్నారు. అంతర్గత రహదారులు, పూర్తిస్థాయిలో మురుగుకాలువ లేక ఆయా కాలనీలవాసులు ఇబ్బందులు పడుతున్నారు.

**శ్మశానవాటికలు లేక తిప్పలు**

ధర్మారం, రామన్నపల్లిలలో శ్మశానవాటికలు లేకపోవటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శ్మశానవాటికల నిర్మాణం కోసం స్థలాలు కేటాయించినా.. వెళ్లేందుకు దారి లేక నిర్మాణ పనుల్లో ముందడుగు పడటం లేదు. దీంతో మృతదేహాలను సొంత భూములు, చెరువు శిఖాల వద్ద దహనం చేస్తున్నారు. కొత్తపల్లిలో శ్మశానవాటికకు ప్రహరీ నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

**రోడ్లపై నిర్లక్ష్యం**

కొత్తపల్లిలో 17వ వార్డులో సీసీ రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఆర్వోబీ వంతెన రోడ్డు వైపు గుంతలు పూడ్చాలని వాహనచోదకులు కోరుతున్నారు. జమ్మికుంట రైల్వేస్టేషన్ వద్ద ఫుట్ ఓవర్ వంతెన నిర్మించాలని ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులకు విన్నవించినా స్పందన లేదని గ్రామస్థులు వాపోతున్నారు. దీంతో రైళ్లలో వచ్చిన ప్రయాణికులు తిరిగి వెళ్తూ దూరభారంతో ఇబ్బంది పడుతున్నారు. ధర్మారం నుంచి దుబ్బమల్లన్న ఆలయానికి రోడ్డు లేకపోవడంతో వర్షం పడితే బురదతో దుర్భరంగా ఉంటోంది.

**కొత్తవి నిర్మించరు.. ఉన్నవాటిలో పారవు**

కొత్తపల్లిలో పలు ప్రాంతాల్లో పాత మురుగు కాలువలు చిన్నగా ఉండటంతో మట్టితో కూరుకుపోతున్నాయి. ధర్మారంలో గడ్డి, పిచ్చిమొక్కలు పెరిగాయి. పలు వార్డుల్లో కాలువలు లేక మురుగు రహదారి పక్క నుంచి పారుతోంది. రామన్నపల్లి గ్రామంలో చిన్న కాలువలతో మురుగు నిలిచి పలు ప్రాంతాల్లో సమస్యగా మారింది.

**గ్రామాల వారీగా జనాభా వివరాలు**

కొత్తపల్లి : 8,670

ధర్మారం : 2,890

రామన్నపల్లి : 1,480

ఎప్పట్లాగే సమస్యలు

జమ్మికుంట మున్సిపల్‌లో విలీనమైనా కనీస సౌకర్యాలు లేవు. ప్రధాన రోడ్ల పక్కన మురుగు కాలువలు నిర్మించటం లేదు. శ్మశానవాటిక లేకపోవటంతో ఎవరైనా మృతి చెందితే సొంత స్థలాలు.. లేకుంటే చెరువు శిఖం వద్ద దహనం చేస్తున్నాం. మున్సిపల్‌లో చేర్చాక సౌకర్యాలు మెరుగు పడతాయని అనుకున్నాం. కానీ ఎప్పట్లాగే సమస్యలు ఉన్నాయి.

పోలు బిక్షపతి, ధర్మారం

# ప్రధాన మార్గం.. ప్రగతికి కీలకం

పెద్దపల్లి: విశాఖపట్టణం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పడిన తర్వాత దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్(కాచిగూడ), సికింద్రాబాద్, నాందేడ్ డివిజన్‌లకే పరిమితమైంది. రైల్వే లైన్ పొడవు, ప్రయాణికుల సంఖ్య, ఆదాయం తగ్గనున్న నేపథ్యంలో పెద్దపల్లి-నిజామాబాద్ మార్గాన్ని అభివృద్ధి చేయడం ద్వారా ఆ లోటును పూడ్చుకునే అవకాశం ఉంది. తద్వారా ప్రజా, సరకుల రవాణా మరింత విస్తరించి ద.మ.రై. జోన్‌కు ప్రధాన జీవనాడిగా మారనుంది.

పెద్దపల్లి లోక్‌సభ స్థానం పరిధిలో ప్రధానమైన నాలుగు రైల్వే స్టేషన్లున్నాయి. వీటిలో ఎన్ఎస్‌జీ(నాన్ సబ్ అర్బన్ గ్రేడ్)-3 (ఏటా రూ.20 కోట్ల కంటే ఎక్కువ ఆదాయం) ఒకటి, ఎన్ఎస్‌జీ-4(ఏటా రూ.10 కోట్ల కంటే ఎక్కువ ఆదాయం) రెండు, ఒక ఎన్ఎస్‌జీ-5 స్టేషన్ ఉంది. వీటితో పాటు 8 గ్రామీణ స్టేషన్లున్నాయి. రాష్ట్రంలో మరెక్కడా ఇలాంటి సుదీర్ఘమైన రైల్వే వ్యవస్థ కలిగిన లోక్‌సభ నియోజకవర్గం లేదు.

**పది జిల్లాలకు ప్రయోజనం**

పెద్దపల్లి-నిజామాబాద్ రైలు మార్గం అందుబాటులోకి వచ్చి పదేళ్లయింది. ఈ మార్గంలో గంటకు 110 కిలోమీటర్ల వేగంతో రైలు నడిచేలా ట్రాక్‌ను ఉన్నతీకరించారు. రెండో లైన్ నిర్మాణానికి గత బడ్జెట్‌లో కేటాయింపులు జరిగినా రైళ్ల సంఖ్యను పెంచకపోవడంతో ఒకటి రెండు రైళ్లకే పరిమితమైంది. నిజామాబాద్ నుంచి కరీంనగర్, పెద్దపల్లి మీదుగా దిల్లీ వైపు, చెన్నై, కొచ్చి, విశాఖపట్టణం వైపు.. పెద్దపల్లి నుంచి నిజామాబాద్ మీదుగా ముంబయి, అహ్మదాబాద్, జైపూర్ వైపు రైళ్లు నడిపించాలి.

సికింద్రాబాద్-నిజామాబాద్-పెద్దపల్లి-కాజీపేట-సికింద్రాబాద్ మార్గంలో రెండు వైపులా రైళ్లు నడిపిస్తే పది జిల్లాలకు ప్రయోజనం కలుగుతుంది. పర్యాటక అభివృద్ధి వేగమవుతుంది.

**ఈ ప్రాజెక్టులు ప్రధానం**

ఉమ్మడి జిల్లాలో ప్రధానమైన కొత్తపల్లి-మనోహరాబాద్ లైన్ పనులను




వేగవంతం చేయాలి. రామగుండం-మణుగూరు మార్గానికి సర్వే పూర్తి చేసి భూసేకరణ పనులు చేపట్టాలి.

ఆదిలాబాద్ నుంచి మాణిక్‌ఘడ్ వరకు ప్రతిపాదిత మార్గం పనులు చేపట్టాలి. దీంతో ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాలకు అనుసంధానం పెరుగుతుంది.

కరీంనగర్-హసన్‌పర్తి లైన్ సాధ్యాసాధ్యాలపై రైల్వేశాఖ మరోసారి అధ్యయనం చేయాలి.

పెద్దపల్లి-నిజామాబాద్ మార్గాన్ని నిజామాబాద్ వైపు(హైదరాబాద్ డివిజన్), పెద్దపల్లి వైపు(సికింద్రాబాద్ డివిజన్) పర్యవేక్షణ చేస్తున్నాయి. రెండు డివిజన్ల మధ్య సమన్వయం లోపంతో ఈ మార్గంలో కొత్త రైళ్లు ప్రవేశపెట్టడం లేదనే ఆరోపణలున్నాయి. రెండు ప్రాంతాలను ఒకే డివిజన్ పరిధిలోకి తీసుకొచ్చేలా పెద్దపల్లి కేంద్రంగా డివిజన్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ పెరుగుతోంది.

కాజీపేటలో రైలు కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు నేపథ్యంలో పెద్దపల్లిని డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేస్తే ఇక్కడి నుంచి 150-180 కిలోమీటర్ల పరిధిలో సేవలు అందుతాయి. పెద్దపల్లిలో నిర్మాణం పూర్తయిన బైపాస్ మార్గంలో రైల్వే సంబంధిత కార్యాలయాలు, అదనపు సేవలకు భూమి సైతం అందుబాటులో ఉంది.

# కొండెక్కిన కొబ్బరికాయ

యాదగిరిగుట్ట : భగవంతుడ్ని కొలిచే భక్తులు వివిధ పూజలు చేపడుతూ.. తమ స్థాయికి తగ్గట్లు మొక్కులు తీర్చుకుంటారు. కొబ్బరి కాయ మొక్కును అన్ని వర్గాలకు చెందిన భక్తులు చెల్లించుకుంటారు. పెరిగిన కొబ్బరికాయ ధర దడ పుట్టిస్తోంది. గతంలో హెూల్‌సేల్‌లో రూ.15 నుంచి రూ.20 వరకు ధర ఉండేది. ప్రస్తుతం అదే హెూల్‌సేల్ ధర రూ.30 నుంచి రూ.35కు దాటుతోంది. యాదగిరిగుట్ట పరిసరాల్లో రూ.40కి పైగానే విక్రయిస్తున్నారు.

**కారణాలు ఇవే..!**

మన రాష్ట్రానికి కొబ్బరికాయలు దిగుమతి చేసే తమిళనాడులో తెగులు సోకి వేలాది ఎకరాల్లో ఉత్పత్తి భారీ స్థాయిలో దెబ్బతినడంతో, ఆ రాష్ట్రం కొనుగోలు ధర పెంచి ఏపీ నుంచి సదరు కాయను దిగుమతి చేసుకుంటోంది. ఇక కేరళలో తుపాను ప్రభావంతో అత్యధిక సంఖ్యలో కొబ్బరి తోటలు ధ్వంసమయ్యాయి. కర్ణాటకలో ఆది నుంచి ధరలు అధికమే. ఏపీలోని తోటలే తమిళనాడు, కేరళకు ఆధారమయ్యాయి. ధర విషయంలో వెనుకాడక ఆ రాష్ట్రంలోని టెంకాయను తమిళనాడు,



కేరళ రాష్ట్రాల హెూల్‌సేల్ వ్యాపారులు కొనేస్తున్నారు.

ఆషాఢ మాసంలో కొబ్బరికాయకు డిమాండ్ బాగానే ఉంటుంది. ఇక వచ్చే శ్రావణ మాసంలో టెంకాయ అవసరం అత్యధికమే. దిగుబడి, దిగుమతి కొరవడిన సదరు కాయ ధర మరింత ప్రియంకానుంది. పల్లెల్లో బోనాల పండుగ, శ్రావణ లక్ష్మీ పూజలు, శ్రీసత్యనారాయణస్వామి వ్రతాలు జోరుగా సాగుతాయి. కొబ్బరికాయ కొట్టి, దైవారాధనల్లో పాల్గొనడం సంప్రదాయం.తెలంగాణలో పేరొందిన యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రంతో పాటు ఉమ్మడి నల్గొండ జిల్లాలోని పలు ఆలయాలు, ఇళ్లల్లో వినియోగానికి రోజుకు ఒక లక్ష కాయ అవసరమని వ్యాపారులు చెబుతున్నారు. కేవలం గుట్ట క్షేత్ర పరిధిలో నిత్యం 10 నుంచి 15 వేల కొబ్బరికాయలు అవసరం.

# సేవలు మెరుగు.. పురస్కారాలతో పరుగు

నర్సాపూర్ : సర్కారు ఆసుపత్రులంటనే వామ్మో అనే రోజులు పోతున్నాయి. రోజురోజుకు సేవలు మెరుగుపరిచి రోగులు తరలివచ్చేలా చేస్తున్నారు సిబ్బంది. ఈ క్రమంలోనే ఏటా జాతీయ ఆరోగ్య మిషన్ ప్రభుత్వ ఆసుపత్రులకు ప్రకటించే కాయకల్ప పురస్కారాలు అందుకుంటున్నారు.

**ఆహ్లాదకర వాతావరణం**

నర్సాపూర్ ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలో పారిశుద్ధ్యం మెరుగుపడి కాయకల్ప అవార్డుకు ఎంపికైంది. ఇక్కడి సిబ్బంది 80.03 శాతం ప్రమాణాలు పాటించారు. ప్రధానంగా దవాఖానా ఆవరణలో పచ్చనిచెట్ల పెంపకంతో ఆహ్లాదకర వాతావరణం ఉండటం.. పరిసరాల పరిశుభ్రత.. పారిశుద్ధ్య చర్యలు మెరుగ్గా ఉండడాన్ని అధికారులు గుర్తించారు. రోగులు, వారి వెంట వస్తున్న సహాయకులు ఆవరణలోని చెట్ల నీడన సేద తీరుతున్నారు. గర్భిణులకు సేవలందించడంలోనూ ప్రశంసలు అందుకుంది. కాయకల్ప అవార్డుకు ఎంపిక కావడం సంతోషంగా ఉందని, ఇది తమ బాధ్యతను రెట్టింపు చేసిందని పర్యవేక్షకురాలు డాక్టర్ పావని తెలిపారు.

**ముచ్చటగా మూడోసారి**

50 పడకలు ఉన్న తూప్రాన్ ఆసుపత్రిలో ప్రసవాలు, ఓపీ, ఐపీ సేవలు, రోగులకు నాణ్యమైన భోజనం, పరిశుభ్రత, పచ్చదనం, శవపరీక్షలు.. ఇలా వివిధ రంగాల్లో సేవలపై ప్రశంసలు దక్కాయి. ఈ క్రమంలోనే రాష్ట్రస్థాయిలో తృతీయ బహుమతికి(రూ.లక్ష ప్రోత్సాహకం) ఎంపిక చేశారు. 2023లో మొదటి స్థానం సాధించి రూ.15 లక్షలు, 2024లోనూ ద్వితీయ స్థానంలో నిలిచి రూ.10 లక్షలు ప్రోత్సాహకం అందుకుంది. త్వరలోనే ప్రభుత్వం నుంచి అవార్డును అందుకుంటామని, నాణ్యమైన సేవలు కొనసాగేలా చర్యలు తీసుకుంటామని పర్యవేక్షకులు డాక్టర్ అమర్ సింగ్ తెలిపారు.

**రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం**

గజ్వేల్ దవాఖానా రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచి హ్యాట్రిక్ సాధించింది. వైద్యశాల నిర్వహణ, ఇన్ఫెక్షన్ నియంత్రణ, పరిశుభ్రత, బయోవేస్ట్ మేనేజ్‌మెంట్ అంశాలపై ప్రశంసలు దక్కాయి. వంద పడకల సామర్థ్యమున్న ఆసుపత్రిలో నిత్యం వెయ్యికి పైగా రోగులు ఓపీ సేవలు పొందుతున్నారు. వంద మంది ఇన్‌పేషంట్లుగా ఉండేందుకు సౌకర్యాలు కల్పించారు. ఆర్థో, చెవి, ముక్కు, కంటికి సబంధించిన శస్త్రచికిత్సలు చేస్తున్నారు. డయాలసిస్ సేవలు అందుబాటులో ఉన్నాయి.

**బెస్ట్ ఎకో ఫ్రెండ్లీ అవార్డు**దుబ్బాక వంద పడకల ప్రాంతీయ ఆసుపత్రి ఎకో ఫ్రెండ్లీ విభాగంలో (పర్యావరణానికి హాని కలిగించని పద్ధతులను అనుసరించడం) రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం, కాయకల్ప విభాగంలో 90 మార్కులు సాధించి మూడో స్థానంలో నిలిచింది. వైద్యశాలలో ఔషధ, పండ్లు, ఇతర మొక్కలతో హెర్బల్ గార్డెన్‌ను ఏర్పాటు చేశారు. చిన్నారులు ఆడుకునేందుకు ఆట వస్తువులు, బొమ్మల పుస్తకాలు ఇస్తున్నారు. ప్రసవానంతరం బాలింతలు పెల్విక్ ఫ్లోర్, ఉదర వ్యాయామాలు చేసేందుకు వివిధ పరికరాలతో కూడిన గదిని నిర్వహిస్తున్నారు. ఆన్‌లైన్ ఓపీ నమోదు, డయాలసిస్, ఆరోగ్య శ్రీ విభాగంలో అత్యధిక శస్త్రచికిత్సలను చేసి దవాఖానా ప్రథమ స్థానంలో నిలిచింది.

# నిరుద్యోగికి ఉపాధి తోవ

వికారాబాద్ : రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను రూపుమాపడానికి ప్రభుత్వం ఎన్నో రకాల కార్యక్రమాలను చేపడుతోంది. యువ వికాసం కార్యక్రమంతో నిరుద్యోగ యువకులకు ఆర్థిక సాయాన్ని అందించి ఉపాధి కల్పించనుంది. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ వంటి చర్యలు చేపట్టింది. మరో అడుగు ముందుకేసి నిరుద్యోగ యువత కోసం 'డీట్' (డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ) ప్రత్యేక యాప్‌ను ప్రవేశపెట్టింది. యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న నిరుద్యోగ యువకులకు అర్హతనుబట్టి వారికి సరిపడే ఉద్యోగ సమాచారాన్ని చేరవేస్తోంది. ఈ యాప్ కంపెనీలకు, నిరుద్యోగ యువతకు వారధిగా పనిచేస్తోంది. అంతేకాకుండా నైపుణ్యాలను పెంచుకునేందుకు శిక్షణ సంస్థల సమాచారాన్ని అందిస్తోంది. రిజిస్ట్రేషన్ వివరాలనుబట్టి అభ్యర్థి రెజ్యూమెను తయారు చేస్తోంది. విద్యార్థులకు ఇంటర్న్‌షిప్, అప్రెంటీస్‌కు సంబంధించిన సమాచారాన్ని అందిస్తోంది.

**డౌన్ లోడ్ ఇలా..**గూగుల్ ప్లే స్టోర్‌కు వెళ్లి ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. అందులో ఉద్యోగార్థిగా చేరాలి. ఇంటిపేరు, మొబైల్ నంబర్, మెయిల్ ఐడీ, పుట్టిన తేదీ, లింగం, విభిన్న వికలాంగులు, సామాజిక స్థితి, చిరునామా వంటి ప్రాథమిక సమాచారాన్ని నమోదు చేయాలి. అంతేకాకుండా తెలిసిన భాషలు, విద్యార్హత, నైపుణ్యాలు, విద్యాభ్యాస సమాచారం, అనుభవం తదితర వివరాలను పూరించాలి. తర్వాత మెనూకు వెళ్లి ఉద్యోగాలను అన్వేషించాలి. ఉద్యోగాన్ని ఆమోదిస్తే ఉద్యోగదారుడితో సంభాషించాలి. మౌఖిక పరీక్షకు పిలిస్తే నిర్దేశిత తేదీ రోజున వెళ్లాలి. ఉద్యోగానికి ఎంపికైతే ఉద్యోగ నియామక పత్రాన్ని పొందుతారు. డీట్ యాప్ గురించి గ్రామీణ ప్రాంతాల్లో ముమ్మరంగా ప్రచారం చేస్తున్నామని వికారాబాద్ జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ మహేశ్వర్ తెలిపారు.

# ఆస్తుల సేకరణ వేగవంతం

హైదరాబాద్: నగరంలో చేపట్టిన మౌలిక వసతుల ప్రాజెక్ట్‌లేవీ సకాలంలో పూర్తయిన దాఖలాలు లేవు. రహదారుల విస్తరణ, పైవంతెనలు, మెట్రో, విద్యుత్తు, తాగునీటి, మురుగునీటి, వరద కాల్వ పనులవంటి వసతులకు సంబంధించిన ఏ ప్రాజెక్ట్ చేపట్టినా రైట్ ఆఫ్ వే (పనులు చేపట్టేందుకు కావాల్సిన స్థలం) లేకనే ఆలస్యం అవుతున్నాయి. ఇందుకు ప్రధాన కారణం భూసేకరణలో



జాప్యమే. మెట్రోరైలు రెండోదశలోని పాతబస్తీ మెట్రోకు ఈ సమస్య లేకుండా చూడాలని హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైలు సంస్థ(హెచ్‌ఏఎంఎల్) దృష్టి పెట్టింది. కేంద్రం అనుమతులు వచ్చేలోపే ఆస్తుల సేకరణ చేపట్టింది. మెట్రోరైలు రెండోదశలో కారిడార్-6ని ఎంజీబీఎస్ నుంచి చంద్రాయణగుట్ట వరకు 7.5 కి.మీ. ప్రతిపాదించారు. ఈమేరకు డీపీఆర్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించి కేంద్రం అనుమతి కోసం గత ఏడాది నవంబరులో పంపించారు. ఈ ఏడాది ఆఖరు లేదా వచ్చే ఏడాది జరిగే జీహెచ్‌ఎంసీ ఎన్నికల నాటికి అనుమతులు వస్తాయనే ఆశాభావంతో అధికారులు ఉన్నారు. ఆలోపే ఆస్తుల సేకరణ పూర్తి చేయాలనేది హెచ్‌ఏఎంఎల్ లక్ష్యం.

**ఇంకో 250 ఆస్తులు**

మెట్రో మార్గంలో 1100 వరకు ఆస్తులు ప్రభావితం అవుతున్నాయి. వీటిలో ఇప్పటికే 850 ఆస్తులను హెచ్‌ఏఎంఎల్ స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. యాజమానులు అంగీకరించడంతో రూ.300 కోట్ల వరకు పరిహారం అందజేశారు. ఆస్తుల సేకరణకు రూ.వెయ్యికోట్ల వరకు అవుతుందని అంచనా. రాష్ట్ర ప్రభుత్వం సైతం ఈమేరకు బడ్జెట్‌లో రూ.500 కోట్లు ప్రతిపాదించింది. దశలవారీగా నిధులను విడుదల చేస్తోంది.

**అనేక సవాళ్ల నడుమ..**

పాతబస్తీలో ఆస్తుల కూల్చివేత పనులు కొనసాగుతున్నాయి. ఒకదానికొకటి ఆనుకుని ఉన్న భవనాలు, వారసత్వ కట్టడాలు ఉండటంతో వాటికి నష్టం జరగకుండా పనులు చేపట్టారు. కూలీలతో కూల్చివేతలు జరుగుతుండటంతో కొంత ఎక్కువ సమయం పడుతోంది.

# కను'మురుగు' చేసేలా..

హైదరాబాద్: మూసీ పరీవాహక ప్రాంతంలో ప్రత్యేక మురుగునీటి వ్యవస్థ ఏర్పాటుకు జలమండలి సిద్ధమైంది. నదికి ఉత్తర, దక్షిణంవైపున 1,837 కి.మీ. మేర ప్రత్యేకంగా మురుగునీటి నెట్‌వర్క్‌ను రూపొందించనున్నారు. నార్సింగి నుంచి గౌరెల్లి వరకు వివిధ ప్రాంతాల మురుగునీటి వ్యవస్థలు ఇందులో భాగం కానున్నాయి. జలమండలికి 15 జోన్ల పరిధిలో ఈ ప్రత్యేక మురుగునీటి వ్యవస్థ అందుబాటులోకి రానుంది. ప్రాజెక్ట్‌కు రూ.4,700 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేయగా ఇందులో 70 శాతం వాటాగా రూ.3,290 కోట్లను ఆసియా అభివృద్ధి బ్యాంకు నుంచి రుణం తీసుకుంటారు. మిగిలిన 30 శాతం వాటా రూ.1,410 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం వాటాగా ఇవ్వనుంది.



డీపీఆర్‌ను జలమండలి సిద్ధం చేస్తోంది. 2019లో షా కన్సల్టెన్సీ రూపొందించిన మాస్టర్ ప్లాన్ మేరకు 2050 వరకు నగర విస్తరణ, పెరగనున్న జనాభా తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ ప్రణాళికను జలమండలి రూపొందిస్తోంది. **జోన్ 15లో ప్రాంతాలు** నార్సింగి, బాపూఘాట్, హైదర్షాకోట్, అత్తాపూ ర్, అంబర్‌పేట, నాగోల్, నల్లచెరువు, పీర్జాదిగూడ, కొర్రెముల, గౌరెల్లి

# నిర్మల్-జగిత్యాల రోడ్డు విస్తరణ

రాయికల్: ఏళ్లుగా ఎదురుచూస్తున్న నిర్మల్-జగిత్యాల జాతీయ రహదారి నిర్మాణానికి మోక్షం లభించింది. జాతీయ రహదారి-61 నిర్మాణ ఏర్పాటుకు 2018లో ప్రాథమిక సర్వే చేపట్టగా.. 2020లో తొలి విడత పనులు నిర్మల్-ఖానాపూర్ రహదారి నిర్మాణానికి నిధులు కేటాయించి పనులు ప్రారంభించారు. ఖానాపూర్ మండలం సుర్జాపూర్ వరకు పనులు పూర్తి కావొస్తున్నాయి. రెండో విడతలో భాగంగా జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం ఒబులాపూర్ నుంచి జగిత్యాల గ్రామీణ మండలం చల్‌గల్ వరకు పనులకు మోక్షం లభించింది. జాతీయ రహదారులు, రవాణా



మంత్రిత్వశాఖ(ఎంవోఆర్‌టీహెచ్) ఆమోదముద్ర వేసింది. నిర్మల్-జగిత్యాల జాతీయ రహదారి నిర్మాణంతో ఇరు జిల్లాల మధ్య మార్గం మరింత సుగమం కావడంతోపాటు మహారాష్ట్రతోపాటే పలు రాష్ట్రాలకు ప్రయాణం సులువు కానుంది.

**జిల్లాలో 39 కి.మీ మేర..**

మహారాష్ట్రలోని కల్యాణ్ నుంచి ప్రారంభమయ్యే 61వ నంబరు జాతీయ రహదారి.. భైంసా మీదుగా నిర్మల్ వరకు నిర్మాణం జరిగింది. నిర్మల్, జగిత్యాల జిల్లాలో మొత్తం 74 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి ప్రతిపాదించారు. గతంలో ప్రాథమిక సర్వే పూర్తి చేశారు. తొలి విడతలో నిధులు మంజూరుకాగా.. నిర్మల్ నుంచి ఖానాపూర్ మండలం బాదన్‌కుర్తి వరకు 35 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణం చివరిదశలో ఉంది. రెండో విడత జగిత్యాల జిల్లాలోని మల్లాపూర్ మండలం ఒబూలాపూర్ నుంచి చల్‌గల్ వరకు 39 కి.మీ మేర పనులు చేపట్టాల్సి ఉంది. తొలి విడతలో నిర్మల్-ఖానాపూర్ పూర్తికాగా.. రెండో విడతలో ఒబులాపూర్-చల్‌గల్ నిర్మాణానికి జిల్లా జాతీయ రహదారుల అధికారులు అలైన్‌మెంట్ ప్రక్రియ పూర్తిచేసి ప్రతిపాదనలు పంపించారు. అనుమతులు రాగానే డీపీఆర్ పూర్తిచేసి భూసేకరణ చేపట్టనున్నారు.

# అరచేతిలో వర్ణం.. ఆషాఢ బంధం



హైదరాబాద్: గోరింటాకు.. మహిళలకు భావోద్వేగ బంధం. పిల్లల నుంచి పండు ముదుసలి వరకు చేతులకు మురిపంగా గోరింటాకు పెట్టుకోవడానికి ఇష్టపడుతుంటారు. ఇంట్లో ఏ పేరంటం జరిగినా మహిళలందరి చేతులకూ ఎరుపు వర్ణమే దర్శనమిస్తుంది. పురుషులు కూడా గోరింటాకు పెట్టుకోవడానికి ఇష్టపడుతుంటారు. మందారంలా అరచేయి పండితే మంచి భర్త వస్తాడని యువతులు నమ్ముతుంటారు. కాలం మారినా సంస్కృతి, సంప్రదాయంలో భాగమైన గోరింటాకుపై ఉన్న మమకారం, అనుబంధం మాత్రం అలాగే కొనసాగుతోంది. రోజురోజుకూ పెరుగుతోంది.

**గేటెడ్ కమ్యూనిటీల్లోనూ...**

ప్రస్తుతం అపార్ట్‌మెంట్లలో ఉండేవారంతా కలిసి ఓ పండగలా ఈ గోరింటాకును పెట్టుకుంటున్నారు. గేటెడ్ కమ్యూనిటీల్లో ఉండే అతివలంతా ఒక్క దగ్గరకు చేరుతున్నారు. ప్రత్యేకంగా వారి పల్లెటూళ్ల నుంచి సహజసిద్ధ గోరింటాకును తెప్పించుకొని అందరికీ సరిపోయేలా తయారు చేసుకుంటున్నారు. లెక్కకు మించిన డిజైన్లు వేస్తూ ఆనంద పడుతున్నారు.

అలంకరణతో ఆనందం

అతివల అలంకరణలో గోరింటాకు ముఖ్యమైనది. ప్రస్తుతం ఆషాఢమాసం రావడంతో అతివలు గోరింటాకు పెట్టుకోవడానికి అమితాసక్తి చూపుతున్నారు. ప్రత్యేకంగా సహజసిద్ధ గోరింటాకు పల్లెటూళ్ల నుంచి తెప్పించుకునేవారు కొందరైతే.. ఆ సౌకర్యంలేక మార్కెట్‌లో లభించే 'కోన్ మెహందీ'తో అలంకరించుకుని సంబరపడేవారు మరికొందరు.

**ఆరోగ్య ప్రయోజనాలూ ఉన్నాయ్..**

గోరింటాకు పెట్టుకునే ఆచారం వెనుక.. బోలెడన్ని ఆరోగ్య ప్రయోజనాలూ ఉన్నాయి. ఆషాఢమాసంలో ఎక్కువగా వర్షాలు పడుతుంటాయి. దీంతో వాతావరణం చల్లగా మారుతుంది. ఫలితంగా అంటురోగాలు ప్రబలుతాయి. వాతావరణం చల్లబడినా.. శరీరం మాత్రం వేడిగానే ఉంటుంది. బయటి వాతావరణానికి అనుగుణంగా శరీరం మారదు. దీంతో సమస్యలు వస్తుంటాయి. గోరింటాకులో సహజసిద్ధంగానే వేడిని తగ్గించే గుణం ఉంటుందనేది నిపుణుల మాట. రోగనిరోధక శక్తి పెరిగి రక్తప్రసరణ సక్రమంగా జరుగుతుంది.

# స్వీయ మదింపులో ఆగని అక్రమాలు



కరీంనగర్ : పురపాలికల్లో ఆస్తిపన్ను, ఇంటినంబర్ జారీకి సంబంధించిన సెల్ఫ్ అసెస్‌మెంట్(స్వీయ మదింపు) ప్రక్రియలో అక్రమాలు ఆగడం లేదు. ఆన్‌లైన్‌లో ఇళ్ల యజమానులు చేసిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ చేయకుండానే ఆమోదించడంపై ఫిర్యాదులు వస్తున్నాయి. ఇదే తరహాలో వారం కిందట ఒక గది నిర్మించిన ఇంటినంబర్ కేటాయించడం వివాదాస్పదమైంది.

**కంప్యూటర్ ఆపరేటర్ వారధికి సరెండర్**

అన్నీ సవ్యంగా ఉన్న ఇళ్లకు నంబర్లు ఇవ్వకుండా దాటేస్తున్న రెవెన్యూ అధికారులు, రేకుల షెడ్డుతో ఒక గది నిర్మించి.. అందులో నివాసముండకున్నా ఎలా ఇస్తారని ఫిర్యాదు రావడంతో కమిషనర్ విచారణకు ఆదేశించారు. ముందుగా సంబంధిత ఆర్ఐకి మెమో ఇవ్వడంతో అసలు విషయం బయటకు వచ్చింది.

మార్చి నెలలో రెవెన్యూ అధికారులంతా ఆస్తి పన్నుల వసూళ్లపై ఉండగా ఓ ఆర్ఐ క్షేత్రస్థాయిలో పరిశీలించిన అసెస్‌మెంట్ పూర్తి చేసేందుకు కంప్యూటర్ ఆపరేటర్‌కు సూచించారు. ఎలాంటి విచారణ చేయకుండా ఓ ఇంటికి సంబంధించిన ఒక గదికి సంబంధించిన అసెస్‌మెంట్ చేసినట్లు తేలింది.

ఆ సమయంలో పని చేసిన ఆర్ఐ, డిప్యూటీ కమిషనర్ లాగిన్లతో ఉత్తర్వు జారీ అయినట్లు సమాచారం. దీనిని తీవ్రంగా పరిగణించి ఒప్పంద ప్రాతిపదికన పని చేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ అజిత్‌రావును వారధికి సరెండర్ చేసినట్లు డిప్యూటీ కమిషనర్ ఖాదర్ మొహిదుద్దీన్ తెలిపారు.

**తప్పుడు నమోదుకు 25 రెట్ల జరిమానా..**

నిర్మాణం పూర్తయిన తర్వాతే ఇంటి నంబర్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి. ఒక గది కాకుండా కుటుంబం నివసించేలా ఉంటే తప్ప అసెస్‌మెంట్ కాదు. గత ప్రభుత్వ హయాంలో స్వీయ మదింపు చేసుకునే విధానాన్ని తీసుకు రావడం అక్రమాలకు తావిచ్చింది.

శివారు ప్రాంతాల్లో మైదానాల్లో కూడా గుడిసెలు వేసుకొని ఇంటినంబర్లు వేసుకొని ప్లాట్లు చేసుకొని విక్రయించుకున్నారు. దీనిపై రాష్ట్ర స్థాయిలో ఫిర్యాదులు రావడంతో నేరుగా ఇచ్చే విధానాన్ని నిలిపివేసి, క్షేత్రస్థాయి పరిశీలన చేసేలా లాగిన్లను ఇచ్చారు. అప్పటి నుంచి పరిశీలించిన తర్వాతే ఆస్తిపన్ను, ఇంటినంబర్ కేటాయింపు చేస్తున్నారు. ఇంటి విస్తీర్ణం, కొలతలు తప్పుగా నమోదు చేస్తే రెవెన్యూ అధికారులు పరిశీలించి 25 రెట్లు జరిమానా విధించే అవకాశముంది.

# ఇక్కడ పని చేయదు.. అక్కడ మొరాయిస్తది



కరీంనగర్ : కరీంనగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఎక్స్‌రేలు పని చేయకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. వైద్య సిబ్బందికి అవగాహన లేకపోవడంతో టీ-హబ్ సమీపంలోని రేడియాలజీ హబ్‌కు వెళ్లాలని సూచిస్తున్నారు. అక్కడ కూడా కొన్నిసార్లు యంత్రం మొరాయిస్తోంది. సాంకేతికంగా ఇబ్బందులు వస్తున్నాయని సిబ్బంది చెబుతున్నారు. కొందరు రోగులు వారి సమయం వచ్చే వరకు ఓపికగా ఎదురుచూసి ఎక్స్‌రే తీయించుకుంటుండగా మిగతా వారు వెళ్లిపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**తరచూ మరమ్మతుకు..**

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి ప్రతిరోజు బయటి విభాగం (ఓపీ) 500 వరకు ఉంటుంది. ఇందులో దాదాపు 100కుపైగా ఆర్థో కేసులు ఉంటాయి. ప్రమాదవశాత్తు కాళ్లు, చేతులు విరిగిన వారితోపాటు వయసు పెరిగిన కొలదీ వచ్చే సమస్యలు మోకాళ్లు అరగడం, ఇతరత్రా ఉంటాయి. వీటితోపాటు గొడవల ఘటనల్లో గాయపడిన వారిని పోలీసులు మొదట ఇక్కడకే పంపిస్తారు.

ఎక్స్‌రే యంత్రాలు కొన్నేళ్ల కిందటివి కావడంతో తరచూ మరమ్మతుకు గురవుతున్నాయి. వాటి స్థానంలో కొత్త వాటికి ప్రభుత్వం బడ్జెట్ కేటాయించకపోవడంతో మరమ్మతు చేసుకుంటూ నెట్టుకొస్తున్నారు. ఆసుపత్రిలో యంత్రాలు పాడవడంతో మొదట రోగులను సమీపంలోని రేడియాలజీ హబ్‌కు పంపుతున్నారు. ఇక్కడ 'ఆరోగ్య మహిళ'కు మొదటి ప్రాధాన్యం ఇస్తుంటారు. హబ్‌లో రద్దీ అధికం కావడంతో సాంకేతిక సమస్యలతో యంత్రం మొరాయిస్తోంది. ఆలస్యంగా ఎక్స్‌రేలు తీస్తుండటం.. కొన్నిసార్లు సిబ్బంది యంత్రం పని చేయడంలేదని వివరాలు నమోదు చేయడానికి వెనుకాడుతున్నారు.

ఆసుపత్రిలో ఎక్స్‌రే యంత్రాలు మొత్తం అయిదు వరకు ఉండగా, వాటికి అనుబంధంగా ఉండాల్సిన మిషనరీలో సాంకేతిక సమస్యలు రావడంతో సరిగా పని చేయడం లేదు.

**సాంకేతిక సమస్యతో..**

శనివారం ఉదయం ఎక్స్‌రే యంత్రంలో కొంత ఇబ్బంది ఉంటే టీహబ్‌కు పంపించాం. మధ్యాహ్నం నుంచి పని చేసింది. ఇటీవల కొత్తగా వచ్చిన యంత్రం తరచూ సాంకేతిక సమస్యతో ఆగిపోతోంది. ఇంజినీర్‌తో మాట్లాడి సమస్య పరిష్కరిస్తాం. సీఆర్ యంత్రాల కోసం ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకుంటాం.

డాక్టర్ నవీనా, ఆసుపత్రి ఆర్ఎంవో

# అంజన్న ఆలయ భూమికి రక్షణ కరవు!

మల్యాల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయ భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. స్వామివారి పేరిట మల్యాల, కొడిమ్యాల మండలాల పరిధిలో దాదాపు 42 ఎకరాల విలువైన భూములున్నాయి. వీటికి తోడు ఏడేళ్ల కిందట రెవెన్యూ శాఖ పరిధిలోని 333 ఎకరాలను అప్పటి జిల్లా కలెక్టర్ శరత్ ఆలయానికి స్వాధీనం చేశారు. కొండగట్టు దిగువ ప్రాంతంలోని స్టేజీ వద్ద 380సి సర్వే నంబరులో ఆలయానికి చెందిన 1.21 ఎకరాల స్థలం ఉంది. దీని సంరక్షణకు అధికారులు ఎలాంటి హద్దులు ఏర్పాటు చేయకపోవడంతో కొందరు ఆక్రమించుకొని నిర్మాణాలు చేపట్టారు. మరికొందరు తాత్కాలిక షెడ్లు వేసుకొని వినియోగించుకుంటున్నారు. జగిత్యాల-కరీంనగర్ జాతీయ రహదారి పక్కన గల ఈ స్థలం విలువ బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం రూ.12 కోట్ల వరకు ఉంటుందని అంచనా. గతంలో కొందరు ఆలయ భూమిలో ఇళ్ల నిర్మాణం చేపట్టడంతో అధికారులు నిలిపివేయించినా ఇప్పటివరకు సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేయడం లేదన్న ఆరోపణలున్నాయి. బొజ్జపోతన్న గుడి సమీపంలోని ఆలయ భూమి కూడా కొంత ఆక్రమణకు గురైనట్లు సమాచారం. ఆలయ మాన్యాల సంరక్షణకు దేవాదాయ శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.



**ఆలయ స్థలంలో కల్యాణ మండపం నిర్మిస్తాం**

కొండగట్టు దిగువ ప్రాంతంలోని స్టేజీ వద్ద ఆలయ భూమి ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకుంటాం. ఆక్రమణలు తొలగించి స్థానికుల సహకారంతో కల్యాణమండపం, దుకాణ భవన సముదాయం నిర్మిస్తాం. గదులను కొన్నేళ్లపాటు స్థానిక వ్యాపారులకు అద్దెకు ఇస్తాం. ఆలయం పేరిట ఉన్న భూములు అన్యాక్రాంతం కాకుండా సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేస్తాం.

శ్రీకాంతరావు, ఈవో

# మాఫియా మయం.. ఇసుక మాయం

సిరిసిల్ల: జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు అవసరాలకు ఇసుకను రెవెన్యూశాఖ వే బిల్లులు జారీ చేస్తోంది. దీనికోసం మానేరు, మూల వాగులో ఆరు ప్రాంతాల్లో రీచ్‌లను గుర్తించారు. ఒక్కో మండలానికి వారంలో రెండు రోజుల చొప్పున వేబిల్లులు ఇస్తారు. ఇదంతా అధికారికంగా జరిగేతంతు. వర్షాలు భారీగా కురిస్తే నెలల తరబడి వాగుల్లోంచి ఇసుక తీయడం సాధ్యం కాదు. దీనికి అక్రమార్కులు ముందుగానే సిద్ధమయ్యారు. వాగుల్లో అక్రమంగా తవ్వుతూ.. ట్రాక్టర్లలో తరలిస్తూ జిల్లా సరిహద్దుల్లో ఎవరికీ అనుమానం రాని ప్రాంతాల్లో నిల్వలు చేస్తున్నారు. వీటిని తరలించడంలోనూ ఒక మాఫియాను తలపించేలా ఉంటుంది.

**తనిఖీ కేంద్రాల్లేకే..**

జిల్లా సరిహద్దులో కరీంనగర్ రహదారిలో నర్సింగాపూర్, సిద్దిపేటవైపు జిల్లెల, కామారెడ్డి మార్గంలో పెద్దమ్మకూడలిలో పోలీసులు, రెవెన్యూ చెక్‌పోస్టులు ఉండేవి. వీటిని ఎన్నికల సమయాలు, బక్రీదుకు ముందు



మాత్రమే సిబ్బంది ఉంటారు. మిగతా సమయాల్లో ఇక్కడ ఎవరూ ఉండరు. దీంతో అక్రమార్కుల రవాణాలకు అడ్డే ఉండదు. జిల్లాల సరిహద్దుల్లో చెక్‌పోస్టు ఏర్పాటు ప్రతిపాదనలకే పరిమితమైంది. ఎన్నికలు, శాంతిభద్రతల సందర్భాల్లో మాత్రమే తాత్కాలికంగా ఏర్పాటు చేస్తున్నారు. చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తే నిరంతరం పర్యవేక్షణ, తనిఖీలు ఉండటంతో అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడుతుంది.

**ఎలా తరలుతోందంటే..**

జిల్లాలో తంగళ్లపల్లి, వేములవాడ గ్రామీణం, బోయినపల్లి, ఇల్లంతకుంట ప్రాంతాలకు చెందిన కొందరు ఒక బృందంగా ఏర్పడి రాజకీయ పలుకుబడితో దందాకు తెరతీశారు. ప్రధానంగా ఇల్లంతకుంట మండలం మానేరు వాగు సమీపంలోని పొత్తూరు, కందికట్కూరు, మల్లాపూర్ గ్రామాల పరిధిలో ఇసుకను తవ్వుతున్నారు. ట్రాక్టర్ల ద్వారా జిల్లా సరిహద్దు గ్రామం సిరికొండ అటవీ ప్రాంతంలో నిల్వలు చేస్తున్నారు. ఈ గ్రామాల్లో రెవెన్యూ శాఖ ఇసుక రీచ్‌లను మూసివేసింది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసమని తవ్వకాలు జరుపుతున్నారు. వీటిని క్షేత్రస్థాయిలో రెవెన్యూ సిబ్బంది పరిశీలించరు.

ట్రాక్టర్‌తో తరలిస్తున్నప్పుడు అధికారులు ఆపితే ఇందిరమ్మ ఇంటి కోసమని చెబుతున్నారు. వేబిల్లు చూపించని వారికి పెనాల్టీ.. లేకుంటే సాఫీగా వెళ్తున్నారు.

**నిల్వచేసిన ఇసుకను రాత్రి సమయాలు..** సెలవు రోజుల్లో లారీల్లో నింపి సిద్దిపేట, కామారెడ్డి, హైదరాబాద్‌లకు తరలిస్తున్నారు. లారీల్లో ఇసుక తరలించే ముందు ఎక్కడా తనిఖీలు జరగట్లేదని నిర్ధారించుకున్నాకే బయలుదేరుతారు. అనుమానం వస్తే మధ్యలోనే ఉండిపోతారు. ఇసుక వాహనాల రాకపోకలతో ఈ ప్రాంతంలోని రహదారి పూర్తిగా గుంతలమయమైంది. ద్విచక్రవాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

# చిన్నబోతున్న కమతం!


ఎల్లారెడ్డిపేట: మెట్టప్రాంతమైన జిల్లాలో వర్షాలు ముఖం చాటేస్తున్నాయి. చెరువులు, కుంటలు నీరు లేక వెలవెలబోతున్నాయి. భూగర్భజల మట్టాల పెరుగుదలలో ఎలాంటి మార్పు కనిపించడం లేదు. వ్యవసాయానికి దన్నుగా నిలిచే గొట్టపు బావులు వెనక్కి తగ్గుతున్నాయి. ఓ వైపు ఎండల తీవ్రత.. మరోవైపు ఈదురు గాలుల ధాటికి వరినాట్ల కోసం సిద్ధం చేసిన దుక్కులు, నాట్లు వేసిన కమతాల్లోని నీరు ఆవిరై తడారి చిన్నబోతున్నాయి. సమృద్ధిగా వర్షాలు లేక వ్యవసాయ పనుల ప్రక్రియ తడబడుతూ 'సాగు'తోంది.

**జలధార తగ్గుముఖం**

జిల్లాలో 600లకుపైగా చెరువులున్నాయి. వాటిలో కొన్ని చెరువులు పూర్తిగా వట్టిపోగా మరికొన్ని చెరువులు డెడ్ స్టోరేజీకి చేరుకున్నాయి. భూగర్భజల మట్టాలు ఒక్కసారిగా పెరిగి, అదే స్థాయిలో కిందికి దిగజారడం జిల్లాలో పరిపాటి. ఈ వానాకాలంలో సరైన వర్షాలు లేకపోవడంతో ఆ ప్రభావం భూగర్భజల మట్టాలపై పడుతోంది. బోరుబావుల్లో జలధార తగ్గుముఖం పడుతోంది. చాలా చోట్ల పాతాళగంగ పైకిరావడం లేదు.

జూన్‌లో సగటున భూగర్భజల మట్టాలు 10.53 మీటర్లలో ఉన్నాయి. 18.52 మీటర్ల లోతుతో వేములవాడ అర్బన్ ప్రమాద ఘంటికలను మోగిస్తుండగా 17.80 మీటర్ల లోతుతో ఎల్లారెడ్డిపేట మండలం రెండోస్థానంలో నిలుస్తోంది. ఒక్క చందుర్తి మండలంలో అతి తక్కువ లోతు 5.65 మీటర్లలో లభిస్తున్నాయి.

గతేడాది నవంబరు మాసంతో పోల్చితే ఈ సంవత్సరం జూన్‌లో



4.65 మీటర్ల లోతుకు భూగర్భజలాలు వెళ్లాయి. గత సంవత్సరం జూన్ మాసానికి ఈ ఏడాది జూన్‌తో సరిచూస్తే 0.99 మీటర్లు పెరిగాయి. ఈ సంవత్సరం మే మాసానికి జూన్‌తో పోల్చితే 0.48 మీటర్ల మేర పెరిగాయి. ఇది స్వల్పమే. భూగర్భజల మట్టాల్లో చెప్పుకోదగిన పెరుగుదల లేకపోవడం అనేది ఆందోళనకర విషయం.

**ఆగస్టు వరకు 'నాటు'కోవచ్చు..**

జులై నెలాఖరు వరకు పెసర, మక్క, కంది తదితర ఆరుతడి పంటలు వేసుకోవచ్చని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఆగస్టు నెలాఖరు వరకు వరి పంటను సాగు చేసుకోవచ్చని చెబుతుండటం వర్షాధార రైతులకు కాస్త ఊరటనిచ్చే అంశం.

## చిరునామా, రసీదు, తేదీ చూసుకోండి!

హైదరాబాద్: అసెంబుల్డ్ పరికరాల విక్రయాలతో వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు. తక్కువ ధర ఆశ చూపి నాసిరకం ఉత్పత్తులు విక్రయిస్తున్నారు. ఉత్పత్తులను కొనుగోలు చేశాక.. అవి కొన్ని రోజులకే మొరాయిస్తున్నాయి. జరిగే నష్టానికి పరిహారం ఎవరిస్తారు..? విక్రయ కేంద్రం నిర్వాహకుడా..? తయారీదారుడా..? డీలరా..? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

వినియోగదారుల పరిరక్షణ చట్టంలో వీటికి సంబంధించి స్పష్టమైన నిబంధనలున్నాయని న్యాయ నిపుణులు సూచిస్తున్నారు. 'తయారీదారు, డీలర్లు, రిటైర్ల' వరకు అందర్నీ ప్రతివాదులుగా చేర్చి విచారించే వెసులుబాటు ఉంది. ఇందుకు వినియోగదారుడు కొనుగోలు చేసిన ప్రతిచోట 'చిరునామా, రసీదు, తేదీ' వివరాలు భద్రపరుచుకోవడం ద్వారా పరిహారం పొందొచ్చు.

**నాసిరకం ఉత్పత్తులతో ప్రమాదాలు..:** నాసిరకం పరికరాలతో ప్రాణాల మీదకొస్తున్న ఘటనలూ ఉన్నాయి. దోమల్‌గూడకు చెందిన దినేష్ షా అనే వ్యక్తి ఎంఎస్ ఎంటర్‌ప్రైజెస్‌లో ఇన్వర్టర్ కొనుగోలు చేశారు. మూడు రోజులకే బ్యాటరీ నుంచి పొగలు, మంటలు రావడంతో ఇల్లంతా పొగతో నిండిపోయింది. మంటల దాటికి రూ.1,11,800 విలువైన సామగ్రి దగ్ధమైంది. ఇంట్లో ఎలాంటి షార్ట్‌సర్క్యూట్ జరగలేదని టీఎస్ఎస్పీడీసీఎల్, బ్యాటరీ ఇన్వర్టర్ వల్లే ఘటన జరిగిందని అగ్నిమాపకశాఖ రిపోర్టులిచ్చాయి. ప్రతివాద సంస్థ నుంచి పరిహారం



ఇప్పించాలని ఫిర్యాదీ కమిషన్‌ను ఆశ్రయించగా.. విచారించిన కమిషన్ 1,69,600 రూపాయలనుచెల్లించాలని ప్రతివాద సంస్థను ఆదేశించి ంది. జీడిమెట్లకు చెందిన ఓ వ్యక్తి రూ.3వేలతో అసెంబుల్డ్ కూలర్‌ను కొనుగోలు చేశారు. అది రెండో రోజు నుంచి మొరాయించడంతో షాపు యజమానిని సంప్రదించగా పట్టించుకోలేదు. దీంతో అతడు ఫిర్యాదు చేయగా.. కాళ్లబేరానికొచ్చి డబ్బులు తిరిగిచ్చేశాడు.

**రూ.కోట్లలో వ్యాపారం...**నగరంలో ఈ అసెంబుల్డ్ పరికరాల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. సికింద్రాబాద్, అబిడ్స్, కోఠి, పాతనగ రం తదితర ప్రాంతాల్లో అసెంబుల్డ్ పరికరాల విక్రయించే సముదా యాలు 10వేలకు పైగా ఉన్నాయి. లక్షలాది మంది కొనుగోలుదారులు ఉండగా.. ప్రతి నెలా రూ.50 కోట్లకు పైగా వ్యాపారం జరుగుతోంది. సాధారణ ప్రజలతో పాటు దిగువ మధ్య తరగతివారే ఎక్కువగా ఈ తరహా ఘటనల్లో బాధితులవు తున్నారు. వారంటీలు, గ్యారంటీలు, చిరునామా లేని బిల్లులను తీసుకొని చివరికి తలలు బాదుకుంటున్నారు.

## మొక్కలు సిద్ధం.. నటడమే ఆలస్యం

గోదావరిఖని : వనమహోత్సవంలో భాగంగా సింగరేణి సంస్థ మొక్కలు నాటడానికి సిద్ధమయింది. ఏటా ఈ కార్యక్రమం నిర్వహిస్తుండగా.. ఈ ఏడాది కూడా సింగరేణి వ్యాప్తంగా 45 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఆయా ప్రాంతాలను ఇప్పటికే గుర్తించింది. ఓబీ మట్టికుప్పలపై, బ్లాక్ ఫారెస్టు, అవెన్యూ ప్లాంటేషన్ పేరిట నాటేందుకు సమాయత్తమవుతోంది. సంస్థ ఇప్పటికే కోట్ల మొక్కలు నాటి సంరక్షిస్తోంది. సామూహిక అటవీ క్షేత్రాల మాదిరిగా మొక్కలను పెంచిన సింగరేణి ఈ ఏడాది 670 హెక్టార్లలో దాదాపు 45 లక్షల మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఒక్కో ప్రాంతానికి లక్ష్యాన్ని నిర్దేశించి నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా ఓబీ డంప్‌యార్డు(మట్టికుప్ప లపై) ఎక్కువ శాతం నాటనున్నారు.

**11 ఏరియాల్లో వన మహోత్సవం**

సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లో వనమహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఒక్కో డివిజన్‌లో ఉన్న స్థలంతో పాటు మట్టికుప్పలను ఎంచుకుని వాటిపై మొక్కలు నాటనున్నారు. దీన్ని ఒక ప్రత్యేక కార్యక్రమంగా భావిస్తూ.. పర్యావరణ పరిరక్షణకు సింగరేణి తోడ్పాటు నందిస్తోంది. సాధ్యమైనంత మేర మొక్కలు నాటి వాతావరణ కాలుష్యం అరికట్టేందుకు ప్రయత్నిస్తోంది.

**ప్రభుత్వానికి, కార్మికులకు పంపిణీ**యాజమాన్యం ఇప్పటికే నర్సరీల్లో మొక్కలను సిద్ధంగా ఉంచింది. సింగరేణి వ్యాప్తంగా ఉన్న నర్సరీల్లో కోటి మొక్కల వరకు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వానికి అందించేందుకు కూడా సింగరేణి ఏడాది కాలంగా మొక్కలను పెంచుతోంది. నర్సరీల్లో అడవి జాతి, పండ్ల మొక్కలు పెంచారు. వేప, నారవేప, రావి, కానుగ, మామిడి, నిమ్మ, నేరేడు, జామ మొక్కలు పెంచుతున్నారు. రహదారుల పక్కన నాటడమే కాకుండా కార్మిక కుటుంబాలకు కూడా పంపిణీ చేయనున్నారు. ఏటా జూన్‌లో మొక్కలు నాటి సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నారు.

## మానేరు మట్టి.. యథేచ్ఛగా కొల్లగొట్టి

వేములవాడ : సహజ వనరులను రక్షించాల్సిన అధికారులు ప్రేక్షకపాత్ర పోషిస్తుండటం, శాఖల మధ్య సమన్వయ లోపంతో మట్టి అక్రమ రవాణాకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. స్థిరాస్తి వ్యాపారులు, బడా కాంట్రాక్టర్లతో అక్రమార్కులు ఒప్పందం చేసుకొని భారీ యంత్రాలతో మట్టిని తోడుతూ టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. వేములవాడ గ్రామీణ మండలం అనుపురం, కొడిముంజ శివారులోని రాజరాజేశ్వర జలాశయం (మధ్యమానేరు)లో మట్టి దందా కొనసాగుతోంది. తవ్వకాల్లో నిబంధనలు ఉల్లంఘిస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని.. శాఖల మధ్య సమన్వయ లోపం కనిపిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**నీరు తగ్గడంతో..**మధ్యమానేరు జలాశయం పూర్తి సామర్థ్యం 27.5 టీఎంసీలు కాగా జలాశయ నిర్మాణం అనంతరం 2019 నుంచి సుమారు 20 టీఎంసీలకుపైగా నీటిని నిల్వ చేస్తున్నారు. పూర్తి స్థాయిలో నీరు నిల్వ ఉన్న సమయంలో బ్యాక్ వాటర్ ముంపు గ్రామాల వరకు ఉంటుంది.

నీటినిల్వ తగ్గడంతో ముంపు గ్రామాలు, వ్యవసాయ భూములు తేలాయి. ఇదే అదనుగా అక్రమార్కులు మట్టి దందాకు తెరలేపారు. ఎఫ్‌టీఎల్ పరిధి దాటి జలాశయంలోకి చొరబడి యంత్రాలతో తవ్వకాలు చేపడుతున్నారు. పక్కా ప్రణాళికతో దందా నడిపిస్తూ రూ.లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు.

కొన్ని రోజులుగా ఈ దందా జోరుగా కొనసాగుతోంది. నిరంతరాయంగా ఓవర్ లోడ్‌తో మట్టి తరలిస్తున్నారు. యంత్రాలతో మట్టి తీయడంతో పెద్దపెద్ద గుంతలు ఏర్పడుతున్నాయి. కళ్లెదుటే పెద్దసంఖ్యలో వాహనాల్లో మట్టి అక్రమ రవాణా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**అధికారులు ఏమన్నారంటే..**

మధ్యమానేరు జలాశయ ఈఈ జగన్, వేములవాడ గ్రామీణ తహసీల్దార్ అబుబాకర్‌లను సంప్రదించింది. మట్టి తవ్వకాలకు తాము ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని వారు తెలిపారు. దందాపై తమకు సమాచారం లేదని.. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

## బొగ్గును మండిస్తూ.. కాలుష్యం పెంచేస్తూ



హైదరాబాద్: వాహన, నిర్మాణ రంగాల నుంచి వెలువడే కాలుష్యానికి తోడు బొగ్గు (చార్‌కోల్)ను మండిస్తుండటం ద్వారా వెలువడుతున్న కాలుష్యం నగరంలో క్రమంగా పెరుగుతోంది. ఫలితంగా సూక్ష్మధూళి రేణువులు, సల్ఫర్‌డయాక్సైడ్ పరిమాణం వాతావరణంలో పెరుగుతోంది. జూపార్కు ప్రాంతంలో ఇత్తడి, సిల్వర్ పాత్రల తయారీ దుకాణాలు ఎక్కువ సంఖ్యలో ఉండటంతో అక్కడ విపరీతమైన కాలుష్యం నమోదై వాయునాణ్యత తగ్గుతోంది. దీనికి తోడు నగరంలోని లాండ్రీ, ఇస్త్రీ, చిన్న జువెల్లరీ దుకాణాలు, మొక్క జొన్న విక్రయ కేంద్రాలు రెస్టారెంట్లు, హోటళ్లు, బార్బెక్యూ జాయింట్లలో గ్రిల్లింగ్ కోసం వినియోగం పెరుగుతోంది. నగర వ్యాప్తంగా ప్రతినెలా 600 టన్నుల బొగ్గులు వినియోగిస్తున్నట్టు అంచనా. అంటే ఏటా 7200 టన్నుల బొగ్గు వినియోగిస్తున్నారు. వీటికి ప్రత్యామ్నాయాలున్నా సరైన ప్రోత్సాహకాలు లేక, ఆర్థిక ఇబ్బందులతో వినియోగించడం లేదని చెబుతున్నారు.

**దుష్పరిణామాలెన్నో..**

బొగ్గును మండించడంతో అనేక దుష్పరిణామాలు సంభవిస్తున్నాయి. ఇవి పర్యావరణం, ఆరోగ్యం, ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయి. బొగ్గును మండించడంతో కార్బన్ డయాక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్‌లు, బూడిద (పార్టిక్యులేట్ మ్యాటర్ – పీఎం 2.5, పీఎం 10)వంటివి విడుదలై గాలి నాణ్యతను దెబ్బతీస్తాయి. ఇవి గ్లోబల్ వార్మింగ్, ఆమ్లవర్షం, స్మోగ్ ఏర్పడటానికి కారణమవుతాయి. బొగ్గు దహనంతో విడుదలయ్యే కాలుష్య కారకాలు శ్వాసకోశ వ్యాధులు, గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి సమస్యలకు దారి తీస్తాయి.

బొగ్గు దహనంతో విడుదలయ్యే కార్బన్‌డయాక్సైడ్ హైదరాబాద్‌లో ఉష్ణోగ్రతల పెరుగుదలకు ఒక కారణమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. బొగ్గు బూడిద, వ్యర్థాలు నీటి వనరులను కలుషితం చేస్తాయి.

మలక్‌పేట్, అంబర్‌పేట్, నాచారంలోని కొన్ని పరిశ్రమల్లో చార్‌కోల్‌ను ఇంధనంగా వినియోగిస్తున్నారు.

మాదాపూర్, హైటెక్‌సిటీ రెస్టారెంట్లలో చార్‌కోల్ గ్రిల్లింగ్‌తో స్థానికంగా పొగ, కాలుష్యం పెరుగుతోంది.

**సరఫరా ఇక్కడి నుంచే...**

చార్‌కోల్ అండ్ ఫైర్‌వుడ్ డిపోలు నగరంలో వందల్లో ఉన్నాయి. వీటి నుంచే బొగ్గు సరఫరా అవుతోంది. మలక్‌పేట్, నాచారం, అంబర్‌పేట్, కుషాయిగూడ, కుత్బుల్లాపూర్, మధురానగర్, షాపూర్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి సరఫరాదారులు ఎక్కువగా ఉన్నారు. కేజీరూ.50 చొప్పున బయట మార్కెట్‌లో విక్రయిస్తుండగా ప్రతినెలా రూ.4000తో బొగ్గు కొంటానని ఖైరతాబాద్‌కు చెందిన ఓ ఇస్త్రీదుకాణం నిర్వాహకురాలు తెలిపారు.

**పరిష్కార మార్గాలు..**

ఎల్పీజీ లేదా బయోగ్యాస్, ఎలక్ట్రిక్ గ్రిల్లింగ్ వంటి పరిశుభ్ర ఇంధనాలను ప్రోత్సహించడం ద్వారా ఖర్చు తగ్గించుకునే అవకాశం ఉంది.

రెస్టారెంట్లలో చార్‌కోల్ వాడకాన్ని నియంత్రించడానికి జీహెచ్ఎంసీ, పీసీబీ కఠిన నిబంధనలు అమలు చేయాలి.

చార్‌కోల్ ఉత్పత్తికి చెట్లను నరకడం ద్వారా పచ్చదనం తగ్గే ప్రమాదం ఉంది. బదులుగా మొక్కలు నాటితే ఉష్ణోగ్రతలను క్రమంగా తగ్గించే ఆస్కారం ఉంది.

## ప్రాధాన్య ప్రాజెక్టులపై దృష్టి



జగిత్యాల : తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనం చేకూర్చే ప్రాజెక్టులను ఈ వానాకాలం నుంచి అందుబాటులోకి తేవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు నీటి పారుదలశాఖ అధికారులు సిద్ధం చేసిన ప్రతిపాదనలు క్షేత్రస్థాయికి చేరితే పూర్తి ఆయకట్టు స్థిరీకరణ సాధ్యపడనుంది.

**75 చెక్‌డ్యాంలు ప్రశ్నార్థకం**

ఉమ్మడి జిల్లాలో రూ.315 కోట్లతో చేపట్టిన 75 చెక్‌డ్యాంల నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది. కాకతీయ, వరద కాలువల నుంచి 601 గొలుసుకట్టు చెరువుల్లోకి తూములు, పైపులైన్లు, కాలువల నిర్మాణాన్ని పూర్తిచేయడం, గోదావరి నుంచి 34 గ్రామాలకు ఎత్తిపోతల పథకాల పూర్తికి నిధులు విడుదలైతే ఉమ్మడి జిల్లాలో ఆయకట్టు స్థిరీకరణ సాధ్యమవుతుంది.

**చివరిదశకు సదర్‌మాట్ పనులు**

జగిత్యాల, నిర్మల్ జిల్లాల మధ్య గోదావరిపై రూ.587 కోట్లతో చేపట్టిన సదర్‌మాట్ ప్రాజెక్టు నిర్మాణం దాదాపు పూర్తయింది. చివరిదఫా పనులకు రూ.13.64 కోట్ల నిధులను కేటాయించారు. ఇందులో 1.58 టీఎంసీల నీటిని నిల్వ చేయనుండగా.. 55 గేట్లు, 967 మీటర్లుగల ప్రాజెక్టు పరిధిలో రెండు జిల్లాల్లో 18 వేల ఆయకట్టు ఉ ంది. దీని ద్వారా జిల్లాలో 4,896 ఎకరాలకు నీరందనుంది.

**రోళ్లవాగు పూర్తికి ఎదురుచూపులు**

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ఎత్తిపోసిన నీటితో.. పెద్దపల్లి జిల్లా దేవికొండవద్ద 7.78 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో పత్తిపాక జలాశయ నిర్మాణాన్ని తలపెట్టారు. జగిత్యాల జిల్లా బీర్‌పూర్‌లో రూ.165 కోట్లతో చేపట్టిన రోళ్లవాగు ఆధునికీకరణ చివరిదశకు చేరగా.. ప్రాజెక్టుకు గేట్లను అమర్చాల్సి ఉంది. ఇది పూర్తయితే దాదాపు 25 వేల ఎకరాలకు నీరందుతుంది. ఎస్సారెస్పీ మొదటిదశలో 0–146 కి.మీ ఎల్ఎండీ ఎగువ వరకు, 146–284 కి.మీ ఎల్ఎండీ దిగువనగల రెండో దశ ఆయకట్టులో తూములు, షట్టర్ల మరమ్మతులు, కాలువల లైనింగ్ తదితరాలకు రూ.660 కోట్ల నిధులు కేటాయించారు.

**ఎల్లంపల్లి జలాలను ఎత్తిపోసేలా..**


ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నంది, గాయత్రి పంపుహౌస్‌ల ద్వారా నీటిని ఎత్తిపోసి 1.54 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించింది. ఎల్లంపల్లి జలాలను వరదకాలువ ద్వారా ఎస్సారెస్పీలోకి ఎత్తిపోసేలా రూ.1,950 కోట్లతో చేపట్టిన పునరుజ్జీవ పథకం పూర్తయింది. ఈ క్రమంలో మధ్య మానేరులో 27.500, దిగువ మానేరులో 22.034 టీఎంసీల నీటి నిల్వకు అవకాశం ఏర్పడింది. మల్యాలలో వరదకాలువ 88.400 కి.మీ వద్ద లింకు కాలువను తవ్వి 97.460 కి.మీ తాటిపల్లి వద్ద కాకతీయ కాలువలోకి నీటిని తరలించేలా రూ.36.82 కోట్లతో అనుసంధాన కాలువ నిర్మాణం పూర్తయింది. దీంతో ధర్మపురి, చొప్పదండి, రామగుండం, మంథని, పెద్దపల్లి, కరీంనగర్ నియోజకవర్గాల్లోని 2.51 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందనుంది.

## రైతులకు భరోసా

ఎల్లారెడ్డిపేట : వానాకాలం సీజన్ ప్రారంభంలోనే రైతు భరోసాను ప్రభుత్వం అమలు చేస్తుండటంతో అన్నదాతల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. జిల్లా భౌగోళిక విస్తీర్ణం 4.82 లక్షల ఎకరాలు కాగా 2,82,490 ఎకరాల్లో పంటలను సాగు చేస్తున్నారు. 1,39,690 మంది రైతులు లబ్ధిపొందనుండగా రూ.153,28,81,264ల పెట్టుబడి సాయం అందనుంది. ఈ మేరకు జిల్లాలోని 175 రెవెన్యూ గ్రామాలకు చెందిన 1,10,424 మంది రైతులకు సోమ, మంగళవారాల్లో రూ.99,61,65,241లను సర్కారు జమ చేసింది. 1,39,690 మంది రైతులు.. రూ.153.28 కోట్లు

ప్రస్తుత వానాకాలం సీజన్ ప్రారంభంలోనే ప్రభుత్వం అందించే పంట పెట్టుబడి సాయం వ్యవసాయానికి ఊతంగా మారనుంది. జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో 184860 ఎకరాల్లో వరి, 1600 ఎకరాల్లో మొక్కజొన్న, 49760 ఎకరాల్లో పత్తి, 14.04 ఎకరాల్లో జొన్న, 1155.1 ఎకరాల్లో కంది, 79 ఎకరాల్లో పెసర, 6304.96 ఎకరాల్లో ఇతర పంటలు కలుపుకొని మొత్తం 243773.1 ఎకరాల విస్తీర్ణంలో పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. ఇప్పటికే రైతులు బోర్లు, బావుల కింద నార్లు పోసి, వరినాట్లకు సిద్ధమవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు కొన్ని మండలాల్లో పత్తి విత్తనాలను కూడా విత్తారు. మరికొన్ని మండలాల్లో పత్తిని విత్తేందుకు భారీ వర్షాల కోసం నిరీక్షిస్తున్నారు. సమృద్ధిగా వర్షాలు కురిస్తే ఈ ఏడాది వానాకాలంలో భారీగా దిగుబడి సాధిస్తామనే ధీమాను అన్నదాతలు వ్యక్తం చేస్తున్నారు.

పంటల సాగులో భాగంగా విత్తనాలు, ఎరువుల కొనుగోలు, ఇతర వ్యవసాయ



అవసరాలకు ప్రభుత్వం అందించే పంట పెట్టుబడి సాయం రైతులకు ఎంతగానో ఉపయోగపడనుంది. సమయానికి డబ్బులు అందుతుండడంతో ఇతరుల వద్ద చేయిచాచే అవసరం లేకుండా ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. ఎకరాల విస్తీర్ణంతో సంబంధం లేకుండా పరిమితులను ప్రభుత్వం తొలగించడంతో ఈ ఏడాది జిల్లాలో ఎక్కువ సంఖ్యలోని రైతులకు మేలు చేకూరనుంది. అదునులోనే ఎకరానికి రూ. 6 వేల చొప్పున రైతు భరోసా పథకం అమలుతో జిల్లాలో పంటల సాగుబడి కూడా వడివడిగా కొనసాగనుంది.

## నకిలీపై.. బిగించాలి 'పీడీ'కిలి

ఖమ్మం : మొక్కజొన్న కంకి పోసుకోలేదని మొన్నటిదాకా రైతులు గగ్గోలు పెట్టారు. అంతకు క్రితం వరి పైరు ఈనే దశలో నోరెళ్లబెట్టిందని అన్నదాత రోడ్డెక్కాడు. పత్తి, మిరప దిగుబడి దారుణం గా తగ్గిందని సాగుదారులు తలలు పట్టుకున్నారు. సీజన్ ఏదైనా నకిలీ, నాణ్యతలేని విత్తు ఆర్థికంగా దిగజారుస్తోంది. కొద్దిరోజు ల్లో వానాకాలం సీజన్ ప్రారంభంకానుంది. వాణిజ్య పంటలు, వరి సాగుకు రాష్ట్రంలోనే ఉమ్మడి జిల్లా ప్రసిద్ధి. ఈసారి అత్యధికంగా పత్తి సుమారు 4 లక్షల ఎకరాల్లో సాగకానుందని వ్యవసాయ శాఖ అంచనా. ఆ తర్వాత మొక్కజొన్న, వరిదే స్థానం. ఆయా విత్తనాలకు ప్రస్తుతం డిమాండ్ అంతకంతకూ పెరిగింది. రైతులు విత్తన సేకరణలో నిమగ్నం కానున్నారు. వీరిని బురిడీ కొట్టించి నకిలీ విత్తులను అంటగట్టేందుకు ముఠాలు కాచుక్కూర్చున్నాయి. వీరికి టాస్క్‌ఫోర్స్ ముకుతాడు వేస్తేనే కృషీవలుర కష్టాలు గట్టెక్కుతాయి. లేదంటే అందరికీ అన్నం పెట్టేవారు నిలువునా మోసపోవడం ఖాయం.

**అక్రమాల పరంపర** ఈ ఏడాది టేకులపల్లి మండలంలో రూ.5,400 విలువైన, 9 కిలోల నకిలీ విత్తనాల్ని సీజ్‌చేశారు. మూడు ఘటనల్లో నలుగురిపై కేసులు నమోదయ్యాయి. ఉమ్మడిజిల్లాలో వేల ఎకరాల్లో విత్తన రకం మొక్కజొన్న విఫలమై పంట నష్టపోయారు. వరిదీ అదే తీరు. 2021లో చండ్రుగొండ, జూలురుపాడు, బూర్గంపాడు, పినపాక మండలాల్లో 7 కిలోల నకిలీ విత్తనాల్ని పట్టుకున్నారు. దళారులపై కేసులు పెట్టారు. అదే ఏడాది ఇల్లెందులో నకిలీ మొక్కజొన్న, టేకులపల్లి మండలం రాజారాంతండాలో నాణ్యతలేని పత్తి విత్తనాలు పట్టుబడ్డాయి.

**రైతులూ.. ఇవి పాటించండి**

కేంద్రం హెర్బిసైడ్ టాలరెంట్ పత్తి విత్తనాల్ని 2017లో నిషేధించింది. వీటిని ఎట్టి పరిస్థితుల్లో కొనొద్దు.

అధీకృత డీలర్లు (లైసెన్స్‌డ్) డీలర్ల నుంచే విత్తనాలు కొనాలి. ప్యాకింగ్‌ను సరిచూసుకోవాలి. ఏది కొన్నా రశీదు తప్పనిసరి, దాన్ని, ఖాళీ సంచుల్ని పంట దిగుబడి చేతికందే వరకు భద్రపరచుకోవాలి.

నిషేధిత, గడువు ముగిసిన రకాల్ని పసిగట్టాలి. ధర తక్కువని, లూజుగా విక్రయించే పత్తి, మిరప విత్తనాల్ని కొని మోసపోవద్దు.

అంగట్లో కూరగాయల్లా ఎక్కడ విత్తనాలు విక్రయానికి పెట్టినా విజిలెన్స్‌కు ఉప్పందించాలి.

రశీదులో రైతు పేరు, విత్తన కంపెనీ పేరు, చిరునామా, లాట్ నంబరు, సంచులు/ప్యాకెట్ల సంఖ్యను డీలర్లు తప్పక పొందుపర్చాలి.

డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లు కృత్రిమ కొరత సృష్టించకుండా నిల్వల రిజిస్టర్లను వ్యవసాయ శాఖ తనిఖీ చేయాలి.

లైసెన్స్‌లేని వారు జరిపే విక్రయాలపై చర్యలు తీసుకోవాలి.

వరి విత్తనోత్పత్తిపై రైతు ఉత్పత్తి సహకార కేంద్రాల ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు, అధికారులు అవగాహన పెంపొందించాలి.

విత్తన రకాలు సాగుచేస్తున్నట్లయితే, కంపెనీ ప్రతినిధులతో రైతులు బాండ్ పేపర్(ఒప్పందపత్రం)ను రాసుకోవాలి.

లైసెన్స్‌డ్ డీలర్ల వద్దే బ్రాండెడ్ విత్తనాల్ని కొనడం మేలు. రశీదుపై వారితో పాటు రైతూ సంతకం చేయాలి. వాటిని, ఖాళీ సంచులు, లేదా ప్యాకెట్లను పంట చేతికొచ్చే వరకు భద్రపరుకుంటే నష్ట నివారణ రాబట్టుకోగలం. విత్తనాలు మొలకెత్తకపోయినా, దిగుబడి రాకపోయినా విత్తన కంపెనీలు పరిహారమిస్తాయి. జిల్లాస్థాయిలో 2, మండలాల వారీగా ఏవోలు, పోలీసు అధికారులతో టాస్క్‌ఫోర్స్ బృందాలు తనిఖీలు చేపడతాయి. వి.బాబురావు, జిల్లా వ్యవసాయాధికారి, భద్రాద్రి కొత్తగూడెం2024–2025 పంట ఉ త్పత్తి సంవత్సరంలో..

విత్తన శాంపిళ్లు ఖమ్మం : 406 భద్రాద్రి : 324 నమోదైన కేసులు ఖమ్మం : 20 భద్రాద్రి : 09

## ఇల్లే.. ఓ జల నిధి

కొత్తగూడెం : ఇంటి ఆవరణలో పొంగిపొర్లే వర్షపు నీరు ఓవైపు.. చుక్క విదిల్చని కుళాయిలు ఇంకోవైపు. పట్టణాలు, నగరాల్లో ప్రతిఇంట్లో సాధారణంగా కనిపించే భిన్న పార్శ్వాలివి. ఒక్క సీజన్‌లో వర్షపు నీటిని ఒడిసిపడితే, ఏడాదంతా దాహార్తి కష్టాలు దరిచేరవు. పెద్దగా ఖర్చవని ఇంకుడు గుంతల నిర్మాణమే ఎద్దడికి సరైన పరిష్కారం. జలవనరుల శాఖ అధికారులు, పర్యావరణ వేత్తలూ ఇదే సూచిస్తున్నా రు. వర్షాకాలం నేపథ్యంలోనైనా మేల్కోవాలి.

**తక్కువ ఖర్చు.. ఎంతో లాభం**

వేసవిలో వంద ఫ్లాట్లు ఉన్న అపార్ట్‌మెంట్‌లో నెలకు సుమారు 50 వేలు ట్యాంకర్లకే ఖర్చు చేస్తున్నారని అంచనా. తాగునీటి క్యాన్ల ఖర్చు అదనం. ఇంతకంటే తక్కువ ఖర్చుతో ఇంకుడుగుంత నిర్మించొచ్చు. వంద చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఇంటికి 6 క్యూబిక్ మీటర్ల విస్తీర్ణంలో గుంతను వాలుగా ఉన్న వైపున నిర్మిస్తే సరిపోతుంది.

**నిర్మాణం ఇలా..**

ఇంకుడు గుంతల్ని బోర్ల సమీపంలో ఏర్పాటు చేసుకోవడం మేలు. స్థలం పరిమాణాన్ని బట్టి అనువైన పొడవు, వెడల్పుతో 2 మీటర్ల లోతున గుంత తవ్వాలి. అడుగు నుంచి సగభాగం వరకు 40 మిల్లీమీటర్లు, తర్వాత పావు భాగం 20 మిల్లీమీటర్ల పరిమాణం గల కంకర నింపాలి. కొంతభాగం ఖాళీగా ఉండేలా చూసుకుని మిగతా దొడ్డు ఇసుకను నింపాలి. ఇంటి పైకప్పు, ఆవరణలోని వర్షపు నీటి ప్రవాహమంతా పైపులు, కాలువల్లో గుంతలోకి చేరేలా ఏర్పాట్లు చేసుకోవాలి.

**ఇదీ.. చినుకు విలువ**

ఒక ఇంటి పైకప్పు వైశాల్యం, కురిసిన వర్షపాతంపై ఇంకింపజేసే వర్షపు నీటి సామర్థ్యం ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు ఒక సంవత్సర సగటు వర్షపాతం 800 మి.మీ. నమోదై, 100 చదరపు మీటర్ల వైశాల్యం గల ఇంటి పైకప్పు ఉన్నట్లయితే.. 68 వేల లీటర్ల నీటిని ఒడిసిపట్టే అవకాశం ఉంటుందని జలవనరుల శాఖ అధికారులు పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాలోని నగర, పురపాలికల్లో నివాసాల సంఖ్య.. 2,02,941. ఒక నివాసం సగటు పైకప్పు వైశాల్యం 180 చ.మీ. అనుకుంటే, ఏడాది సగటు వర్షపాతం 900 మి.మీ. కురుస్తుందని అంచనా వేస్తే.. సుమారు 30 వేల మిలియన్ లీటర్ల నీటిని భూగర్భంలోకి ఇంకింపజేయొచ్చు. ప్రస్తుతం అంచనా ప్రకారం ఖమ్మం నగరం, ఇతర పురపాలకాల ఏడాది తాగునీటి వినియోగం 29 వేల మిలియన్ లీటర్లుగా ఉంది. అంటే, నివాసాల్లోని పైకప్పు మీద కురిసే వర్షపునీరు, ఏడాదంతా పుర, నగరవాసులు వినియోగించే తాగునీటి కంటే ఎక్కువన్నమాట. "పట్టణాలు కాంక్రీటు కీకారణ్యాలుగా మారుతున్న నేపథ్యంలో భూగర్భజలాలు ఇంకడం లేదు. దీంతో వేసవి రాగానే ఎద్దడి తలెత్తుతోంది. ప్రత్యామ్నాయం ఇంకుడు గుంతలే. ప్రతిఇంటా నిర్మించుకుంటే, నీటి కొరత రాకుండా చూసుకోవచ్చు. గ్రామాల్లోని నివాసాలు, రహదారుల పక్కన విస్తృతంగా నిర్మాణాలు చేపడుతున్నాం. పట్టణాల్లోనూ చైతన్యం పెరగాలి'.

రమేశ్, భూగర్భ జలవనరుల శాఖ అధికారి, ఉమ్మడి ఖమ్మం

# తీరు మారకుంటే కటకటాలే!

పాడేరు: గంజాయి, మాదక ద్రవ్యాల రవాణాను వ్యాపారంగా చేసుకుని చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై ప్రభుత్వం కొరడా ఝుళిపిస్తోంది. పదే పదే అరెస్టు చేస్తున్నా.. తీరు మార్చుకోని వారిని ఏడాదిపాటు జైల్లో పెట్టేలా పీడీ, ఎన్‌డీపీఎస్ చట్టాన్ని ప్రయోగిస్తోంది. ఇప్పటివరకు అల్లూరి జిల్లాకు చెందిన ఆరుగురు, అనకాపల్లి జిల్లాకు చెందిన ముగ్గురిని ఈ చట్టం కింద నిర్బంధించారు. రెండు జిల్లాల పరిధిలో ఇలాంటి వారు ఇంకా ఉన్నట్లు పోలీసు అధికారులు గుర్తించారు. రానున్న రోజుల్లో అక్రమాలకు పాల్పడే వారందరిపై ఈ చట్టాన్ని ప్రయోగించి కటకటాల్లోకి పంపనున్నారు. గంజాయి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న అనకాపల్లి, అల్లూరి జిల్లాలకు చెందిన ఆరుగురిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. పాయకరావుపేట మండలానికి చెందిన దుంగ మాణిక్యం 2018లో మొదటిసారి ఆటోలో గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డాడు. ఇప్పటివరకు ఆయనపై ఆరు కేసులో నమోదయ్యాయి.

అల్లూరి ఏజెన్సీలో గతంలో భారీగా గంజాయి సాగయ్యేది. పండించేది కొందరైతే.. రవాణా చేయడంలో ఎక్కువ మంది భాగస్వాములయ్యేవారు. కీలక సూత్రధారులు తెర వెనక ఉండి గిరిజన యువకులకు డబ్బు ఆశచూపి గంజాయి రవాణాకు వాడుకునేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గంజాయి స్మగ్లింగ్‌పై ఉక్కుపాదం మోపింది. డ్రోన్ కెమెరాల ద్వారా సాగును గుర్తించి ధ్వంసం చేయించింది. గతంలో సాగు చేసిన వారిని ప్రత్యామ్నాయ మార్గాలను చూపింది. వారిలో కొందరు గంజాయి సాగు, అందులోని మత్తును వీడటం లేదు. ఇలాంటి వారందరిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోనుంది.



మాడుగుల మండలానికి చెందిన బి.కొండలరావు ఆటోలో గంజాయి రవాణా చేస్తూ 2019లో మొదటిసారి పట్టుబడ్డాడు. ఈయనపై రెండు కేసులున్నాయి. జి.మాడుగుల మండలానికి చెందిన వి.కొండబాబు బైక్‌పై తరలిస్తూ 2024లో మొదటిసారి దొరికాడు. ఈయనపై మూడు కేసులున్నాయి. హుకుంపేట మండలానికి చెందిన సీతారాం 2024లో గంజాయి రవాణా చేస్తూ దొరికాడు. ఈయనపై రెండు కేసులున్నాయి. గూడెంకొత్తవీధి మండలానికి చెందిన వంతల బాలు బద్దర్ 2020లో మొదట గంజాయితో పట్టుబడ్డాడు. వేర్వేరు స్టేషన్ల పరిధిలో మూడు కేసులున్నాయి. చింతపల్లికి చెందిన గాలి సత్యనారాయణ గంజాయి రవాణా చేస్తూ 2017లో దొరికాడు. ఇప్పటివరకు రెండు కేసులు ఈయనపై నమోదయ్యాయి. వీరంతా గంజాయి స్మగ్లింగ్‌ను వీడకుండా తరచూ రవాణా చేస్తున్నారన్న అభియోగాలతో ఎన్‌డీపీఎస్ చట్టం కింద అదుపులోకి తీసుకోవాలని తాజాగా ఉత్తర్వులు వెలువడ్డాయి.

**స్మగ్లింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు**ప్రభుత్వం గంజాయిని పూర్తి స్థాయిలో కట్టడి చేసేందుకు అనేక చర్యలు చేపడుతోంది. అల్లూరి జిల్లాలో చాలావరకు డ్రోన్ల ద్వారా సాగును గుర్తించి ధ్వంసం చేశాం. గతంలో గంజాయి సాగు చేసిన వారికి అవగాహన కల్పించి ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను ప్రభుత్వం చూపుతోంది. బంగారు జీవితాన్ని నాశనం చేసుకోవద్దు. స్మగ్లింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు. పీటీ ఎన్‌డీపీఎస్ చట్టం కింద అరెస్టు చేసి ఏడాదిపాటు జైలుకు పంపుతాం. అమిత్ బర్దార్, ఎస్పీ, అల్లూరి జిల్లా

# ఉపాధి మాయా పథకం

పాయకరావుపేట : ఉపాధి హామీ పథకంలో ఎక్కడెక్కడ ఏ పనులు చేశారో భూతద్దం పెట్టి వెతికినా ఇసుమంతైనా కనిపించడం లేదు. ఎక్కడా పనుల జాడే లేదు. తనిఖీకి వెళ్లిన సభ్యులకు ఫీల్డ్ అసిస్టెంట్లు, వీఆర్పీలు కలిసి 'రాజావారి చేపల చెరువు' సినిమా చూపించారు. పనులు చేయకుండానే చేసినట్లు చెబుతూ తనిఖీ బృందానికి చుక్కలు చూపారు. పాయకరావుపేట మండల పరిధిలో ఉపాధి హామీ పనుల్లో జరిగిన అక్రమాలపై పరిశోధనాత్మక కథనం. ఉపాధి హామీ పథకంలో పనులు చేపట్టకుండానే చేసినట్లు చూపి సొమ్ములు నొక్కేశారు. తనిఖీ సిబ్బందే అవాక్కయ్యే పరిస్థితి ఎదురైంది. మండలంలోని 24 గ్రామాల్లో గతేడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు రూ.9.43 కోట్లతో 1,303 పనులు చేపట్టారు. వేతనాలకు రూ.7.05 కోట్లు, మిగతా మొత్తం సామగ్రి చెల్లింపులకు వినియోగించారు. సామాజిక తనిఖీ బృందానికి పనుల్లో అడుగడుగునా అవినీతి ఆనవాళ్లే కనిపించాయి. కొలతలు, మస్తర్లలో తేడాలతో సొమ్మును పక్కదారి పట్టించినట్లు గుర్తించారు.

**మచ్చుకు కొన్ని..** గోపాలపట్నం కొండ ప్రాంతంలో 300 కందకాలు



తవ్వినట్లు రికార్డుల్లో చూపారు. 110 కందకాలకు సంబంధించిన వివరాల్లేవు. మంగవరంలో రైతుల పొలాల్లో కందకాలు తవ్వామని రికార్డుల్లో పేర్కొన్నా.. సగానికిపైగా జాడ లేదు. ఉన్న వాటిలోనూ కొలతల్లో తేడాలున్నాయి.

ఎస్.నర్సాపురంలో మస్తర్లలో గోల్‌మాల్ చేశారు. పంట కాలువల తవ్వకాల్లోనూ అవకతవకలే. మస్తర్లు వేయకుండానే సొమ్ములు మింగేశారు. 130 మంది కూలీలు పని చేయకుండానే చేసినట్లుగా మస్తర్లు వేసి నామవరం వీఆర్పీ నగదు విత్‌డ్రా చేశారు. నాలుగు నెలలపాటు పని చేసినట్లుగా రికార్డుల్లో చూపారు.

పెంటకోటలో చేపట్టిన పనుల్లో కొలతలు, మస్తర్లలో తేడా జరిగినట్లు తేలింది. నిధుల రికవరీకి ఆదేశాలు.. సామాజిక తనిఖీ వేదికగా డీఆర్పీలు ఇచ్చిన నివేదికల ఆధారంగా రూ.3.18 లక్షలు రికవరీ చేయాలని అధికారులు ఆదేశాలు ఇచ్చారు. నామవరం వీఆర్పీపై క్రిమినల్ కేసు నమోదు సహా నగదు రికవరికీ చర్యలు చేపడుతున్నాం. కందకాలు, పంట కాలువల తవ్వకాల్లో అవకతవలను గుర్తించేందుకు క్వాలిటీ కంట్రోల్ విభాగానికి ఫిర్యాదు చేశాం. నానిబాబు, ఏపీఓ

# రూ.200 కోట్లు ఖర్చైనా.. దప్పికపాట్లేనా?



గుంతకల్లు : గుంతకల్లు వాసులకు గతంలో కుళాయిల నుంచి 15 నుంచి 20 రోజులకోసారి తాగునీరు సరఫరా అయ్యేది. నీటి కోసం ప్రజలు నానా తిప్పలు పడేవారు. ప్రజల కష్టాలను గుర్తించి ప్రభుత్వం తాగునీటి సమస్య పరిష్కరించడానికి రూ.200 కోట్లకు పైన ఖర్చు చేసి తాగునీటి వనరులను కల్పించింది. ప్రజలకు రోజూ తాగునీటిని అందించడానికి అవసరమైన సౌకర్యాలున్నా వాటిని ప్రజలకు ఉపయోగపడే విధంగా చూడటంలో అధికారులు విఫలమవుతున్నారు.

**కుళాయిల వద్ద పడిగాపులు**

నాలుగు, ఐదు రోజులకోసారి నీటిని సరఫరా చేస్తున్నారు. ఆ నీటిని కూడా కచ్చితమైన వేళల్లో సరఫరా చేయడం లేదు. కుళాయిలకు ఎప్పుడు వస్తుందో తెలియక నిరుపేదలు పనులకు వెళ్లకుండా వేచి ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది.

**అంతర్గత కనెక్షన్ల ఏర్పాటులో విఫలం**

గుంతకల్లులో తాగునీటిని కుళాయిల ద్వారా అందించడానికి మున్సిపాలిటీ పరిధిలో 17 ఉపరితల ట్యాంకులు నిర్మించారు. ప్రస్తుతం అధికారులు రోజూ నీటిని సరఫరా చేయకుండా నాలుగైదు రోజులకోసారి సరఫరా చేస్తున్నారు. నీటిని సరఫరా చేసే సిబ్బంది జీత భత్యాలకు ప్రతినెలా రూ.14 లక్షలకు పైగా ఖర్చు చేస్తున్నారు. రోజూ తాగునీటిని అందించాలన్న ఉత్తర్వులను అటకెక్కించారు. ఉపరితల ట్యాంకులకు చెందిన పైప్‌లైన్లను అనుసంధానం చేసి ఎస్ఎస్ ట్యాంకుల నుంచి నీటిని ఒకేరోజు నింపడానికి అంతర్గత కనెక్షన్లు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. మరోవైపు తాగునీటి పన్ను రూపంలో మున్సిపాలిటీకి ఖజానాకు ఏటా రూ.2 కోట్లకు పైన చేరుతోంది.

**అవసరమైన నిర్ణయాలు తీసుకుంటాం**

మున్సిపాలిటీలోని ప్రజలకు రోజూ ఒకే సమయంలో తాగునీటిని అందించే విషయంపై అధికారులతో సమావేశాన్ని నిర్వహించి అవసరమైన నిర్ణయాలు తీసుకుంటాం. సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తాం. తాగునీటి పైపులకు అంతర్గత కనెక్షన్ల ఏర్పాటుపై చర్చిస్తాం. ఈవిషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తోడ్పాటు ఇవ్వాలని కోరుతాం. భవానీ, మున్సిపల్ ఛైర్‌పర్సన్

పురపాలిక : గుంతకల్లు
జనాభా : 1.80 లక్షలు
ఎస్ఎస్ ట్యాంకులు : 2
ఉపరితల ట్యాంకులు : 17
కుళాయిల సంఖ్య : 40 వేలు
తాగునీటి పైపుల పొడవు : 350 కి.మీ.లు

# నాలుగువేల ప్రతుల్లో.. చెవిరెడ్డి అవినీతి చిట్టా



తిరుపతి : తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థలో గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ అధికారులు చేపట్టిన విచారణ కొలిక్కి వచ్చింది. 2024 డిసెంబరు 24న విచారణ ప్రారంభించి ఏడు నెలల అనంతరం ఇటీవలే పూర్తిచేశారు. నాలుగువేల ప్రతులతో కూడిన ప్రాథమిక నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేశారు.

**విచారణ జరిగిన అంశాలివే..**

తుడా ఛైర్మన్‌గా వ్యవహరించిన చెవిరెడ్డి జీవో 26 (08.02.2016), జీవో 161 (17.05.2018)లను ఉల్లంఘించడం. ప్రజాప్రతినిధులు, వారి కుటుంబసభ్యులు ప్రభుత్వ అభివృద్ధి పనులు చేయకూడదన్న నిబంధనలను ఉల్లంఘించి కుటుంబ సభ్యులకు చెందిన సీఎంఆర్ ఇన్‌ఫ్రా ద్వారా రూ.కోట్ల విలువైన పనులుచేయడం. మూడునెలల వ్యవధిలోనే ఆ సంస్థ క్లాస్-3 నుంచి క్లాస్-1 గుత్తేదారుగా ఎదగడం.

తుడాకు నాలుగైదు వాహనాలు ఉండగా అదనగా ప్రైవేటు వాహనాలు, వాటికి డీజిల్ వినియోగించడం. ఉద్దేశపూర్వకంగా చంద్రగిరి నియోజకవర్గంలో వ్యక్తిగతంగా ఇంటింటి సర్వే చేపట్టడం, దేశవిదేశాల కు విమాన ఛార్జీలను తుడా నుంచి వినియోగించడం జాతీయ హరిత ట్రైబునల్ నిబంధనలు ఉల్లంఘించి తుమ్మలగుంట చెరువును ధ్వంసం చేయడం.

జలవనరుల శాఖ అనుమతి లేకుండా, కోచ్‌లు, నిర్వహణ సిబ్బంది లేకుండా పార్కులు, స్టేడియాలు నిర్మించడం, వాటిని గ్రామ పంచాయతీకి అప్పగించడం.

కె.వి.బి.పురం మండలంలో కుటుంబ సభ్యులకు చెందిన ఆస్తులున్న ప్రాంతంలో తుడా నిధులతో రోడ్డు నిర్మించడం

ప్రభుత్వ అనుమతి లేకుండా కేవలం పాలకమండలి తీర్మానం సాకుతో చంద్రగిరి నియోజకవర్గంలోని ఎంపీడీవోల ఖాతాలకు ప్రతిపాదనలే లేకుండా నిధులు మళ్లించడం.

చంద్రగిరి నియోజకవర్గంలో అధికారులతో పదేపదే టెలికాన్ఫరెన్ల నిర్వహణ. తుడా నిధులను అనధికారికంగా ఎంపీడీవోల చేత ఫిక్సడ్ డిపాజిట్‌లు చేయించడం, యూసీ(యుటలైజేషన్ సర్టిఫికేట్)లు లేకుండా బిల్లులు మంజూరు చేయడం, ఫిక్సడ్ డిపాజిట్‌లపై వడ్డీలు వివరాలు తుడాకు సమాచారం లేకుండా వినియోగించడం.

31 మంది విశ్రాంత ఉద్యోగులను, ఐదుగురు ప్రైవేటు వ్యక్తుల్ని మంజూరులేని పోస్టుల్లో నియమించుకోవడం.

**అంశాల వారీగా నిధుల ఖర్చు (రూ.కోట్లలో)**

ఎంపీడీవోల ఖాతాలకు మళ్లించిన నిధులు: 230.03 తుమ్మలగుంట చెరువు కోసం చేసిన వ్యయం: 60

19 వేల బెంచీలకు అయిన ఖర్చు: 23 వైద్య శిబిరాలకు చేసిన వ్యయం: 5.29 విమాన ఛార్జీలు 0.59 వాహనాల కొనుగోలు: 1.85 కొవిడ్ శిబిరాలకు : 2.18 ఇంధన ఖర్చు: 2.50 తుడా ఇంజినీరింగ్ అధికారుల వ్యయం: 105 ఉద్యాన విభాగం ద్వారా మొక్కల పంపిణీ, పచ్చదనం పెంపు: 15

# నగరానికో నందనవనం!



విశాఖపట్నం: నగరంలోని ఆరిలోవలో లక్షల మొక్కలతో భారీ నర్సరీ ఆకట్టుకుంటోంది. విశాఖకే వన్నె తెస్తోంది. అక్కడి పరిసరాలు నందనవనాన్ని తలపిస్తున్నాయి. రాష్ట్రంలో ఎక్కడ ఏ పెద్ద కార్యక్రమం జరిగినా అరుదైన జాతులను ఇక్కడి నుంచి అధికారులు తీసుకువెళ్తున్నారు. అనేక ప్రభుత్వ రంగ సంస్థల్లో ఇక్కడి మొక్కలతో పచ్చదనాన్ని పెంచు తున్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ (ఏపీజీబీసీ) ఆధ్వర్యంలో ఈ నర్సరీని నిర్వహిస్తున్నారు. ఆ రెండు ఎకరాల్లో: నేరుగా ఎండ తగలకుండా, మొక్కలు పెరిగేందుకు అనువైన వాతావరణం కల్పించేందుకు రెండు ఎకరాల్లో నాలుగు షేడ్‌నెట్లు ఏర్పాటు చేశారు. ఇక్కడ తుంపర్ల రూపంలో నీరందుతుంది. మిగిలిన వాటికి బిందుసేద్యం విధానంలో అందిస్తున్నారు.

**అందుబాటులో 1.76 లక్షలు**: ఈ నర్సరీ దాదాపు 30 ఎకరాల్లో ఉంది. అలంకరణకు అనువైనవి 25 రకాలు, ఉద్యానవనాల్లో నాటేవి 20 రకాల వరకు ఉన్నాయి. ప్రస్తుతం 1.76 లక్షల మొక్కలు సిద్ధం చేశారు. ఏటా 50 వేల వరకు విక్రయిస్తారు. ఎప్పటికప్పుడు అంటుకట్టే విధానంలో సరికొత్తగా అందుబాటులోకి తీసుకొస్తున్నారు. మిగిలిన నర్సరీలతో పోల్చితే ఇక్కడ తక్కువ ధరకు ఎవరైనా కొనుగోలు చేసుకోవచ్చు. ఎన్ని కావాలో దరఖాస్తు చేస్తే వాటికి ధర నిర్ణయించి అందజేస్తారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వరంగ సంస్థలు, మున్సిపాల్టీలు, దేవాలయాలకు ప్రాధాన్యం ఇస్తారు.

**మోదీ సభలకు..**: అమరావతి రాజధాని నిర్మాణ పనుల పునఃప్రారంభ సభకు హాజరైన ప్రధాని మోదీ పర్యటనలో కనువిందుగా కనిపించిన మొక్కల్ని విశాఖ నుంచే తరలించారు.

ఇటీవల జరిగిన యోగాంధ్ర-25 ఏర్పాట్లకూ ఈ నర్సరీ నుంచే మొక్కలు పంపించారు. బీ కొన్నాళ్ల క్రితం విశాఖలో జరిగిన జి-20 సన్నాహక సమావేశాల వేళ నగర సుందరీకరణలో లక్ష మొక్కలు వినియోగించారు.

అవీ ఇక్కడి నుంచే సరఫరా చేశారు.

విశాఖ పోర్టులో, జీవీఎంసీ పార్కుల్లో, అమృత్‌సరోవర్ ప్రాజెక్టు కింద చెరువుల గట్లపైనా వేలాది మొక్కలు నాటారు.

పోర్టుతో ఒప్పందం: 'పచ్చదనం పెంచే కార్యక్రమాలకు విశాఖ పోర్టు పెద్ద పీట వేస్తోంది. వారికి అవసరమైన మొక్కల సరఫరా, నిర్వహణకు పోర్టుతో ఏపీజీబీసీ ఒప్పందం చేసుకుంది. అరుదైన రకాలతో 'ఫైకటోరియం' నిర్వహిస్తున్నాం. మొక్కలు కావాలంటే ముడసర్లోవ జలాశయం ఎదురుగా ఉన్న నర్సరీలో సంప్రదించొచ్చు' అని ఏపీజీబీసీ ఉద్యానవనాధికారి భాస్కరరావు పేర్కొన్నారు.

# కొత్తూరులో మెగా పార్క్

అనకాపల్లి : గజిబిజి జీవనశైలిలో.. సాయంత్రం సేదతీరేందుకు జిల్లాలో ఆహ్లాదం కరవైంది. వారాంతాల్లో పిల్లలతో ఆటలాడేందుకు, సరదాగా గడిపేందకు అనకాపల్లిలో సరైన పార్కు ఒక్కటీ లేదు. అనకాపల్లి పట్టణ పరిధిలో మెగా పార్క్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ఎప్పట్నుంచో ఉంది. గత ప్రభుత్వంలో పార్క్ ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు కనీస ప్రయత్నమూ చేయలేదు. కూటమి ప్రభుత్వంలో ఆ కల సాకారం కానుంది. జిల్లాలో ఆహ్లాదకర వాతావరణం నెలకొల్పేందుకు యంత్రాంగం చర్యలు చేపట్టింది. కొత్తూరులో మెగా పార్క్ ఏర్పాటుకానుంది. ఇందుకు సంబంధించి వీఎంఆర్‌డీఏ పరిపాలన అనుమతులు ఇచ్చింది.

**5.68 ఎకరాలు.. రూ.5.35 కోట్లు...** మెగా పార్క్ ఏర్పాటుకు కొత్తూరు పరిధిలో సర్వే నంబర్ 608లో ఏడు ఎకరాలకుపైగా జీవీఎంసీ స్థలం ఉంది. ఇదే అనువైనదిగా అధికారులు తాజాగా గుర్తించారు. 5.68



ఎకరాల్లో మెగా పార్క్ ఏర్పాటు చేయాలని విశాఖలోని వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో ఛైర్మన్ ప్రణవ్‌గోపాల్ అధ్యక్షతన జరిగిన బోర్డు సమావేశంలో ఇటీవల తీర్మానం చేశారు. రూ.5.35 కోట్ల వ్యయంతో రెండు విడతలుగా నిర్మించనున్నారు. పిల్లలు ఆడుకునేందుకు ఆటస్థలం, యోగా చేసేందుకు యోగా ముద్రలతో అనువైన ప్రదేశం, ఓపెన్ జిమ్, ఓపెన్ థియేటర్, బాస్కెట్ బాల్, బాల్‌బ్యాడ్మింటన్, టెన్నిస్, ఫుట్‌బాల్ కోర్టులు, స్కేటింగ్ రింక్ నిర్మించనున్నట్లు వీఎంఆర్‌డీఏ ఈఈ రాంబాబు చెప్పారు. జిల్లా అధికారుల సమక్షంలో త్వరలోనే పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

# 'ఆహార తయారీ'.. ఉపాధికి దగ్గర దారి..!

విశాఖపట్నం : ప్రైవేటు కళాశాలల్లో రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తుండగా ఇక్కడ కేవలం రూ.30వేలు, అది కూడా విడతల వారీగా చెల్లించే అవకాశం కల్పిస్తున్నారు. ప్రస్తుతం ప్రవేశాలు జరుగుతున్నాయి. దరఖాస్తుకు ఈనెల 17వతేదీ తుది గడువు.

1.అడ్వాన్సడ్ ట్రేడ్ సర్టిఫికెట్ ఇన్ కలినరీ ఆర్ట్స్ కోర్సు: పదో తరగతి విద్యార్హత. కోర్సు వ్యవధి ఆరు నెలలు. దక్షిణ, ఉత్తర భారత వంటలు, చైనీస్, పాశ్చాత్య వంటలు, కేకులు, బిస్కెట్లు, పాస్తా, సమోసా, మిఠాయిల తయారీలో శిక్షణ ఇస్తారు. ఆరునెలలు స్టార్ హోటళ్లలో ప్రాక్టికల్ తరగతులు ఉంటాయి. శిక్షణ అనంతరం స్టార్ హోటళ్లలో



చెఫ్‌గా ఉద్యోగావకాశం కల్పిస్తారు.

2.టెక్నిక్స్ ఇన్ కుకింగ్: ఈ విభాగంలో చేరేందుకు విద్యార్హత 8వ తరగతి. 25 వారాలపాటు శిక్షణ ఉంటుంది. శాఖాహార, మాంసాహార వంటల తయారీల్లో నిపుణులతో శిక్షణ ఇప్పిస్తారు.

3.కేటరింగ్ మేనేజర్: రక్షణ రంగంలో ఆరునెలల్లో ఉద్యోగ విరమణ చేయబోయేవారు అర్హులు. రక్షణ రంగమే ఎంపిక చేసి శిక్షణ ఖర్చు భరిస్తుంది. ఆరునెలలపాటు శిక్షణ ఉంటుంది. వంటలతోపాటు, బేకరీ వస్తువులు, బిస్కెట్లు, పఫ్‌ల తయారీలో శిక్షణ ఇస్తారు. అనంతరం సొంతంగా క్యాటరింగ్ ఏర్పాటు చేసుకోవచ్చు. లేదా స్టార్ హోటళ్లలో చెఫ్‌గా ఉద్యోగం చేయవచ్చు.

# రాయితీ మంత్రం.. ఆర్థిక ఉపశమనం

కొత్తవలస : నష్ట నివారణ, ఆదాయం పెంపు లక్ష్యంగా.. విద్యుత్తు అదనపు వినియోగం క్రమబద్ధీకరణకు రాయితీ ఇస్తూ.. ఈపీడీసీఎల్ చేసిన ప్రకటనకు వినియోగదారుల నుంచి అనూహ్య స్పందన లభించింది. కొత్తగా ఇల్లు కట్టుకుని విద్యుత్తు మీటరు పొందాక, ఇంటి అవసరాల కోసం విద్యుత్తు ఉపకరణాలు, ఏసీ, వాషింగ్ మిషన్, ఫ్రిడ్జ్ వంటి పరికరాలు అదనంగా వినియోగిస్తుండటంతో విద్యుత్తు వినియోగం బాగా పెరుగుతోంది. కనెక్షన్ కోసం దరఖాస్తులో పొందుపర్చిన లోడ్ కంటే ఎక్కువగా వినియోగిస్తున్నారు. దీనివల్ల విద్యుత్తు నియంత్రికలపై భారం పడుతోంది. ఫలితంగా తరచూ లోఓల్టేజీ, సరఫరాలో అంతరాయం సమస్యలు వస్తున్నాయి. ఈ సమస్య పరిష్కారానికి లోడ్ క్రమబద్ధీకరణకు ఈపీడీసీఎల్ శ్రీకారం చుట్టింది.

**రూ. 42.88 లక్షల ఆదాయం..**

అదనపు లోడు క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీ ప్రకటిస్తూ.. ఇందుకోసం మార్చి 1 నుంచి జూన్ 30వ తేదీ వరకూ దరఖాస్తులు చేసుకోవాలంటూ ఈపీడీసీఎల్ వినియోగదారులను ఆహ్వానించింది. దీంతో జిల్లాలోని 13 గ్రామీణ మండలాల్లోని వినియోగదారుల నుంచి అనూహ్య స్పందన లభించింది. విజయనగరం డివిజన్ పరిధిలో 2,087 సర్వీసులకు 3880.47 కిలోవాట్ల అదనపు లోడు క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్నారు. దీనివల్ల రూ.42.88 లక్షల ఆదాయం ఈపీడీసీఎల్‌కి సమకూరింది.

**లోడ్ ఇలా లెక్కిస్తారు..**

ఇంట్లో ఉన్న విద్యుత్తు పరికరాల వినియోగాన్ని బట్టి లోడు అంచనా వేసి దాన్ని కిలోవాట్లలో లెక్కిస్తారు. ఒక కిలో వాట్‌కు సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.200, డెవలప్‌మెంట్ రుసుము కింద రూ.2 వేలు, దరఖాస్తుకు రూ.50, అదనపు ఖర్చులు రూ.250 చెల్లించాలి. అంటే అదనంగా కిలోవాట్‌కు రూ.2,500 చెల్లించాలి. 50 శాతం రాయితీతో రూ.1,250 వసూలు చేశారు.

**అధిక దరఖాస్తులు ఇక్కడే..**

13 మండలాల్లోకి కొత్తవలస సెక్షన్ నుంచి అధికంగా దరఖాస్తులు అందాయి. ఈ ప్రాంతం నుంచి అదనపు లోడు క్రమబద్ధీకరణకు 520 మంది విద్యుత్తు వినియోగదారులు 986.14 కి.వా.కు దరఖాస్తు చేసుకున్నారు. ఇందుకు రూ.8.77 లక్షలు డెవలప్‌మెంట్ ఛార్జీల కింద, రూ.2.11 లక్షలు సెక్యూరిటీ డిపాజిట్‌గా జమచేశారు. అతితక్కువగా వంగర సెక్షన్ నుంచి నలుగురే దరఖాస్తు చేసుకుని రూ.10 వేలు డిపాజిట్ చెల్లించారు.

స్పందన బాగుంది.. అదనపు లోడు క్రమబద్ధీకరణకు వినియోగదారుల నుంచి మంచి స్పందన లభించింది. రూ.42.88 లక్షల ఆదాయం వచ్చింది. లోడు ఎంత భారమో తెలిస్తే, అనుగుణంగా చర్యలు చేపట్టి లోఓల్టేజీ సమస్య పరిష్కరించొచ్చు. అవసరమైన చోట నియంత్రికలు ఏర్పాటు చేస్తాం.
జిజి.సురేష్‌బాబు, కార్యనిర్వాహక ఇంజినీరు, విజయనగరం గ్రామీణం

# ఏటా ముంపు.. ఏదీ కనువిప్పు!



కదిరి : ఆకాశంలో మబ్బులు కమ్మినా.. చినుకు రాలినా పురప్రజలు వణుకుతున్నారు. ఎక్కడ వరద ముంచేస్తుందోనని భయపడుతున్నారు. కదిరి, కొత్తచెరువు, ధర్మవరం పట్టణాలకు ఎగువన పెద్ద చెరువులు ఉన్నాయి. ఈ చెరువులు నిండి మరువలు పారితే వరద పట్టణాలను ముంచెత్తుతోంది. దీనికి వాగులు, ఇరిగేషన్ కాలువలు ఆక్రమణకు గురవటమే కారణం. పట్టణాలకు ఆనుకుని ఉన్న కాలువలు, వాగులను కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో అవి కుంచించుకుపోయాయి. ఫలితంగా వరదతో లోతట్టు ప్రాంతాలు జలమయమై పేదలు తీవ్రంగా నష్టపోతున్నారు. వరదలప్పుడు మాత్రమే అధికారులు సహాయక చర్యలు, పాలకులు పరామర్శలతో హడావుడి చేస్తున్నారు. తర్వాత పట్టించుకోవడం లేదు. అధికారులు సర్వే చేసి ఆక్రమణల చెర నుంచి వాగులు, కాలువలను సంరక్షించి, వరద ముప్పు నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

కదిరికి తూర్పున వితలరాయునిచెరువు, దక్షిణం వైపు దేవరచెరువు ప్రధానమైనవి. వర్షపు నీటితో నిండే చెరువుల మరువలు కదిరి మీదుగా ప్రవహిస్తాయి. నివాసాలకు చేరువలోని మద్దిలేరు వాగులో సున్నపుగుట్ట ప్రదేశంలో వరద కలుస్తుంది. రాయచోటి రోడ్డు నుంచి పట్టణ శివారు వరకు మద్దిలేరు వాగు ఆక్రమణకు గురైంది. సున్నపుగుట్టతండా వరకు 30 మీటర్లు, ఆ తర్వాత 40 మీటర్లు ఉండాల్సిన వాగు సగానికి మించి అన్యాక్రాంతమైంది. దీంతో అరవ గుడిసెలు, నానాదర్గా, శివాలయం, వాసవీనగర్, కోనేరు తదితర ప్రాంతాల జనం వరద ముప్పుతో భీతిల్లుతున్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో కాలువ సర్వే, ఆక్రమణ కాకుండా రాతి కట్టడానికి రూ. 2.50 కోట్లతో చేపట్టిన ప్రణాళిక ప్రతిపాదనలతోనే ఆగింది

సత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తికి ఆనుకుని చిత్రావతి ప్రవహిస్తోంది. పట్టణం వైపున ప్రభుత్వ స్థలంతోపాటు నది లోతట్టు స్థలాన్ని ఆక్రమించారు. నది అంచుల్లోకి వ్యర్థాలను తరలించటం, స్థలం ఏర్పడ్డాక కబ్జా చేస్తున్నారు. దీంతో చిత్రావతి విస్తీర్ణం తగ్గిపోయి పట్టణానికి వరద ముప్పు పొంచి ఉంది.

బుక్కపట్నం చెరువు ప్రధాన మరువ కొత్తచెరువుకు ఆనుకుని వెళుతుంది. గ్రామానికి ఆవలివైపు ఇరిగేషన్ స్థలం ఆక్రమణతో వాగు కుంచించుకుపోయింది. వరద ప్రవాహం నివాసాల వైపు దూసుకొస్తుండటంతో ఆందోళన రేకెత్తిస్తోంది.

ధర్మవరం చెరువు లోతట్టులో నిర్మాణాలు వెలుస్తున్నాయి. చెరువు విస్తీర్ణం తగ్గటంతో ఎగువ నుంచి వచ్చే వరదనీరు పట్టణంలోని లోనికోట సమీప నివాసాలను ముంచెత్తుతోంది.

**త్వరలోనే తొలగింపు చర్యలు..**

త్వరలోనే వాగులు, కాలువల ఆక్రమణల తొలగింపు చర్యలు చేపడతాం. పుట్టపర్తి సమీప చిత్రావతి, కదిరికి ఆనుకుని ఉన్న మద్దిలేరుతో పాటు ఇతర ప్రాంతాల్లో అన్యాక్రాంతమైన కాలువలను గుర్తిస్తున్నాం. అందరి సహకారంతో ఆక్రమణలు తొలగిస్తాం. గురుమూర్తి, ఇరిగేషన్ ఈఈ

# ఔషధ కోర్సులు.. ఉపాధి, ఉద్యోగాలకు బాటలు

బొమ్మనహాళ్ : ప్రజారోగ్య పరిరక్షణలో ఫార్మసీ పాత్ర కీలకం. జేఎన్‌టీయూ అనుబంధ తైల సాంకేతిక, ఔషధ పరిశోధన సంస్థ (ఓటీపీఆర్ఐ) ఫార్మసీ కోర్సులను అందిస్తోంది. ప్రతిష్ఠాత్మకమైన ఈ ఔషధ విద్యాసంస్థలో అభ్యసించిన విద్యార్థులు జాతీయ స్థాయి పరీక్షలైన నైపర్ జేఈఈ, జీపాట్‌లో మంచి ర్యాంకులు సాధించారు. ఇందులో నూతన ఔషధాల తయారీ, ప్రయోగాలు నిర్వహిస్తున్నారు. నూతన ఔషధాల ఉత్పత్తి చేసిన మందులు మొక్కలు, జంతువులు, జలచరాలపై ప్రయోగిస్తుంటారు. ప్రస్తుత జీవన పరిస్థితుల్లో మధుమేహం, అధికరక్తపోటు, క్యాన్సర్ వంటి రోగాల బారినపడుతున్నారు. వాటి నివారణలో ఫార్మసీ నిరంతం కృషి చేస్తోంది. 1950కి ముందు ప్రజలకు అవసరమైన ఔషధాల్లో 90 శాతం ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకొనేవారు. ప్రస్తుతం 90 శాతం ఔషధాలు విదేశాలకు మనదేశం నుంచి ఎగుమతి చేస్తున్నారు. ఫార్మసీ రంగం



ఏ స్థాయిలో వృద్ధి చెందిందో ఊహించవచ్చు.

**ఫార్మసీతో భవిష్యత్తు అవకాశాలు**

పారిశ్రామిక రంగంలో పరిశోధనలు, అభివృద్ధి, మార్కెటింగ్, రెప్రజెంటివ్స్‌లో అవకాశాలున్నాయి. డ్రగ్ఇన్‌స్పెక్టర్ ఉద్యోగానికి అర్హులు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఫార్మాసిస్టులుగా ఉద్యోగాలు. అకడమిక్ పరంగా బోధన, పరిశోధన, పరిపాలన రంగాల్లో అవకాశాలు ఉంటాయి. విదేశాల్లో కూడా ఉద్యోగావకాశాలు ఉన్నాయి.

**త్వరలో వసతి గృహాలు అందుబాటులోకి**

వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఫార్మసీ విద్యార్థులకు వసతి గృహాలు అందుబాటులోకి తెస్తున్నాం. నైపర్ జేఈఈ, జీప్యాట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు మొదటి ప్రాధాన్యం ఉంటుంది. వారికి సీట్లు కేటాయించిన తరువాత ఈఏపీసెట్‌లో ర్యాంకులు సాధించిన వారికి ప్రవేశాలు కల్పిస్తాం. ఆగస్టులో ప్రవేశాలు నిర్వహించే అవకాశముంది. ఆచార్య సుబ్బారెడ్డి, సంచాలకులు, ఓటీపీఆర్ఐ

# సరిహద్దులో ఆగిన తుంగభద్రమ్మ!

బొమ్మనహాళ్ : తుంగభద్ర జలాశయం నుంచి ఈనెల 10న హెచ్చెల్సీకి విడుదల చేసిన నీరు ఆంధ్రా సరిహద్దులోని బొమ్మనహాళ్ వద్ద ఆగాయి. హెచ్చెల్సీలో అత్యవసరంగా సాగుతున్న మరమ్మతులు పూర్తి కాకపోవడంతో ఆంధ్రా వాటా నీరు తీసుకోవడంలో జాప్యం ఏర్పడుతోంది. 117వ కిలోమీటరు వద్ద జరగుతున్న వంతెన నిర్మాణ పనులు పూర్తికాలేదు. జలాశయంలో గతేడాది 19వ గేటు కొట్టుకుపోవడంతో



ఈసారి నీటి నిల్వను 80 టీఎంసీలకే పరిమితం చేశారు. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని వెంటనే మరమ్మతులు పూర్తిచేసి నీటి సరఫరాను కొనసాగించాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయంలో డీఈఈ దివాకర్‌రెడ్డితో మాట్లాడుతూ మరమ్మతులు యుద్ధప్రాతిపదికన కొనసాగుతున్నాయన్నారు.

# మన్నవరం.. వెన్ను విరిగింది

శ్రీకాళహస్తి : 'ఐదువేల మందికి ప్రత్యక్ష ఉపాధి.. పాతిక వేల మందికి పరోక్షంగా ఉపాధి.. వందలాది కుటీర పరిశ్రమల' ఏర్పాటు లక్ష్యంగా మన్నవరం విద్యుత్తు ఉపకరణాల పరిశ్రమ ఏర్పాటుకు ప్రారంభంలోనే అడ్డంకులు ఎదురయ్యాయి. పరిశ్రమ ప్రారంభ సమయంలో ఎన్బీపీపీఎల్ ప్రతినిధులు, జాతీయస్థాయి అధికారులతో కళకళలాడగా ఇప్పుడు బోసిపోయింది. చివరకు భద్రతా సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులను తొలగించి భారీ పరిశ్రమకు తాళాలు వేసి వదిలి పెట్టేశారు. పరిశ్రమ ఏర్పాటుకు కేటాయించిన భూములను ప్రభుత్వం ప్రస్తుతం ఏపీఐఐసీకి అప్పగించేందుకు సన్నాహాలు చేస్తోంది.

**భూములు వెనక్కి ఎప్పుడో..?**

ఇక్కడి పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం 750 ఎకరాల భూములను ఎకరా రూ.100 వంతున ఎన్బీపీపీఎల్ సంస్థకు అప్పగించింది. పరిశ్రమ ఏర్పాటుకు నిర్మించుకున్న భవనాలు వంద ఎకరాలు మినహాయించి 650 ఎకరాలు వెనక్కి తీసుకునేందుకు ప్రభుత్వం సంసిద్ధమైంది. కలెక్టర్ వెంకటేశ్వర్ నివేదిక మేరకు ఇక్కడ వెనక్కి తీసుకునే 650 ఎకరాలను ఏపీఐఐసీకి అప్పగించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ ప్రక్రియ పూర్తయి కొత్త పరిశ్రమలు వస్తే ఈ ప్రాంతం బాగుపడుతుందని సమీప గ్రామస్థులు ఆశలు పెంచుకున్నారు.

**కలగానే.. ఎన్బీపీపీఎల్ ఏర్పాటు**

విద్యుత్తు ఉత్పాదకంలో దిగ్గజ సంస్థలైన ఎన్టీపీసీ-భెల్ సంయుక్త భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిందే ఎన్బీపీపీఎల్ విద్యుత్తు ఉపకరణాల పరిశ్రమ. 2010 సెప్టెంబరు ఒకటో తేదీన అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ దీనికి భూమిపూజ చేశారు. రూ.6 వేల కోట్లు అంచనాలో రూ.1200 కోట్ల ఖర్చుతో మౌలిక వసతులు, యంత్రాలు ఏర్పాటు చేసి 2015లో ఉత్పత్తులు ప్రారంభించారు. ఇంజినీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్ విధానంలో విద్యుత్తు ఉత్పాదనకు అవసరమైన బొగ్గు-బూడిద నిర్వహణ పరికరాల తయారీ, టర్బైన్లు, జనరేటర్లు, బాయిలర్లు తయారీ ఈ పరిశ్రమ లక్ష్యం. గ్లోబల్ వార్మింగ్ ప్రభావం నేపథ్యంలో దిగ్గజ సంస్థల అంచనాలన్నీ తలకిందులయ్యాయి. చేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్ లేకపోవడంతో ఈ సంస్థ ప్రగతి ప్రశ్నార్థకంగా మారింది. ఇన్నాళ్లూ కొంతమేర అధికారులు వచ్చి వెళ్లేవారు. ప్రస్తుతం భారీ పరిశ్రమలోని అన్ని విభాగాలకు తాళాలు వేసేశారు. కనీసం భద్రతా సిబ్బంది ఉండటం లేదు.

# మారని సంక్షేమ రూపురేఖలు



అనంతపురం : బడులు మొదలై నెల పూర్తయింది. పిల్లలందరూ బడి బాట పట్టారు. కానీ సంక్షేమ వసతి గృహాల్లో మరమ్మతు పనులు నెలలు గడుస్తున్నా మెరుగు పడట్లేదు. మామూలుగా అయితే.. వేసవి సెలవులు పూర్తి అయి విద్యార్థులు వసతి గృహాల్లో చేరే సమయానికే ఇవి పూర్తి కావాల్సి ఉంది. కొన్నింటిలో పనులు ప్రారంభం కాలేదు. ఐదేళ్ల వైకాపా హయాంలో వసతి గృహాల్లో కనీసం సున్నం కొట్టడానికి కూడా నిధులు మంజూరు చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం వసతి గృహాల్లో రూపురేఖలు మార్చాలనే ఉద్దేశంతో నిధులు భారీగా మంజూరు అయ్యాయి. కానీ ఇచ్చిన నిధులను కూడా సక్రమంగా వినియోగించడంలో వైఫల్యం చెందుతున్నారు. వెలిసి పోయిన రంగులు, ఊడుతున్న పెచ్చులు వంటి సమస్యలు అలానే పీడిస్తున్నాయి.

**ఏదీ అప్పటి చొరవ**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అనంతపురం జిల్లాలో 10 సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు, 1 రెసిడెన్సియల్ పాఠశాలకు రూ.1.34 కోట్లు నిధులు మంజూరు చేయగా వసతి గృహాల్లో అత్యవసరం అయిన మరమ్మతు పనులు వేగంగా చేశారు. రెండో విడతలో సాంఘిక, బీసీ సంక్షేమ వసతి గృహాల మరమ్మతు పనులపై చొరవ చూపడం లేదు. గుత్తేదారులకు బిల్లులు కాలేదన్న ఉద్దేశంతో పనులపై శ్రద్ధ చూపకపోవడంతో విద్యార్థులకు వసతులు దూరమయ్యాయి.

**విద్యార్థులకు ఆటంకం**

అనంతపురం సాయినగర్‌లో ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో పలు రకాల మరమ్మతు పనులకు రూ.16.20 లక్షలు మంజూరు అయ్యాయి. గత సంవత్సరంలోనే నిధులు మంజూరు అయ్యాయి. ఇప్పటికే ఏడు నెలలు కావొస్తోంది. ఇంకా పనులు చేయాల్సి ఉంది. మరుగుదొడ్లకు మరమ్మతులు, తాగునీటి సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. వసతి గృహాల్లో ఇంకా పనులు సాగుతూనే ఉన్నాయి. విద్యార్థులకు వసతికి ప్రతిబంధకంగా మారింది. స్లాబుకు మరమ్మతులు చేయగా ఇటీవల మళ్లీ పెచ్చులు ఊడాయి.

# ప్రతిపాదిస్తూ.. సుందరీకరిస్తూ..!

కుప్పం : 'ఆదర్శ పురపాలికగా కుప్పాన్ని మార్చడమే లక్ష్యం.. ప్రతిపాదనలు పంపండి.. ఎంత అడిగితే అంత ఇస్తాం' అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుప్పం పర్యటనలో హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా పంపిన ప్రతిపాదనలకు నిధులను విడుదల చేస్తూ అనేక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో ఆదర్శ కుప్పానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. పురపాలికలో ఇప్పటికే రోడ్లు, తాగునీటి బోర్లు, వీధి దీపాలు, పారిశుద్ధ్య పనులు, సుందరీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మరికొన్ని అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు చేస్తున్నారు.

**లక్ష్యంతో ముందుకెళ్తూ..**

కుప్పం శ్మశాన వాటికను అభివృద్ధి చేసి.. బర్నింగ్ కేంద్రం ఏర్పాటు, తితిదే ద్వారా పురపాలికలోని 25 ఆలయాల అభివృద్ధి, ఎస్సీ, ఎస్టీల గృహాలకు సౌర విద్యుత్తును వచ్చే ఏడాది జూన్ లోపు పూర్తి చేయాలనే లక్ష్యం పెట్టుకున్నారు. పుర పరిధిలోని మూడు ప్రాథమిక పాఠశాలల అభివృద్ధి డిసెంబరు, ఎన్టీఆర్ సుజల పథకం ఆగస్టు, ఏరియా ఆస్పత్రి పనులు డిసెంబరు నాటికి పూర్తి చేసే దిశగా అడుగులేస్తున్నారు.

**ఏళ్లుగా నిలిచిన పనులకు మోక్షం**

ఏళ్లుగా నిలిచిన ప్రధాన రహదారి విస్తరణ, ఆర్టీసీ బస్టాండు అభివృద్ధి, షాపింగ్ కాంప్లెక్స్, జమిందారు పార్కు, 10 ప్రధాన కూడళ్ల అభివృద్ధి, ఈ-బస్సులు, భూగర్భ కాలువలు, భూగర్భ విద్యుత్తు లైన్లు, గ్యాస్ కనెక్షన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి.

**పూర్తైన లక్ష్యాలు ఇవీ..**

పురపాలికలో రూ.2.59 కోట్లతో 3950 వీధి దీపాలు, రూ.66 లక్షలతో అన్న క్యాంటీన్, రూ.1.40 కోట్లతో ఆర్‌అండ్‌బీ భవనం,



రూ.5 కోట్లతో నర్వ్ కేంద్రం, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, కాలువలు, అమృత్ 2.0 నీటి సరఫరా కార్యక్రమాలు చేపట్టి లక్ష్యాలు పూర్తి చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

**క్రీడలకు ప్రాముఖ్యం..**

కుప్పంలో ఎన్టీఆర్ క్రీడా మైదానం అభివృద్ధికి రూ.22 కోట్లతో ప్రతిపాదనలు పూర్తయ్యాయి. వచ్చే ఏడాది జూన్ లోపు పూర్తి చేయనున్నట్లు అధికారుల అంచనా. అలాగే నాలుగు మండలాల పరిధిలో క్రీడా మైదానాలు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

**ప్రపంచస్థాయి సదుపాయాలు**

ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలతో కుప్పం పురపాలికను ఆదర్శంగా నిలిపేందుకు చర్యలు చేపడుతున్నాం. భవిష్యత్తు తరాలను దృష్టిలో పెట్టుకుని కడా ఆధ్వర్యంలో కృషి చేస్తున్నాం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో స్వర్ణ కుప్పం లక్ష్యంగా పని చేస్తున్నాం. వికాస్ మర్మత్, కడా పీడీ, కుప్పం

# అదనపు బాధ్యతలు ఎన్నాళ్లు?!

విశాఖపట్నం: రాష్ట్రంలో ప్రముఖ ఆలయంగా వెలుగొందుతున్న సింహాచలం క్షేత్రానికి పూర్తి స్థాయి 'ఈవో'ను నియమించడంలో అంతులేని తాత్సారం జరుగుతోంది. ఇటీవల జరిగిన బదిలీల్లో త్రినాథరావుకు ఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించారే తప్ప శాశ్వత అధికారిని నియమించలేదు. దీంతో ఆలయ పాలన గాడి తప్పుతోందనే విమర్శలొస్తున్నాయి. 2019 నుంచి ఇప్పటివరకు 14 మందికి ఈవోలుగా బాధ్యతలప్పగించారంటే ఇక్కడి పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

**ఎందుకు కొనసాగిస్తున్నారు?:** ఇటీవలి బదిలీల్లో ఈవోగా కొత్తగా ఎవర్నీ నియమించలేదు. గతంలో పనిచేసిన వి.త్రినాథరావును రాజమహేంద్రవరం ఆర్జేసీగా నియమించారు. అలాగే.. సింహాచలం ఈవోగా పూర్తి అదనపు బాధ్యతలప్పగించారు. పలు ఉత్సవాల నిర్వహణలో ఆయన విమర్శలు మూటకట్టుకున్నా కొనసాగించడం గమనార్హం. 2023లో చందనోత్సవ సమయంలోనూ త్రినాథరావే ఈవోగా ఉ




న్నారు. ఆ సమయంలో సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో భక్తులు ఇబ్బంది పడ్డారు. దీనిపై అప్పటి కలెక్టర్ ఆదేశాల మేరకు సంయుక్త కలెక్టర్ విచారణ చేసి ప్రభుత్వానికి నివేదిక పంపారు. అందులో ఈవో త్రినాథరావు పర్యవేక్షణ లోపాన్ని కూడా ప్రస్తావించారు. ప్రభుత్వం మారినా ఆయనే ఈవోగా కొనసాగారు. ఈ ఏడాది చందనోత్సవం నిర్వహణ సమయానికి సెలవుపై అమెరికాకు వెళ్లారు. ఉత్సవ తేదీ ప్రకటించాక అన్ని రోజులు సెలువు మంజూరు చేయడం దేవాదాయశాఖలో చర్చనీయాంశమైంది.

**వరుస ఘటనలతోనైనా:** సింహగిరిపై ఏప్రిల్ 30న చందనోత్సవ సందడి నెలకొన్న తరుణంలో... భక్తులు నిల్చున్న చోట ఒక్కసారిగా గోడ కూలి ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. ఇటీవల గిరి ప్రదక్షిణ నేపథ్యంలో తొలిపావంచా వద్ద ఇనుప రాడ్లతో నిర్మించిన భారీ షెడ్డు కుప్ప కూలింది. ఆ సమయంలో భక్తులెవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ నేపథ్యంలో శాశ్వత అధికారి నియామకం మరోసారి తెరపైకి వచ్చింది. మరో వైపు కొండపైనా, దిగువన ప్రసాద్ పథకంలో రూ.50 కోట్లతో పనులు జరుగుతున్నాయి. పంచగ్రామాల్లో ఆలయానికి విలువైన భూములున్నాయి. వేపగుంటలో వీఎంఆర్‌డీఏతో కలిసి పరిష్కరించాల్సిన 140 ఎకరాల భూసమస్య ఉంది. వీటన్నింటి పర్యవేక్షణకు కీలక అధికారి ముఖ్యం.

# పరీక్ష పెట్టారు.. ఫలితాలు మరిచారు..!

అనకాపల్లి : సాధారణంగా వార్షిక పరీక్షలు పూర్తయిన వారం, పది రోజుల నుంచే విద్యార్థుల జవాబుపత్రాల మూల్యాంకనం( స్పాట్ వాల్యుయేషన్) ప్రారంభమవుతుంది. రెండు నెలల్లోపు ఫలితాలు వెల్లడిస్తారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం దూర విద్యా కేంద్రంలో అందుకు విరుద్ధంగా జరుగుతోంది. ఇక్కడ పరీక్షలు జరిగి మూడు నెలలైనా ఫలితాలు వెల్లడి కాలేదు. దీంతో అసలు మూల్యాంకనం ప్రారంభమైందా.. జవాబు పత్రాలు భద్రంగా ఉన్నాయా అనే సందేహాలు విద్యార్థుల్లో నెలకొన్నాయి. **మూల్యాంకనం పూర్తయ్యేదెప్పుడో..:** ఏయూ దూర విద్యా కేంద్రం ఈ ఏడాది ఏప్రిల్ 25న యూజీ, పీజీ పరీక్షలు నిర్వహించింది. యూజీ మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ బీకామ్ 4707, బీఏ 4208, బీఎస్సీ 8739 మొత్తం 17,654 మంది పరీక్షలు రాశారు. పీజీలో మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ ఎమ్మెస్సీ 3100, ఎంఏ 1958, ఎంబీఏ 1104, ఎంకామ్ 219 మంది మొత్తం 6381 మంది పరీక్షలు రాశారు. యూజీ, పీజీ కలిపి మొత్తం 24,035 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. వీరికి సంబంధించి 1,94,688 జవాబుపత్రాలను మూల్యాంకనం చేయాల్సి ఉంది. ఇన్ని పత్రాలను మూల్యాంకనం చేయాలంటే కనీసం రెండు నెలల సమయం పడుతుందని చెబుతున్నారు. ఇప్పుడు ప్రారంభించినా ప్రక్రియ పూర్తయి ఫలితాలు వెల్లడించడానికి నవంబరు, డిసెంబరు పట్టవచ్చని అంచనా వేస్తున్నారు. ఈలోగా ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల నోటిఫికేషన్ పడితే




తాము నష్టపోవాల్సి వస్తుందని విద్యార్థులు వాపోతున్నారు.

**లాభదాయక విభాగంపై శీతకన్ను..:** ఆంధ్రవిశ్వవిద్యాలయానికి లాభాన్ని చేకూర్చే విభాగాల్లో దూర విద్యా కేంద్రం ముందుంటుంది. దీని ద్వారా ఏటా రూ.40కోట్ల నుంచి రూ.50కోట్ల ఆదాయం సమకూరుతోంది. ఈ మొత్తంలో 70శాతం విద్యార్థుల కోసం ఖర్చు చేయాల్సి ఉంటుంది. గతంలో దూర విద్యా కేంద్రం బ్యాంకు ఖాతా ఆకేంద్రం సంచాలకుల ఆధీనంలో ఉండేది. గత ప్రభుత్వ హయాంలో అప్పటి వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి ఆ ఖాతాను మెయిన్ క్యాంపస్ ఆధీనంలోకి తీసుకున్నారు. దీంతో దూరవిద్య విద్యార్థులకు కనీసం సబ్జెక్టు పుస్తకాలు కూడా సమకూర్చలేకపోతున్నారు. స్టేషనరీ కొనుగోలు సైతం వీసీ దయాదాక్షిణ్యాలపై ఆధార పడాల్సి వస్తోందని ఓ ఉద్యోగి వాపోయారు.

**త్వరితగతిన పూర్తి చేస్తాం..:** ఈ విషయమై ఏయూ దూర విద్యా కేంద్రం సంచాలకుడు ఆచార్య బీఏ నాయుడి వివరణ కోరగా శుక్రవారం నుంచి పీజీ విద్యార్థుల జవాబుపత్రాల మూల్యాంకనం ప్రారంభించామన్నారు. క్రమపద్ధతిలో మిగతా కోర్సుల జవాబుపత్రాలు కూడా పూర్తి చేస్తామన్నారు. ఫలితాలు వెల్లడించాలని విద్యార్థుల నుంచి ఒత్తిడి ఉందని, ఉద్యోగుల బదిలీలు, చేరికల నేపథ్యంలో కొంత జాప్యం జరిగిందని పేర్కొన్నారు.

# అక్కడ కోడి కూయదు.. ఇక్కడ చెప్పులు తొడగరు!

పాకాల :ఓ ఊర్లో ఏమో కోడి కూత వినపడదు.. మరో గ్రామంలో ప్రజలు చెప్పులు వేసుకోవడం అపచారంగా భావిస్తారు. తరతరాలుగా వస్తున్న ఈ సంప్రదాయాలను ఇరు గ్రామాల ప్రజలు ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. గ్రామాల్లో కోళ్లు పెంచడం సహజం.. తెల్లారితే కోడి కూత వినబడటమూ సర్వసాధారణం. కానీ శాంతిపురం మండలం కడపల్లె పంచాయతీ తిమ్మరాజుపల్లెలో కోడి కూత వినపడదు.. గ్రామంలో కోడి కూత వినబడకూడదు.. అని పెద్దలు విధించిన కట్టుబాటును నేటి తరంలోనూ ప్రజలు పాటిస్తున్నారు.

తిమ్మరాజుపల్లెలో దాదాపు 120 కుటుంబాలున్నాయి. ప్రతి ఇంటా వలస జీవనాలను తరతరాలుగా కొనసాగిస్తున్నారు. ఊరంతా ఒకే బంధువర్గానికి చెందినవారే. గ్రామ సమీపంలోని తూర్పు దిక్కున అడవిలో ప్రసన్న తిమ్మరాయస్వామి ఆలయాన్ని నిర్మించుకున్నారు. వందేళ్ల కిందట పెద్దబ్బ అనే వృద్ధుడి కలలో తిమ్మరాయస్వామి ప్రత్యక్షమై.. గ్రామంలో కోడి కూత వినబడితే అరిష్టమని చెప్పడంతో అప్పట్నుంచి గ్రామస్థులు ఈ కట్టుబాటును పాటిస్తున్నారు. నేటి ఆధునిక యుగంలోనూ నాటి కట్టుబాటును తూ..చ తప్పకుండా కొనసాగిస్తున్న తిమ్మరాజుపల్లె జనం దైవ భక్తితో పాటు పెద్దల మాటకు విలువనిస్తూ ప్రత్యేకతను చాటుకొంటున్నారు.

**తిరు నగరం.. హరితశోభితం**

ఇదేదో మిద్దె పంట.. ఉద్యానంలోని మొక్కలు అనుకుంటే పొరపాటే.. తిరుపతి వినాయకసాగర్ వద్ద ఉన్న మురుగు శుద్ధి కేంద్రంలో నీటిశుద్ధి కోసం పెంచుతున్నవి. నగరం నుంచి వచ్చే మురుగు నీటిని వినాయ



క సాగర్ వద్ద వివిధ దశల్లో శుద్ధి చేస్తారు. ఈ క్రమంలో క్లోరిన్ కలుపుతారు.. నీటిలో ఏమైనా వ్యర్థాలు.. లార్వా, క్రిములు ఉంటే ఇక్కడ ఏర్పాటు చేసిన మొక్కలు వాటిని ఆకర్షిస్తాయి. మురుగునీటిలో పెరిగిన మొక్కలిలాప్రాంతంలో హరితశోభితంగా దర్శనమిస్తున్నాయి.

**వేమనఇండ్లులో తరతరాల సంప్రదాయం**

చెప్పులు లేకుండా బయటకెళ్లడం కష్టసాధ్యం. కానీ పాకాల మండలం ఉప్పరపల్లి పంచాయతీ, వేమనఇండ్లు గ్రామంలో మాత్రం ప్రజలు భూమిని దేవతగా భావించి చెప్పులు లేకుండా నడుస్తున్నారు. నేలపై పాదం మోపాలన్నా క్షమాపణలు చెప్పి కాలు కింద పెడతారు. పాదరక్షలు ధరించి నేలపై నడవడాన్ని అపరాధంగా భావిస్తారు. బయటి ప్రాంతాల వారు సైతం ఈ ఆచారాన్ని పాటించాల్సిందేనని ఆ ఊరి ప్రజలు చెబుతున్నారు. గ్రామంలో నెలవైన శ్రీవేంకటేశ్వరస్వామిని కొలుస్తారు. ఇక్కడ పాతిక కుటుంబాలు, 90 మంది జనాభా నివాసముంటోంది. అందరూ ఒకే ఇంటి పేరు కలిగి ఉండటం ఇక్కడ మరో విశేషం.

**ఇల్లు చేరాకే భోజనం**

ఉదయం భోంచేసి బయటి ప్రాంతాలకు వెళ్లిన వారు.. మళ్లీ ఇంటికి తిరిగి వచ్చాకే భోజనం చేస్తారు. ఒక్కో సందర్భంలో తినాల్సి వస్తే స్నానం చేశాకే గ్రామంలోకి ప్రవేశిస్తారు. బయటి వ్యక్తులను తాకినా ఇదే ఆచారాన్ని పాటిస్తారు. పరిసర గ్రామాల ప్రజలు వీరి సంప్రదాయాలను ఇప్పటికీ గౌరవిస్తున్నారు.

# అప్పన్న భూముల్లో అక్రమార్కుల పాచిక

విశాఖపట్నం : విలువైన సింహాచలం అప్పన్న స్వామి భూములకు రక్షణ లేకుండా పోతోంది. కొంతకాలంగా జరుగుతున్న ఆక్రమణల తీరే ఇందుకు నిదర్శనం. 2008లో 12 వేల కట్టడాలను అధికారికంగా గుర్తిస్తే ఆ తర్వాత 50 వేలకు పైగా పుట్టుకొచ్చాయి. వేల సంఖ్యలో పుట్టగొడుగుల్లా వెలియడం.. దేవస్థానం భూపరిరక్షణ విభాగం నిర్లక్ష్యానికి అద్దం పడుతోందనే విమర్శలొస్తున్నాయి.

**పంచగ్రామాల సమస్యతో:** పంచగ్రామాల్లోని సింహాచలం భూముల్లో నెలకొన్న సమస్య పరిష్కారానికి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. గతంలో గుర్తించిన అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకుంది. దీన్ని ఆసరాగా తీసుకొని కొందరు మరిన్ని అక్రమ నిర్మాణాలకు తెగబడుతున్నారు. ఇందుకు ఏకంగా నకిలీ ఎల్ఆర్సీ (స్థల క్రమబద్ధీకరణ ధ్రువీకరణ పత్రం)లతో బురిడీ కొట్టిస్తున్నారు. కొందరు గతంలో ఇచ్చినట్లు పత్రాలు సృష్టిస్తున్నారు. వాటి ఆధారంగానే నాయుడుతోట, వేపగుంట, అప్పన్నపాలెంలో అక్రమ నిర్మాణాలు దర్జాగా సాగిస్తున్నారు. గత కొంతకాలంగా ఈ నిర్మాణాలు సాగిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇవన్నీ కొందరు దేవస్థానం ఉద్యోగుల సహకారంతోనే జరుగుతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

ఇదే తగిన సమయమని: కొద్ది రోజులుగా సింహాచలం, వేపగుంట, చీమలాపల్లి అడవివరం, ఇతర కొండవాలు ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు ఎక్కువైపోయాయి. దేవస్థానంలో భూముల పరిరక్షణకు ప్రత్యేక విభాగం ఉన్నా అడ్డుకోలేకపోతోంది. ప్రత్యేక డిప్యూటీ కలెక్టరు, ఏఈవోలు, కమ్యూనిటీగార్డులు, సెక్యూరిటీగార్డులున్నా చూసీచూడనట్లు ఉంటున్నారు. పలు అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్నారన్న ఆరోపణలతో ఓ ఏఈవోను సింహాచలం దేవస్థానం నుంచి మరో చోటుకు బదిలీ చేశారు. అలాగే కుమ్మరి వీధిలో స్థానిక నేత భారీ భవనాన్ని యథేచ్ఛగా నిర్మించేస్తున్నా అడ్డుకోలేదు.

చర్యలేవి: గత వైకాపా ప్రభుత్వ హయాంలో అక్రమ నిర్మాణాలు దర్జాగా సాగాయి. అందులో దేవస్థానం భూపరిరక్షణ విభాగంలో పని చేస్తున్న ఇద్దరు ఏఈవోల పాత్ర ఉన్నట్లు ఉన్నతాధికారుల విచారణలో తేలింది. వారి మీద కఠిన చర్యలు తీసుకోవాలని అప్పట్లో నివేదిక ఇచ్చినా ఫలితం లేకపోయింది. వారిని అక్కడే కొనసాగించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఇదే పరిస్థితి.

మిగిలిన వాటి ఆధారంగా: గతంలో ప్రభుత్వ ఉత్తర్వుల ఆధారంగా సింహాచలం భూముల క్రమబద్ధీకరణకు 6 వేలకుపైగా దరఖాస్తులు వచ్చాయి. అందులో 2500 మందికి ఎల్ఆర్సీ పత్రాలు మంజూరు చేశారు. అనుమతి కోసం డబ్బులు చెల్లించిన వారు 700 మంది వరకున్నారు. పెండింగులో 2800 దరఖాస్తులు ఉన్నాయి. నాటి జీవోను అప్పట్లోనే నిలిపేయడంతో ఎల్ఆర్సీ ప్రక్రియ మధ్యలోనే నిలిచిపోయింది. మిగిలిన వాటి ఆధారంగా కొందరు తాజాగా అవకతవకలకు పాల్పడుతున్నారు. వాస్తవానికి అప్పట్లో ఎంత మందికి ఎల్ఆర్సీలు ఇచ్చారు, ఎన్ని పెండింగులో ఉన్న వివరాలు బయట పెట్టకపోవడం అక్రమాలకు తావిస్తోంది.

# నవతరం బాలలకు 'నవోదయం'




కొమ్మాది : ఆహ్లాదకర వాతావరణంలో సృజనాత్మక పద్ధతుల్లో బోధిస్తూ నాణ్యమైన విద్యను అందిస్తున్న పాఠశాలలు జవహర్ నవోదయ విద్యాలయాలు (జేఎన్వీ). పాఠశాల స్థాయిలోనే విద్యార్థుల్లో వాస్తవ దృక్పథాన్ని పెంపొందిస్తూ ఉన్నతంగా రాణించేలా ఇవి దోహదపడుతున్నాయి. ఈ నేపథ్యంలో.. జేఎన్వీల్లో 2026-27 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాలకు తాజాగా ప్రకటన విడుదలైందిబోధనా పద్ధతులు, వసతులు ఇలా: కంప్యూటర్ విద్య, ఎన్సీసీ, అధునాతన గ్రంథాలయం, పర్యావరణంపై అవగాహన, సాహసోపేత కృత్యాలు, క్రీడలు, వ్యాయామ విద్యలో శిక్షణ, హిందీ, ఆంగ్లం, తెలుగు భాషలపై పట్టు, వలస విద్య విధానం ద్వారా విద్యార్థులను ఇతర రాష్ట్రాలకు పంపి జాతీయ సమైక్యతా భావాన్ని పెంపొందించడం, వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్, గీతాలాపన, చిత్రలేఖనం, సాంఘిక నాటకాల ప్రదర్శన వంటి అంశాల్లో శిక్షణ ఇస్తారు.

వివిధ క్రీడల్లో క్లస్టర్, రీజనల్, జాతీయస్థాయి పోటీల నిర్వహణ, కిచెన్గార్డెన్లో మొక్కల పెంపకం, శాస్త్రీయ, జానపద నృత్యాలపై అభిలాష ఉన్న వారికి ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు, విద్యాబోధన, వసతి, ఆహారం, పుస్తకాలు, ఏకరూప దుస్తులు, బూట్లు, ఇతర సామగ్రిని ఉచితంగా అందించనున్నారు.

**రిజర్వేషన్లు వర్తిసాయి..**

విద్యాలయంలో ప్రవేశాలకు రిజర్వేషన్ 75 శాతం గ్రామీణం, 25 శాతం పట్టణ ప్రాంత విద్యార్థులకు వర్తిస్తుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మిగిలిన రిజర్వేషన్లు ఉంటాయి. ప్రవేశ పరీక్ష మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తారు. వీరికి 6 నుంచి 12వ తరగతి వరకు ఉచిత విద్య అందించడంతో పాటు బాలురు, బాలికలకు వేర్వేరుగా వసతి కల్పిస్తారు.

**ఎవరు అర్హులు..?:** 3, 4, 5 తరగతులు ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదివి ఉండాలి. గతంలో పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు అనర్హులు. 2014 ఏప్రిల్ 1 నుంచి 2016 జులై వరకు జన్మించి ఉండాలి. సంబంధిత వెబ్సైట్లలో పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలి. అలాగే పాఠశాల ప్రధానోపాధ్యాయుల సంతకంతో ధ్రువీకరించిన పత్రం తప్పనిసరిగా అప్లోడ్ చేయాలి.

**ప్రతిభ ఆధారంగా ఎంపిక:** అర్హులైన అభ్యర్థులంతా పూర్తి వివరాలతో ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలి. ప్రశ్నాపత్రం తయారీ నుంచి అభ్యర్థుల ఎంపిక వరకు సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) పర్యవేక్షిస్తుంది. ఎలాంటి పైరవీలకు తావు లేకుండా ప్రతిభ ఆధారంగానే విద్యార్థుల ఎంపిక జరుగుతుంది.

డాక్టర్ వైఎస్ఎస్ చంద్రశేఖర్, ప్రిన్సిపల్, జవహర్ నవోదయ విద్యాలయం, కొమ్మాది

దరఖాస్తుకు గడువు తేదీ: జులై 29

ప్రవేశ పరీక్ష: డిసెంబర్ 13

# భద్రత ప్రశ్నార్థకం



ఆళ్లగడ్డ : ఆలయాలకు భద్రత కరవైంది. వరుసగా జరుగుతున్న దోపిడీలు భక్తులను కలవరపెడుతున్నాయి. ఆధ్యాత్మిక ప్రదేశాల్లో నిఘా కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ చోరీల ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ఆళ్లగడ్డలో ఆలయాల భద్రత ప్రశ్నార్థకమైంది.

**సవాల్ విసురుతున్న పరిస్థితి**

ఆళ్లగడ్డ మండలం ఆర్.కృష్ణాపురం గ్రామంలోని రామతీర్థం పుట్టాలమ్మ ఆలయంలో ఈ నెల 10న చోరీ జరిగింది. ఆలయం ప్రధాన తలుపుల తాళాలు పగలగొట్టి 21 కిలోల వెండి ఆభరణాలు దొంగిలించారు. ఎలాంటి ఆధారాలు ఉండకుండా సీసీ కెమెరాలను, వీడియో నిక్షిప్తమయ్యే హార్డ్డిస్క్లను ఎత్తుకెళ్లారు. క్లూస్ బృందం, జాగిలంతో ఘటనాస్థలిలో దర్యాప్తు చేపట్టారు. నిఘా నేత్రాలు తీసుకెళ్లి దుండగులు పోలీసులకు సవాలు విసిరారు. అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నట్లు పోలీసులు చెబుతున్నారు.

ఆరు నెలల కిందట నంద్యాల, ఒంగోలు ప్రధాన రహదారి నల్లమల అటవీ ప్రాంతంలోని సర్వ నృసింహస్వామి ఉప ఆలయంలోని సీసీ కెమెరాలు ధ్వంసం చేసి దుండగులు హుండీని ఎత్తుకెళ్లారు.

ప్రాచీన క్షేత్రమైన అహోబిలంలో గతంలో చోరీ జరిగింది. దిగువ అహోబిలంలో రామానుజాచార్యుల సన్నిధిలో దుండగులు ఆభరణాలు దొంగిలించారు. బత్తలూరులో జాతీయరహదారి సమీపంలోని శివాలయంలో చోరీ జరిగింది. హుండీ ధ్వంసం చేసి నగదు ఎత్తుకెళ్లారు.

రుద్రవరం మండలంలో భాస్కర నందీశ్వర, కాశిరెడ్డి నాయన, బ్రహ్మంగారి, నరసాపురం లక్ష్మీనృసింహస్వామి, నాగులవరం నాగేశ్వరమ్మ ఆలయాల్లోనూ గతంలో హుండీ చోరీ ఘటనలు చోటుచేసుకున్నాయి.

రెండు నెలల కిందట శిరివెళ్ల మండలంలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో దుండగులు హుండీ చోరీ చేసి గ్రామ శివార్లలో పడేశారు.

చాగలమర్రి మండలంలో ముత్యాలపాడు గంగమ్మ గుడిలో ఆరేళ్ల కిందట హుండీ చోరీ జరిగింది.

బేతంచెర్ల మండలంలోని ముచ్చట్ల మల్లికార్జున స్వామి ఆలయంలో గతంలో గుప్త నిధుల కోసం ధ్వజ స్తంభాన్ని తవ్వి కూలదోశారు. పది సంవత్సరాల కిందట గుర్తుతెలియని వ్యక్తులు భోగేశ్వరస్వామి ఆలయంలో చోరీ చేశారు. బేతంచెర్ల పట్టణంలోని గట్ల నరసింహ స్వామి ఆలయంలో పదేళ్ల కిందట చోరీ చేశారు. విగ్రహాలు, గంటలు, హారతి ప్లేటు, శఠగోపం, స్వామి వెండి కళ్లు, మీసాన్ని చోరీ చేశారు.

**నిఘా అంతంత మాత్రమే**

దొర్నిపాడు ఆంజనేయస్వామి ఆలయం, దొర్నిపాడు మండలంలోని సిద్ధేశ్వరస్వామి, గణాధిపతి కోవెల, చాకరాజువేముల, కొండాపురం దొర్నిపాడు, క్రిష్టిపాడు, డబ్ల్యూ.గోవిందిన్నె, చాగలమర్రి మండలంలోని చింతలచెరువు, పెద్దబోధనం ఈశ్వర, ఆంజనేయ స్వామి ఆలయాల్లో సీసీ కెమెరాలు లేవు. ఎస్.లింగందిన్నెలో చెన్నకేశవ, ఆంజనేయస్వామి ఆలయంలో కెమెరాలు ఉన్నా... నిర్వహణ లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి.

దేవాదాయశాఖ పరిధిలోని ఆలయాలకు నిఘా అంతంత మాత్రంగానే ఉంది. సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ పర్యవేక్షణ లోపంతో వినియోగంలో లేవు. సాంకేతిక లోపాలు తలెత్తాయి. ఏటా మాన్యం వేలం పాటలు నిర్వహించి రూ.లక్షల ఆదాయాన్ని ఆలయాధికారులు తీసుకెళ్తున్నారే కానీ భద్రత వైపు దృష్టి సారించడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు.

**దుండగులను పట్టుకుంటాం:** ప్రమోద్, డీఎస్పీ ఆళ్లగడ్డ

ఆలయాల్లోని హుండీల్లో నగదును ప్రతి 15 రోజులకు ఒకసారి తప్పనిసరిగా తీసేయాలని అధికారులకు సూచించాం. ప్రతి ఆలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పటికే ప్రతి గ్రామంలో కెమెరాలు ఏర్పాటు చేయిస్తున్నాం. గ్రామ ప్రవేశ మార్గం, బయటకు వెళ్లే ప్రాంతాల్లో నిఘా కెమెరాలు ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నాం. రామతీర్థం ఆలయం చోరీ ఘటనపై విచారణ జరుగుతోంది. త్వరలోనే దుండగులను పట్టుకుంటాం.

# భానుడితో దోస్తీ.. బిల్లులకు స్వస్తి

విజయనగరం : విద్యుత్తు బిల్లు వాచిపోతోందా.. తరచూ అంతరాయాలతో అవస్థలు తప్పడం లేదా.. సరఫరాలో హెచ్చుతగ్గులతో విసిగిపోయారా.. ఇలాంటి ఇబ్బందులు తప్పేందుకు సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతోంది విద్యుత్తుశాఖ. రాయితీలు, ప్రత్యేక సౌకర్యాలతో కూడిన ప్లాంట్లను ఏర్పాటు చేసుకుంటే బిల్లులకు స్వస్తి పలకవచ్చని అధికారులు సూచిస్తున్నారు. ఇప్పటికే పలువురు ఏర్పాటు చేసుకోగా.. మరింతమంది ముందుకు రావాలని కోరుతున్నారు.పర్యావరణ పరిరక్షణ, సాధారణ విద్యుత్తు వాడకం తగ్గించడం, సౌర విద్యుత్తు వినియోగం పెంపులో భాగంగా కేంద్ర ప్రభుత్వం 2023-24 ఆర్థిక ఏడాదిలో సూర్యఘర్ పథకాన్ని ప్రారంభించింది. ప్లాంట్లు ఏర్పాటు చేసుకుంటే రాయితీ అందించనుంది. రెండు కిలోవాట్ల సామర్థ్యానికి 60 శాతం, అంతకు పైబడి యూనిట్లకు 40 శాతం సబ్సిడీ దక్కనుంది. మిగులు విద్యుత్తును నెట్ మీటరింగ్ ద్వారా ఈపీడీసీఎల్కు విక్రయించవచ్చు. యూనిట్కు రూ.2 వరకు పొందవచ్చు.


**నిబంధనలు సరళతరం**గతంలో కంటే నిబంధనలను సరళతరం చేశాం. రిజిస్ట్రేషన్, మీటర్ ఛార్జీలను తొలగించాం. రాయితీ నాలుగైదు రోజుల్లోనే పడుతుంది. మిగిలిన సొమ్మును బ్యాంకుల ద్వారా రుణంగా పొందొచ్చు. యూనిట్లు ఏర్పాటు చేసే వెండర్ల సంఖ్య సైతం పెరిగింది. రెండు జిల్లాల్లో 1,635 మంది ఏర్పాటు చేసుకున్నారు. ఆయా ప్లాంట్ల ద్వారా రోజూ 60 కిలోవాట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతోంది. ప్రస్తుతం 16 మంది రిజిస్టర్ వెండర్లు పరికరాలు అందిస్తున్నారు.- ఎం.లక్ష్మణరావు, ఎస్ఈ

**పరికరాలన్నీ వాడుతున్నాం**14 నెలల క్రితం అయిదు కిలోవాట్ల యూనిట్ పెట్టాం. రూ.4.10 లక్షల మేర ఖర్చయింది. రూ.78 వేల రాయితీ వచ్చింది. రోజుకు 20 యూనిట్లకు పైగా విద్యుత్తు వస్తోంది. మూడు ఏసీలు, రెండు గీజర్లు, నాలుగు పంకాలు, శీతలీకరణ యంత్రం, వాషింగ్ మిషన్, 10 బల్బులు, ఇతర పరికరాలన్నింటినీ వాడుతున్నాం. అయినప్పటికీ సున్నా బిల్లు వస్తోంది.

- ఎం.గౌరీశంకర్

# పాత వస్తువులకు.. కొత్త కళ..

నంద్యాల : కొత్తొక వింత పాతొక రోత' అనే సామెతను పక్కనపెట్టి ఇంట్లో ఉన్న పాత సామగ్రితోనే కొత్త రకమైన వస్తువులు తయారు చేసి చూపిస్తున్నారు రమాదేవి. ఈమెకు చిన్నతనం నుంచే బొమ్మలంటే ఎంతో ఆసక్తి. పాత రోజుల్లో ప్రాచుర్యంలో ఉండే వస్తువులను బంకమట్టితో తయారు చేసేవారు. కాలక్రమేణా వ్యర్థాలతో చిన్నచిన్న ఆకృతులను సృష్టించి నేటి తరం పిల్లలకు వాటి ఉపయోగాలు, అర్థాలను వివరిస్తున్నారు. గ్రామీణ వాతావరణం, అక్కడ ఉపయోగించే వస్తువులు, పండుగలు ఎలా జరుపుతారో తెలిపే ఘట్టాలను బొమ్మలుగా సృష్టించి పట్టణాల్లో పెరిగే పిల్లలకు తెలియజేస్తున్నారు. ఆమె చేసిన కళాకృతులు పలు రాష్ట్రాల్లో ప్రదర్శించడంతో నిర్వాహకుల ప్రశంసలు అందుకున్నారు. మినియేచర్ కళ తనకెంతో



ఇష్టమని, ఈ కళను నేటితరం పిల్లలకు పరిచయం చేయాలనే దృక్పథంతో ఉచితంగానే శిక్షణ ఇస్తున్నట్లు రమాదేవి చెబుతున్నారు. ఎవరైనా తనను సంప్రదించినట్లయితే నైపుణ్య శిక్షణ తరగతులను నిర్వహించేందుకు సిద్ధమంటున్నారు రమాదేవి.

సూక్ష్మ వస్తువులు కొలువైన మినీ ప్రపంచం ఆమె నివాసం. అందులో ఎన్నో వింతలు, విశేషాలు చూపరులను ఇట్టే ఆకట్టుకుంటాయి. గత వైభవాలుగా చెప్పుకునే పాతతరం వస్తువులెన్నో ఆమె చేతిలో చిన్న పరిమాణంలో బొమ్మలుగా రూపుదిద్దుకుంటాయి. వ్యర్థాలతో చిన్నచిన్న ఆకృతులను తయారు చేసే 'మినియేచర్' కళను నగరంలో విస్తరించేలా చేస్తున్నారు మురళీనగర్ ఎన్జీజీఓస్ కాలనీకి చెందిన గుత్తుల రమాదేవి. ఈ కళపై ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. మురళీనగర్

# నీటి కిట్టు.. వాడితే ఒట్టు

నంద్యాల : మద్దికెర సచివాలయానికి ప్రభుత్వం సరఫరా చేసిన ఎఫ్టీకే కిట్టు. కొంతకాలం నుంచి దీన్ని వినియోగించలేదు. అట్టపెట్టెలో భద్రంగా దాచారు. సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఉన్నాసరే ఇక్కడ నీటి నమూనాలు సేకరించడం లేదు.

గ్రామీణ ప్రజలకు తాగునీటిని అందించే పథకాల నిర్వహణ తీరు అధ్వానంగా ఉంది. నీటి నాణ్యత పరీక్షించి సరఫరా చేయాల్సి ఉన్నా ఈ విధానం సక్రమంగా అమలు కావడం లేదు. చినుకులు కురుస్తున్నాయి.. కొత్త నీరు వచ్చి చేరుతోంది. కలుషితమయ్యే ముప్పు అధికంగా ఉంటుంది. ఎప్పటికప్పుడు పరీక్షలు చేసి ప్ర'జల'ను అప్రమత్తం చేయాల్సిన బాధ్యతను అధికారులు విస్మరిస్తున్నారు. గ్రామాల్లో మంచినీటి నాణ్యత పరీక్షల కోసం ఇచ్చిన ఫీల్డ్ టెస్టింగ్ కిట్లను (ఎఫ్టీకే) మూలనపడేశారు.

కర్నూలు జిల్లాలోని 484, నంద్యాలలో 489 గ్రామాలకు గతేడాది నీటి పరీక్షా కిట్లు అందజేశారు. ఒక్కోదానికి రూ.1700 వెచ్చించారు. ఉమ్మడి జిల్లాలోని 973 గ్రామ పంచాయతీలకు రూ.16,54,100 వ్యయం చేశారు. వీటి వినియోగంపై పంచాయతీ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. పర్యవేక్షణ బాధ్యతను సచివాలయ ఇంజినీరింగ్ సహాయకు



లకు అప్పగించారు. వాటిని వాడకుండా అటకెక్కించారు.

**ఎలాంటివి తెలుసుకోవచ్చు**

ఫీల్డ్ టెస్టింగ్ కిట్లతో నీటికి సంబంధించిన తొమ్మిది రకాల నీటి నాణ్యత పరీక్షలు చేయొచ్చు. నీటి గాఢత, అమ్లాలు, క్షారాలు, ఉప్పు, ఫ్లోరైడ్ శాతం ఇతర లవణాల శాతం తెలుసుకోవచ్చు.

పీపీఎం ఎంతశాతం ఉందన్నదీ నిర్ణయిస్తారు. సాధారణంగా నీటిలో గాఢత, ఆమ్లాలు, క్షారాలు ఎక్కువగా ఉంటే కడుపునొప్పి, గ్యాస్ట్రబుల్ వంటి అనారోగ్య సమస్యలు ఇబ్బందిపెడతాయి.

పీపీఎం 2 శాతం కంటే తక్కువగా ఉన్నట్లు తేలితే ఆ నీళ్లు తాగడానికి పనికిరావు. వాటి శుద్ధికి చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. ఇంత ప్రాధాన్యమున్న కిట్లను ఒక్క గ్రామంలోనూ వినియోగించకపోవడం గమనార్హం.

**ఊసేలేని నమూనాల సేకరణ**

గ్రామ పంచాయతీల్లో కుళాయి, తాగునీటి పథకాల నీటి నమూనాలు సేకరించాలి. ప్రజలు సచివాలయానికి నేరుగా తీసుకొచ్చే నీటిని ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పరీక్షించాలి. ఎక్కడా ఈ ప్రక్రియ జరగడం లేదు.ఎప్పటికప్పుడు నీటి పరీక్షలు చేసి ఫలితాల్లో తేడా వస్తే కర్నూలు జిల్లాలోని నాలుగు, నంద్యాల జిల్లాలోని నాలుగు వాటర్ క్వాలిటీ టెస్టింగ్ ల్యాబ్స్కు వీటి నమూనాలు పంపాల్సి ఉంటుంది. అధికారులు ఈ మాటే మరిచారు. ఎక్కడైనా అతిసారం ప్రబలినప్పుడు హడావుడి చేస్తున్నారు. పరీక్షల నివేదికలను సచివాలయాల్లోని ఇంజినీరింగ్ సహాయకులు ఆన్లైన్లో నమోదు చేయాలి. రెండు జిల్లాల్లోని 672 సచివాలయాల్లో ఎక్కడా ఇది జరగడం లేదు.

# మామిడి కోతలకు తొందరొద్దు!

చిత్తూరు : జిల్లాలో మామిడి సీజన్ జూన్ నుంచి జోరందుకోనుంది. ప్రస్తుతం బేనీషా, కాదర్, పుల్లేరా రకాలనే మార్కెట్ యార్డులకు తరలిస్తున్నారు. బేనీషా రకం ధరలు కాస్తా తగ్గుతుండటంతో ఇది ముమ్మందు మరింత పతనమవుతుందని రైతులు తొందరపడి కోతలు చేపట్టవద్దని ఉద్యానశాఖ అధికారులు సూచిస్తున్నారు. రానున్న రోజుల్లో మంచి ధర వస్తుందని చెబుతున్నారు. పక్వానికి రాని బేనీషా రకాలను తేవడం వల్ల సరైన ధర లభించక నష్టపోవాల్సి వస్తోందని, పక్వానికి వచ్చిన కాయలనే తీసుకురావాలని మండీ యజమానులు చెబుతున్నారు. బేనీషా, తోతాపురి(లైన్ కాయలు) వ్యాపారులు, ఎగుమతిదారులు చిత్తూరు వచ్చారని, వారం రోజుల్లో వ్యాపారం ఊపందుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. తోతాపురి మామిడిని గుజ్జు పరిశ్రమలు జూన్ మొదటి వారం నుంచి సేకరించనున్నాయని ఉద్యానశాఖ అధికారులు తెలిపారు. చిత్తూరులో మామిడి ధర ఇలా..: చిత్తూరులోని మార్కెట్ యార్డుకు బేనీషా, కాదర్, పుల్లేరా, తోతాపురి(లైన్ కాయలు) చేరుతున్నాయి. శనివారం టన్ను బేనీషా ధర రూ.19-25 వేలు, కాదర్ రూ.28-32 వేలు, పుల్లేరా రూ.10-12 వేలు పలుకుతుండగా.. తోతాపురి లైన్ కాయలు రూ.18-20 వేలు ధర పలికాని మండీ యజమానులు పేర్కొన్నారు.

# వడ్డెర్లకు తరగని ఉపాధి

నంద్యాల : కూటమి ప్రభుత్వం మరో ఎన్నికల హామీ అమలుకు అడుగులు వేస్తోంది. వడ్డెర సామాజిక వర్గానికి చెందిన వారికి కంకర క్వారీ లీజులు అప్పగించాలని నిర్ణయించింది. వడ్డెర సొసైటీలకు గనుల లీజులు అప్పగించి వారి ఉపాధికి, ఆర్థికాభివృద్ధికి బాటలు వేయనుంది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలో కంకర, నాపరాయి, పలక క్వారీల వివరాలు అధికారులు సేకరించారు. వాటిని వడ్డెర సొసైటీలకు కేటాయించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కంకర (రోడ్ మెటల్), పలకలు, క్యూబ్స్, కెర్బ్ లీజులు కేటాయించనున్నారు. దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లో అనుమతులు ఇవ్వనున్నారు. ఒకే లీజుకు ఒకటి కంటే ఎక్కువ సొసైటీలు దరఖాస్తు చేసుకుంటే ఆ క్వారీకి దగ్గరున్న వారికి తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఒక్కో సొసైటీకి 12 హెక్టార్లకు మించకుండా లీజులు కేటాయించనున్నారు.

**ఏటా రూ.15 కోట్ల రాయితీ**

కంకర, పలకలు, క్యూబ్స్, కెర్బ్ ఖనిజాలు తవ్వి, తరలించే వారి నుంచి గనుల శాఖ వసూలు చేసే సీనరేజ్‌లో వడ్డెర సొసైటీలకు ప్రభుత్వం 50 శాతం రాయితీ ఇవ్వనుంది. నంద్యాల జిల్లాలో 37, కర్నూలు జిల్లాలో 8 వడ్డెర సొసైటీలు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. వీటన్నింటికీ లీజుల కేటాయింపులో ప్రాధాన్యం ఇవ్వనున్నారు. వడ్డెర్లకు కేటాయించే గనుల నుంచి వసూలు చేసే సీనరేజ్‌లో 50 శాతం రాయితీ ఇస్తే గనుల శాఖ ఆదాయం రూ.15 కోట్ల వరకు తగ్గనుంది. ఈమేరకు వడ్డెర సొసైటీలకు లబ్ధి చేకూరనుంది.

**ఈ-వేలంతో దెబ్బతీసిన వైకాపా**

వడ్డెర సొసైటీలకు 1990వ సంవత్సరం నుంచి క్వారీ లీజులు



కేటాయిస్తూ వస్తున్నారు. ప్రత్యేకించి నాపరాయి, కంకర లీజులు వీరికే అప్పగించే వారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం గనుల శాఖలో కొత్త విధానాలు అమలు చేసింది. 2022లో లీజుల కేటాయింపుల్లో మార్పులు చేసింది. వడ్డెర సొసైటీలకు కేటాయించే లీజులకు ఈ-వేలం విధానం అమలు చేసింది. దీంతో వడ్డెర్లు వేలంలో పాల్గొంటేనే క్వారీ లీజులు దక్కే పరిస్థితి ఏర్పడింది. క్వారీలు పొందేందుకు బడా బాబులు రంగంలో దిగి ఎక్కువ మొత్తాలకు కంకర తదితర ఖనిజాలను పాడుకుని సొంతం చేసుకున్నారు. దీంతో దశాబ్దాలుగా క్వారీలనే నమ్ముకుని జీవనం సాగిస్తున్న వడ్డెర సొసైటీలు, గనుల్లో పనిచేసే వడ్డెర కుటుంబాలు రోడ్డున పడ్డాయి.

**రెండు వేల హెక్టార్లలో ఖనిజాలు**

వడ్డెర సామాజిక వర్గానికి కేటాయించనున్న వివిధ రకాల గనులు కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 2 వేల హెక్టార్లలో విస్తరించి ఉన్నాయి. కంకర గనులు నంద్యాల జిల్లాలో బనగానపల్లి, అవుకు, ప్యాపిలి, కొలిమిగుండ్ల, బేతంచెర్ల, పాణ్యం, మండలాల్లో వంద హెక్టార్లు, కర్నూలు జిల్లాలో ఆదోని, ఆలూరు, పత్తికొండ, కోడుమూరు, ఎమ్మిగనూరు ప్రాంతాల్లో 300 హెక్టార్లలో ఉన్నాయి.


నాపరాయి, పలకల గనులు నంద్యాల జిల్లాలో బనగానపల్లి, అవుకు, ప్యాపిలి, కొలిమిగుండ్ల మండలాల్లో 500 హెక్టార్లలో విస్తరించాయి. క్యూబ్స్, కెర్బ్ ఖనిజాలు కర్నూలు జిల్లాలోని ఆదోని, పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాలో సుమారు 300 హెక్టార్లలో ఉన్నాయి.

రోడ్ మెటల్ లీజులు నంద్యాల జిల్లాలో 30, కర్నూలు జిల్లాలో 175 వరకు ఉన్నాయి. నాపరాయికి సంబంధించిన లీజులు నంద్యాల జిల్లాలో 153, కర్నూలు జిల్లాలో 15 ఉన్నాయి.

# ఉద్యానానికి ఊతం!

ఒంగోలు : రైతులకు పంట పండించడం ఎంత కష్టమో చేతికొచ్చాక వాటిని సంరక్షించి విక్రయించుకోవడమూ అంతే కష్టం. ప్రధానంగా మిర్చి, మామిడి, బత్తాయి, టమాట, అరటి, బొప్పాయి, కూరగాయలు తదితర ఉత్పత్తులను సకాలంలో విక్రయించుకోకపోతే నాణ్యత కోల్పోయి నాణ్యత, విలువ తగ్గిపోతుంది. దీంతో రైతులకు దక్కాల్సిన ఆదాయంలో 30 శాతం కోల్పోతున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని పంట కోత అనంతరం సంరక్షించుకుని మంచి ధరకు విక్రయించుకునేందుకు సీడ్ ప్రాసెసింగ్, కోల్డ్ స్టోరేజీలు, కోల్డ్ రూంలు, సోలార్ డ్రయ్యర్లు తదితర యూనిట్లను రాయితీపై అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

జిల్లాలోని 38 మండలాల్లో మిర్చి సాగుచేసే రైతులు అత్యధికంగా ఉన్నారు. పంట కోత అనంతరం వాటిని ఎండపెట్టడానికి మార్గం లేక పొలాల్లో, కల్లాల్లో ఆర బోస్తున్నారు. వర్షం, మంచుకు నాణ్యత కోల్పోయి మార్కెట్‌లో ధర తగ్గిపోతుంది. వీటిని సంరక్షించుకునే గదులు, యంత్రాలను రాయితీపై ఇస్తే స్థూల ఆదాయం కూడా పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు గతం కన్నా రాయితీ పెంచడంతోపాటు కొత్త యూనిట్లు మంజూరు చేసింది.



ఉద్యాన రైతులకు రాయితీపై యూనిట్లు ఇచ్చేందుకు ప్రభుత్వం జిల్లాకు ఈ ఏడాది రూ.6.35 కోట్లు మంజూరు చేసింది. రైతులు ముందుగా వారి సొంత డబ్బులతో అవసరమైన యూనిట్ ఏర్పాటు చేసుకుంటే ఉద్యానశాఖ అధికారులు పరిశీలించి రాయితీ నిధులు విడుదల చేస్తారు. ఉద్యాన సమీకృత పథకం కింద జిల్లాకు 15 రకాల యూనిట్లు కేటాయించారు. దీనిలో ఎస్సీ, ఎస్టీలకు 24 శాతం మేర చోటు కల్పించారు.

దరఖాస్తు చేసుకోవాలి: యూనిట్లు అవసరమైన రైతులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలి. యూనిట్ నెలకొల్పిన వెంటనే పరిశీలించి రాయితీ విడుదల చేస్తాం. పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు ఖాతా పుస్తకం మొదటి పేజీ, ప్రాజెక్టు నివేదిక వివరాలతో కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

గోపీచంద్, జిల్లా ఉద్యానశాఖ అధికారి

# ఇంకెన్ని ప్రాణాలు పోవాలి?



గుంతకల్లు : వందల ఏళ్లనాటి రైల్వేస్టేషన్.. రోజూ 200 దాకా రైళ్లు పరుగులు పెడుతుంటాయి.. ప్రయాణికులు వేళ సంఖ్యలో ఉంటారు.. రూ.కోట్లలో ఆదాయం.. అంతటి ఘన చరిత్ర ఉన్న గుంతకల్లు రైల్వే జంక్షన్‌లో నేటికీ కాలం చెల్లిన భవనాలను వినియోగిస్తున్నారు. గదులు పెచ్చులూడితే పైపై మెరుగులు దిద్ది వదిలేస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే తాత్కాలిక మరమ్మతులతో సరిపెడుతున్నారు. శిథిల గదులను కూల్చేసి నూతన కట్టడాలు చేపట్టకుండా నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారు. ఫలితంగా ప్రయాణికుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. గుంతకల్లు రైల్వే జంక్షన్‌లో 6, 7 ప్లాట్‌ఫారాల మధ్య ఆంగ్లేయులు 155 సంవత్సరాల కిందట నిర్మించిన భవనాల్లోనే స్టేషన్‌ను నిర్వహిస్తున్నారు. ఇక్కడ పై అంతస్తులో భవనాలు శిథిలావస్థకు చేరడంతో పదేళ్ల కిందట కండెం చేశారు. కిందనున్న భవనాల్లో ప్రయాణికుల విశ్రాంతి గదులతోపాటు హెూటళ్లను నిర్వహిస్తున్నారు. గదుల్లో పటుత్వం తప్పుతుండటంతో జనరల్ విశ్రాంతి గది గోడకున్న సిమెంటు పెచ్చులూడి శుక్రవారం కర్నూలుకు చెందిన బాలుడు మృతి చెందిన విషయం విదితమే. ఇక్కడున్న గదుల పటిష్ఠత గురించి అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. స్టేషన్‌లో పలుచోట్ల గోడల పరిస్థితి ఇలాగే ఉంది. తాత్కాలిక మరమ్మతులు చేసి గుత్తేదారులు లాభపడుతున్నారు కానీ ప్రయాణికులకు ప్రయోజనం లేకుండా పోతోంది. ఎక్కువ సంఖ్యలో రైళ్లు (రోజూ 120) 6, 7 ప్లాట్‌ఫారాల గుండా వెళుతుంటాయి. ఈ రెండు ప్లాట్‌ఫారాలు నిత్యం ప్రయాణికులతో నిండి ఉంటున్నాయి. వర్షం పడితే నీరు చేరుతుంది. ప్రయాణికులు నిలబడటానికి కూడా వీలు ఉండదు. ఉన్నతాధికారులు తరచూ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్నారే.. కానీ శాశ్వత మరమ్మతులు చేయించలేకపోతున్నారు.

**రూ.20 కోట్లు కేటాయింపు**

గుంతకల్లు రైల్వే జంక్షన్‌లోని పాత స్టేషన్ భవనాలను తొలగించి వాటి స్థానంలో కొత్తవి నిర్మించడానికి, యార్డు విస్తరణ, అన్ని ప్లాట్‌ఫారాలకు చెందిన లైన్ల అనుసంధానం కోసం రైల్వే బోర్డు రూ.20 కోట్లు కేటాయించినట్లు రైల్వే అధికారులు చెప్పారు. పనులను అమలు చేసే బాధ్యతను రైల్వే బోర్డు గుంతకల్లులోని గేజ్‌కన్వర్షన్ (నిర్మాణాలు) కార్యాలయం అధికారులకు అప్పగించింది. స్టేషన్‌లోని పాత భవనాలతో పాటు పాత టికెట్ బుకింగ్ కార్యాలయాన్ని తొలగించి కొత్త రైల్వేలైన్లు, భవనాలను నిర్మించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. పనుల్లో భాగంగా కొత్త సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటు కోసం ఇప్పటికే అధికారులు రూ.4 కోట్లు వ్యయం చేసి నాలుగేళ్ల కిందట భవనాలను నిర్మించారు. ప్రస్తుతం ఇవి నిరుపయోగంగా ఉన్నాయి.

# భూ సేకరణపై ఆందోళన



హిందూపురం : తరతరాలుగా వారసత్వంగా వస్తున్న భూముల్లో రెవెన్యూ అధికారులు వివరాలు సేకరిస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. హిందూపురం గ్రామీణ మండలంలోని మలగూరు, చలివెందుల, రాచపల్లి, మీనుగుంటపల్లి గ్రామాల్లో భూముల వివరాలను సేకరిస్తున్నారు. దీంతో ఆ గ్రామాల రైతులు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసనకు దిగి భూములు ఇవ్వమని ఖరాఖండిగా చెప్పారు.

**సారవంతం..**

మలగూరు, చలివెందుల గ్రామాల పరిధిలో డీకేటీ భూములు 1,931.53 ఎకరాలు, పట్టా భూములు 259.04 ఎకరాలు, ప్రభుత్వ భూమి 136.88 ఎకరాలు మొత్తం 2,327.45 ఎకరాలు ఉన్నట్లు రెవెన్యూ అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. ఈ ప్రాంత భూములన్నీ సారవంతంగా వ్యయసాయ ఆమోదయోగ్యంగా ఉన్నాయి. దీనికితోడు ఈ గ్రామాల పరిధిలో 5 చెరువులు ఉండటంతో హంద్రీనీవా కాలువ నుంచి ఉపకాలువ తీసుకొచ్చి చెరువులు నింపుతుండటంతో రైతులకు ఎలాంటి నీటి సమస్య లేదు. అందువలన రైతులు సాధారణ పంటలతోపాటు దీర్ఘకాలికంగా ఆదాయం అందించే వక్క పంట సాగు చేస్తున్నారు.

**వైకాపా పాలనలోనే ప్రతిపాదనలు** గత వైకాపా ప్రభుత్వ పాలనలోనే ఈ ప్రాంతంలో ఐటీ కాన్సెప్ట్ సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీకి 2,191.17 ఎకరాల భూమికి ప్రతిపాదనలు సిద్ధం చేసి అందుకు స్కెచ్‌కూడా అప్పట్లో అధికారులు సిద్ధం చేశారు. ఎందువలనో ఈ ప్రయత్నానికి ఫుల్‌స్టాప్ పడింది. ప్రస్తుతం రెవెన్యూ అధికారులు రైతుల పట్టాదారు పాస్‌పుస్తకాలు, బ్యాంకు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు వివరాలు అడుగుతుండటంతో రైతుల్లో తీవ్ర ఆందోళన మొదలైంది. గతంలో పలు ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుకు వందలాది ఎకరాలు సేకరించి రైతులకు ఉపాధి చూపుతామన్న వారు కనీసం ఆ భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయలేదు. రైతులకు ఉపాధి చూపకపోవటంతో భూములు ఇచ్చిన రైతుల స్థితి నేడు ధీనంగా మారింది. ఇదే పరిస్థితి మాకు దాపురిస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**భూములు వదులుకోం**

మా పెద్దల నుంచి వచ్చిన ఐదు ఎకరాలను ముగ్గురు అన్నదమ్ములం సాగుచేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నాం. ఇలాంటి సమయంలో భూములు లేక పోతే మాకు జీవనాధారం లేదు. అందువలన భూములు మాత్రం వదులుకోం. ఈ విషయంలో ఎమ్మెల్యే బాలకృష్ణ రైతులకు సాయం చేయాలి.

**మహబూబ్‌బాషా**రీ సర్వే చేస్తున్నారు ..మలగూరు, చలివెందుల, రాచపల్లి, మీనుగుంటపల్లి గ్రామాల్లోని భూములు రీ సర్వే చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావటంతో సిబ్బంది సర్వే చేస్తున్నారు. ప్రస్తుతం ఎంత భూమిని రైతులు సాగు చేస్తున్నారు. ఎలాంటి పంటలు పండిస్తున్నారు అనే వివరాలు ఉన్నతాధికారులకు అందజేస్తాం. వెంకటేశు, తహసీల్దార్, హిందూపురం

# ఫలరాజుతో వెళ్తే పడిగాపులే



పాకాల : ఆరుగాలం కష్టించి పండించిన పంటను అమ్ముకోలేని దీనస్థితిలో మామిడి రైతులు ఉన్నారు. సరకును మార్కెట్లకు తరలించి, అక్కడి ధరలు చూసి ఉసూరుమంటున్నారు. ర్యాంప్ యజమానులు నిర్ణయించిన మొత్తానికే అమ్మాలన్నా పడిగాపులు తప్పడం లేదు. టన్ను కాయల ధర రూ.3 వేలకు పడిపోవడంతో కూలీ, రవాణా ఖర్చులు సైతం గిట్టుబాటు అవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం చీకటి పడినా అమ్ముకోలేని రైతుల నుంచి కొన్ని ర్యాంపుల్లో టన్ను రూ.1500లకు కొనుగోలు చేసినట్లు సమాచారం. ఉదయం నుంచి వేచి ఉన్న ట్రాక్టర్ల యజమానులు సాయంత్రం అవుతుంటే ఒత్తిడి చేస్తున్నారని, చేసేది లేక సరకు అమ్ముకోక తప్పడం లేదని, ప్రభుత్వ హామీలు, అధికారుల ఆదేశాలను గుజ్జు పరిశ్రమలు, సప్లయర్లు పట్టించుకోకపోవడంతోనే ఈ దుస్థితి ఎదురైనట్లు రైతులు వాపోతున్నారు.

**రైతులకు తప్పని తోపులాటలు**దామలచెరువు పరిసర ప్రాంతాల్లో 20 పైగా ర్యాంపులున్నా కొనుగోళ్లు నిలిపేశారు. దామలచెరువు-మొగరాల రహదారి పక్కనున్న ఓ ర్యాంపు వద్ద షోలాపూర్‌కు చెందిన వ్యాపారి కాయలు కొనుగోలు చేస్తుండగా అక్కడ వందలాదిగా ట్రాక్టర్లు నిలిచిపోతున్నాయి. రద్దీ కారణంగా చీకటిపడే సమయానికి రైతుల మధ్య తోపులాటలు కొనసాగుతున్నాయి. పోలీసులు వచ్చి పరిస్థితిని చక్కదిద్దాల్సి వస్తోంది.

**కూలీ, రవాణా ఖర్చులకూ రాక..**

సగటున ట్రాక్టరు కాయల కోతకు రూ.4,500 కూలీ ఖర్చువుతోంది. సమీపంలోని గ్రామాల నుంచి మార్కెట్‌కు తీసుకెళ్తే ట్రాక్టరు బాడుగ మరో రూ.3 వేలు చెల్లించాలి. దూరప్రాంతాలయితే రూ.5-8 వేలు వెచ్చించాల్సి వస్తోంది. గుజ్జు పరిశ్రమల వద్ద ఆలస్యమవుతుండటంతో ఏ ట్రాక్టరూ ముందుకు రావడం లేదు. కనీసం రెండు రోజులు గడిస్తేగానీ కాయలు దింపుకోవడం లేదని నిరాకరిస్తున్నారు. దీంతో సొంత ట్రాక్టర్లు ఉన్నవారు మాత్రమే పరిశ్రమలకు తీసుకెళ్లగలుగుతున్నారు. మిగిలినవారు కాయలను చెట్లపైనే వదిలేసి దిక్కులు చూస్తున్నారు.

**నిండా మునిగిపోయారు**మామిడి రైతులకు ఇది చీకటి సంవత్సరం. టన్ను రూ.3 వేలకైనా కొనేవారు లేరు. గుజ్జు పరిశ్రమల వద్ద రెండుమూడు రోజులు పడిగాపులు తప్పడం లేదు. కోత కూలీలు, రవాణా ఖర్చులు మరింత పెరిగాయి. తోటల్లో కాయలు మాగి రాలిపోతున్నా ఏం చేయలేని నిస్సహాయస్థితి కొనసాగుతోంది. ఇప్పటి వరకు కనీసం పావువంతు పంట దింపలేదు. గుజ్జు పరిశ్రమలు, సప్లయర్లతో మాట్లాడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

తిరుమల రెడ్డి ప్రసాద్, రైతు, దామలచెరువు

# ఇక సాఫీగా నవీక'రణం'

పొదిలి : జిల్లాలోని రైతులకు కేంద్రం శుభవార్త చెప్పింది. వర్జీనియా పొగాకు సాగు చేసే వారు 2025-26 పంటకాలం నుంచి బ్యారన్ రిజిస్ట్రేషన్, లైసెన్సు గడువును ఏడాది నుంచి మూడేళ్లకు పొడిగించడంతో వారి అవస్థలు తీరనున్నాయి. ఈ మేరకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయడంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు.

పొగాకు బోర్డు నిబంధనల ప్రకారం రైతులు ప్రతి ఏడాది సాగు చేస్తున్న విస్తీర్ణం, పంట పరిమాణానికి బోర్డు నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంది. అదేవిధంగా క్యూరింగ్ చేసే బ్యారన్లకు ఏటా అనుమతి తప్పనిసరి. రైతులు వారికి సమీపంలోని పొగాకు వేలం కేంద్రాల్లో సంప్రదించి అనుమతులు పొందాలి. దశాబ్దాలుగా జిల్లాలో వర్జీనియా పొగాకును పండిస్తున్నప్పటికీ సాగు, బ్యారన్ లైసెన్సులు ఏటా నవీకరణ చేసుకోవాల్సి రావడం వారికి తలనొప్పిగా మారింది. బ్యారన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన రైతు దూర ప్రాంతాల్లో ఉన్నా..తప్పనిసరిగా వేలం కేంద్రాలకు వచ్చి పునరుద్ధరణ ఫారాలను ఇవ్వాల్సి వచ్చేది. దీంతో ప్రతి ఏడాది ఆగస్టు నుంచి డిసెంబరు వరకు లైసెన్సుల నవీకరణ కోసం వేలం కేంద్రాల చుట్టూ తిరుగుతుండేవారు.

**ఎట్టకేలకు తీరిన సమస్య**

జిల్లాలోని ఎస్ఎల్ఎస్, ఎస్‌బీఎస్ పరిధిలో 8 వేలం కేంద్రాలున్నాయి.



వాటి పరిధిలోని రైతు సంఘం నాయకులు కొన్నేళ్లుగా రిజిస్ట్రేషన్ విధానాన్ని మార్చాలని బోర్డును కోరుతున్నారు. పునరుద్ధరణను మూడేళ్లు, అయిదేళ్లకు పెంచాలని వారు అభ్యర్థిస్తున్నారు. ఈ విషయమై గతంలో బోర్డు ఛైర్మన్లు, కార్యదర్శులకు సైతం లేఖలు రాశారు. పొగాకు రైతుల సంక్షేమం కోసం అడిగే డిమాండ్లలో ఇది ప్రధానంగా ఉండేది. ఎట్టకేలకు కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ మూడేళ్లకు అనుమతించడంతో జిల్లాలోని వేలాదిమంది రైతులకు మేలు చేకూరనుంది. దీంతో రైతులు ప్రతి ఏడాది బ్యారన్ రిజిస్ట్రేషన్ పునరుద్ధరణ కోసం తిరగాల్సి అవసరం తప్పింది.

**ఎంతో ప్రయోజనకరం**

కొన్నేళ్లుగా రైతుల విన్నపం మేరకు వచ్చే ఏడాది నుంచి పొగాకు బ్యారన్ల లైసెన్సు గడువు మూడేళ్లు ఉండేలా ఉత్తర్వులొచ్చాయి. పొగాకు బోర్డు ఉన్నతాధికారులు కేంద్ర వాణిజ్యమంత్రిత్వశాఖ దృష్టికి తీసుకెళ్లి రైతులకు మేలు జరిగేలా చూశారు. కొత్త ఉత్తర్వుల మేరకు రైతులు ప్రతి ఏడాది రెన్యువల్ కోసం వేలం కేంద్రాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదు.

ఎం.లక్ష్మణరావు, ఆర్ఎం, ఒంగోలు

జిల్లాలో రీజియన్లు : ఎస్‌బీఎస్, ఎస్ఎల్ఎస్.

వర్జీనియా రైతులు : 29,885


మొత్తం బ్యారన్లు : 24,130

వేలం కేంద్రాలు : 8

# గ్రూపులు కట్టేసి.. రుణాలు కొట్టేసి!

ఒంగోలు : వడ్డించేవాడు మనవాడైతే అంతా మనకే అన్నట్లు గత వైకాపా ప్రభుత్వ హయాంలో ట్రాక్టర్ల రుణాలు పప్పుబెల్లాల్లా పంచేశారు. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా రూ.12 కోట్ల రుణాలు కొల్లగొట్టేశారు. అయిదారుగురు రైతులు కలిసి సంఘంగా ఏర్పడి ట్రాక్టరు పొందేందుకు అవకాశం ఉండగా, అయినవారందరూ గ్రూపులు కట్టేసి ట్రాక్టర్లను పంచుకున్నారు. వైకాపా నేతలు చెప్పిన దానికి అధికారులు తలాడిస్తూ నిబంధనలు ఏమాత్రం పట్టకుండా వ్యవహరించారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో కస్టమర్ హైరింగ్ సెంటర్లలో ట్రాక్టర్లు, యంత్ర పరికరాలు రైతులకు అద్దెకు ఇచ్చేందుకు రూపకల్పన చేశారు. అయిదారుగురు రైతులకు కలిపి ఒక్కో ట్రాక్టరును అందించారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ)ను వేదికగా చేసుకుని వైకాపా నేతలే రుణాలు దక్కించుకున్నారు. డీసీసీబీ పరిధిలో రూ.14 కోట్ల రుణాలతో ట్రాక్టర్లు అందించగా, సింహభాగం బోగస్ రుణాలతో స్వాహా చేశారు.

డీసీసీబీ నుంచి రుణం అందుకునే రైతుల సంఘాన్ని గ్రామ సలహా మండలి ఎంపిక చేయాలి. ఇందులో నిబంధనలు ఏమాత్రం పట్టించుకోలేదు. అంతా వారిలో వారే సంఘాలుగా ఏర్పడ్డారు. స్థానికంగా డీసీసీబీ శాఖలో సంఘం గురించి విచారణ జరిపిన అనంతరం గ్రూపు పేరిట ఖాతా ప్రారంభించాలి. రుణం మంజూరు చేయాలంటే కనీసం ఇద్దరి సభ్యులకైనా సిబిల్ స్కోర్ 650పైన ఉ



ండాలి. ఇవేమి పట్టించుకోకుండా డీసీసీబీ అధికారులు అడ్డగోలుగా అయినవారికి ట్రాక్టర్ల కొనుగోలుకు రుణాలిచ్చేశారు.


ప్రస్తుతం డీసీసీబీ నూతన పాలక మండలి ఏర్పడిన నేపథ్యంలో గత వైకాపా ప్రభుత్వ హయాంలో జరిగిన రుణాల స్వాహా పర్వంపై ఆరా తీస్తున్నారు. అప్పట్లో అడ్డగోలుగా రుణాలు పంచేందుకు సహకరించిన అధికార గణంలో వణుకు మొదలైంది. ఇవి కాకుండా గత వైకాపా అయిదేళ్ల పాలనలో డీసీసీబీలో కస్టమర్ హైరింగ్ సెంటర్లలో అన్ని యంత్ర పరికరాలకు కలుపుకొని 1,509 సంఘాలకు రూ.43 కోట్ల మేర రుణాలు మంజూరు చేశారు. వీటిలో రూ.5.97 కోట్లు తిరిగి రాబట్టలేనివిగా మారాయి. దాదాపు 300 గ్రూపుల సభ్యులు ఎవరో.. వసూళ్లు చేపట్టడం ఎలాగో తెలియకుండాపోయింది.

అంబులెన్స్‌ల పేరిట రూ.66 లక్షల దోపిడీ

దోచుకునేందుకు కాదేదీ అనర్హం అన్నట్లు పాత అంబులెన్స్‌లను ఒక్కోదాన్ని రూ.22 లక్షల చొప్పున మూడింటిని కొనుగోలు చేశారు. వీటిని మొబైల్ ఏటీఎంలుగా మార్చారు. దీనికి డీసీసీబీలో ఎలాంటి తీర్మానం లేకుండా కొనేశారు. విషయం ఏమంటే.. ఏటీఎం వాహనంగా మార్చేందుకు రవాణాశాఖ అధికారుల అనుమతి తీసుకోవాలి. సొమ్ముల స్వాహానే లక్ష్యంగా నిబంధనలు ఏమాత్రం పట్టించుకోకుండానే పనిచక్కబెట్టేశారు.

## ఇప్పటికీ 'డర్టీ పిక్చర్' అందమే..!

బెంగాలీ మూవీ 'భలో థేకో' తో 2003లో ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ విద్యా బాలన్. బాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చిన కొత్తలోనే నటిగా మంచి గుర్తింపు దక్కించుకోవడంతో పాటు, అందాల ఆరబోతతో స్టార్‌డం దక్కించుకుంది. బాలీవుడ్ స్టార్ హీరోలకు ఒకానొక సమయంలో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా, లేడీ ఓరియంటెడ్ సినిమాలకు వాంటెడ్‌గా విద్యా బాలన్ పేరు దక్కించుకుంది. అలాంటి విద్యా బాలన్ అనారోగ్య సమస్యల కారణంగా బరువు విపరీతంగా పెరగడం, కొన్నాళ్ల తర్వాత తగ్గడం తరచూ జరుగుతూనే ఉంటుంది. విద్యా బాలన్ తన బరువు సమస్య గురించి పలు ఇంటర్వ్యూల్లో మాట్లాడిన సందర్భాలు ఉన్నాయి. ఆమె ఎప్పటికప్పుడు తన సమస్యను అధిగమిస్తూ వచ్చింది. సాధారణంగా హీరోయిన్స్ మూడు పదుల వయసు వరకు యాక్టివ్‌గా ఉంటారు. ఎప్పుడైతే నాలుగు పదుల వయసులో పడుతారో అప్పటి నుంచి అందాల ఆరబోత తగ్గిస్తూ ఉంటారు. పెళ్లి చేసుకున్న తర్వాత చాలా మంది హీరోయిన్స్ కనీసం స్కిన్ షో కి సైతం ఆసక్తి చూపించరు. కానీ కొందరు మాత్రం నాలుగు పదుల వయసులోనూ పాతికేళ్ల పడుచు అమ్మాయిలతో సమానంగా అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేస్తూ ఉంటారు. విద్యా బాలన్ ఆ కోవలోకి వస్తుంది. నాలుగు పదుల వయసు దాటిన విద్యా బాలన్ సినిమాల విషయంలోనూ జోరు తగ్గడం లేదు. గత ఏడాది విద్యా




బాలన్ నటించిన రెండు సినిమాలు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. తాజాగా ప్రముఖ మ్యాగజైన్ పికాక్ కవర్ పేజ్‌పై విద్యా బాలన్ కన్నుల విందు చేసింది. పింక్ డ్రెస్‌లో విద్యా బాలన్ చూపు తిప్పుకోనివ్వడం లేదు. అల్ట్రా మోడ్రన్ హెయిస్ స్టైల్‌తో పాటు, వయసు సగానికి పైగా తగ్గించి చూపించే విధంగా మేకోవర్‌తో విద్యా బాలన్ ఆకట్టుకుంది. అంతే కాకుండా ఆమె డీప్ నెక్ క్లీ వేజ్ షో మతి పోగొడు తోంది. మొత్తంగా విద్యా బాలన్ దాదాపు 15 ఏళ్ల క్రితం చేసిన డర్టీ పిక్చర్‌లో ఎలా అయితే అందంగా, శృంగార తారగా కనిపించిందో ఇప్పటికీ అదే మాదిరిగా కనిపిస్తోంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఈ స్థాయి అందాల ఆరబోత చేస్తున్న నేపథ్యంలో విద్యా బాలన్ మరో పదేళ్ల పాటు ఇండస్ట్రీలో టాప్ స్టార్‌గా ఉండే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. తెలుగులో బాలకృష్ణ నటించిన ఎన్టీఆర్ బయోపిక్‌లో విద్యా బాలన్ నటించిన విషయం తెల్సిందే. ఎన్టీఆర్ భార్య బసవ తారకం పాత్రలో విద్యా బాలన్ నటించి మెప్పించింది. అంతే కాకుండా ఇంకా పలు సినిమాల డబ్బింగ్ వర్షన్‌లతోనూ విద్యా బాలన్ తెలుగు ప్రేక్షకులను అలరించిన సందర్భాలు ఉన్నాయి. బాలీవుడ్‌లోనే కాకుండా సౌత్ ఇండియన్ మూవీస్‌లోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు దక్కించుకున్న విద్యా బాలన్ అందాల ఆరబోత ఫోటోలు చూసి నెటిజన్స్ షాక్ అవుతున్నారు. ఇప్పటికీ ఇంత అందంగా ఉన్న విద్యా బాలన్ సౌత్‌లో మరిన్ని సినిమాలు చేస్తే చూడాలని ఆశగా ఉందని కొందరు కామెంట్స్ చేస్తున్నారు.

## 'శుభం' జర్నీ.. డైరెక్టర్ రాజ్ తో సామ్ ఫోటో వైరల్!

ప్రముఖ నటి సమంత.. హీరోయిన్ గా ఎలాంటి క్రేజ్ సంపాదించుకున్నారో అందరికీ తెలిసిందే. ఇప్పుడు ప్రొడ్యూసర్ గా సత్తా చాటేందుకు రెడీ అవుతున్నారు. సొంత నిర్మాణ సంస్థ ట్రలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్ పై రూపొందించిన శుభం మూవీతో ప్రేక్షకుల ముందుకు మరికొద్ది రోజుల్లో రానున్నారు. హర్షిత్ రెడ్డి, గవిరెడ్డి శ్రీనివాస్, చరణ్ పేరి తదితరులు నటించిన శుభం మూవీకి ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వం వహించగా, సామ్ తక్కువ బడ్జెట్ తో నిర్మించారు. మే 9వ తేదీన ఆ సినిమా రిలీజ్ అవ్వనుండగా.. కొంతకాలంగా ప్రమోషన్స్ తో బిజీగా గడుపుతున్నారు. ఇప్పుడు ఇన్ స్టాగ్రామ్ పోస్ట్ తో అందరి దృష్టిని ఆకర్షించారు. కొన్ని పిక్స్ పోస్ట్ చేసి.. హార్ట్ ఫెల్ట్ మెసేజ్ రాసుకొచ్చారు. అదొక చాలా లాంగ్ రోడ్.. ఇక్కడ మనం స్ట్రాంగ్ న్యూ బిగినింగ్స్ అంటూ క్యాప్షన్ ఇచ్చారు సామ్. శుభం మూవీని ట్యాగ్ చేసి రిలీజ్ డేట్ ను గుర్తుచేసిన ఆమె.. క్రేజీ పిక్స్ పోస్ట్ చేయడం విశేషం. అందులో శుభం మూవీ క్లాప్ పిక్



కూడా ఉంది. అదే సమయంలో దర్శకుడు రాజ్ నిడిమోరుతో దిగిన ఫోటోను పోస్ట్ చేసిన సమంత.. ఆయన సింగిల్ పిక్ కూడా యాడ్ చేయడం గమనార్హం. దీంతో ఇప్పుడు సమంత పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఇది స్పెషల్ పోస్ట్ అని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. అయితే రాజ్, సామ్ వివాహం చేసుకోనున్నారని కొద్ది రోజులుగా ఊహాగానాలు చక్కర్లు కొడుతున్నాయి. ఇప్పుడు ఇన్ స్టాగ్రామ్ లో సమంత.. రాజ్ పిక్స్ పోస్ట్ చేయడంతో ఆ మ్యాటర్ మళ్లీ చర్చనీయాంశంగా మారింది. అదే సమయంలో వైట్ అవుట్ ఫిట్స్ లో దిగిన పిక్స్ షేర్ చేయగా.. సూపర్ గా ఉన్నాయని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. మేడమ్ సర్ మేడమ్ అంతే అని కొనియాడుతున్నారు. బ్యూటిఫుల్ ఫోటోస్ అని చెబుతున్నారు. ఇక కెరీర్ విషయానికొస్తే.. శుభం మూవీతోపాటు మా ఇంటి బంగారం సినిమాను నిర్మిస్తున్నారు సామ్. అందులో ఆమె నటిస్తున్నారు కూడా. అదే సమయంలో రక్త్ బ్రహ్మాండ్ వెబ్ సిరీస్ లోనూ యాక్ట్ చేస్తున్నారు. మహారాణి పాత్రలో కనిపించనున్నారని టాక్ వినిపిస్తోంది. మరి వరుస ప్రాజెక్టులతో ఎలాంటి హిట్స్ అందుకుంటారో వేచి చూడాలి.




# వీరమల్లు ముఖ్య అతిథిగా నటసింహం!



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా నటిస్తోన్న 'హరిహర వీరమల్లు' భారీ ఎత్తున ఈనెల 24న రిలీజ్ అవుతోన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నాలుగు రోజులు ముందుగానే ప్రీ రిలీజ్ వేడుకగా గ్రాండ్ గా ఈనెల 20న వైజాగ్ లో నిర్వహిస్తున్నారు. విశాఖ బీచ్ లో భారీ అభిమానుల సమక్షంలో వేడుక నిర్వహ ణకు సన్నాహాలు జరుతున్నాయి. తొలుత ఇదే ఈవెంట్ తిరుపతి లేదా విజయవాడలో నిర్వహించాలనుకున్నారు. కానీ అనూహ్యంగా వేదిక మారింది. పవన్ కళ్యాణ్ వైజాగ్ లో చేయాలని సూచించడంతో మేకర్స్ ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. మరి ఈ వేడుకకు ముఖ్య అతిథి ఎవరు? అంటే ఓ పేరు తెరపైకి వచ్చింది. ఆయనే నటసింహ బాలకృష్ణ అని పవన్ సన్నిహిత వర్గాల నుంచి తెలిసింది. బాలయ్య ముఖ్య అతిథిగా ఈ వేడుక నిర్వహిద్దామని దర్శక, నిర్మాతలకు పవన్ సూచించగా అందుకు వాళ్లు కూడా ఒకే చెప్పినట్లు తెలిసింది. మరి ఈ ప్రచా రంలో నిజమెంతో తెలియాలి. ఒకప్పుడు మెగా-నందమూరి అభిమానుల మధ్య పెద్ద వార్ నడిచేది. ఇరు వర్గాల మధ్య అస్సలు పొసిగేది కాదు. కానీ రాజకీయంగా జనసేన-టీడీపీ ఒక్కట వ్వడంతో సీన్ మారింది. పవన్ కళ్యాణ్ మరో 15 ఏళ్ల పాటు టీడీపీతో నే కలిసి ప్రయాణం చేస్తానని...చంద్రబాబు నాయుడు ఆధ్వ ర్యంలో రాష్ట్రం బాగుంటుందని భావించి పవన్ రాజకీయంగా ఆ బాండింగ్ ని మరింత స్ట్రాంగ్ చేసు కుంటున్నారు. ఈనేపథ్యంలో తన సినిమా వేడుకకు బాలయ్యను చీఫ్ గెస్ట్ గా ఆహ్వానిస్తున్నట్లు తెలు స్తోంది. ఇంత వరకూ ఎప్పుడు పవన్ సినిమా వేడుకలో బాలయ్య ముఖ్య అతిథిగా పాల్గొనలేదు. అసలు పవన్ సినిమాలకే అతిథిగా ఏనాడు రాలేదు. మెగా హీరోలు ఆయన్ని పిలిచింది లేదు. కానీ ఇప్పుడు సన్నివేశం వేరు కావడంతో వృత్తి, వ్యక్తగతంగా మరింత స్ట్రాంగ్ అవుతున్నారు. ఈ వేడుకలో సినిమా వాళ్లతో పాటు పెద్ద ఎత్తున రాజకీయ నాయకులు పాల్గొనే అవకాశం ఉంది. ముఖ్యంగా ఉత్త రాంధ్రా కూటమి నాయకులుంతా పాల్గొంటారని వార్తలొస్తున్నాయి. మరి ఈ ప్రచారంలో నిజమెంతో తేలాలి.

# కన్నప్ప, వీరమల్లు కష్టాలే 'అఖండ 2' కి..!



ఈ మధ్య కాలంలో పెద్ద సినిమాలు ఏవీ ముందుగా ప్రకటించిన డేట్‌లో రావడం లేదు. ఎంతో పెద్ద హీరోల సినిమాలైనా షూటింగ్స్ సమయానికి జరిగినా వీఎఫ్ఎక్స్ వర్క్ ఆలస్యం కారణంగా విడుదల వాయిదా పడుతున్నాయి. ఇటీవల విడుదలైన 'కన్నప్ప' సినిమా ఏకంగా ఆరు నెలలు ఆలస్యం అయింది. వీఎఫ్ఎక్స్ వర్క్ విషయంలో సంతృప్తి లేకపోవడం వల్ల కొత్తగా చేయించారు. హరి హర వీరమల్లు సినిమా గత నెలలో విడుదల కావాల్సి ఉండగా వీఎఫ్ఎక్స్ వర్క్ పూర్తి కాని కారణంగా సినిమాను వాయిదా వేసి ఈ నెల చివరి వారంలో విడుదల చేయబోతున్న విషయం తెల్సిందే. ఇప్పటి వరకు వీఎఫ్ఎక్స్ వర్క్ ఆలస్యం కారణంగా చాలా సినిమాలు వాయిదా పడుతూ వచ్చాయి. మెగాస్టార్ చిరంజీవి హీరోగా వశిష్ట దర్శకత్వంలో రూపొందుతున్న 'విశ్వంభర' సినిమా విడుదల విషయంలో స్పష్టత లేకపోవడంకు కారణం వీఎఫ్ఎక్స్ వర్క్ విషయంలో స్పష్టత లేకపోవడం అంటూ ఇండస్ట్రీ వర్గాల్లో పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఎప్పుడైతే వీఎఫ్ఎక్స్ వర్క్ పూర్తి అవుతుందో అప్పుడే ఫైనల్ ఔట్‌పుట్ చూసిన తర్వాత రిలీజ్ డేట్ విషయమై ప్రకటన చేస్తామని అభిమానులకు మేకర్స్ ఆ మధ్య చెప్పుకొచ్చారు. ఇలా చాలా సినిమాలు వీఎఫ్ఎక్స్ కారణంగా ఆలస్యం కావడం, వాయిదా పడటం జరుగుతున్నాయి. ఇప్పుడు ఇదే జాబితాలోకి బాలకృష్ణ హీరోగా నటిస్తున్న అఖండ 2 సినిమా చేరినట్లు సమాచారం అందుతోంది. దసరా కానుకగా అఖండ 2 సినిమాను సెప్టెంబర్ చివరి వారంలో విడుదల చేయబోతున్నట్లు మొదట ప్రకటన వచ్చింది. కానీ సెప్టెంబర్ వరకు వీఎఫ్ఎక్స్ వర్క్ పూర్తి అయ్యే పరిస్థితి లేదు. ఈనెల చివరి వరకు అఖండ 2 సినిమా షూటింగ్‌ను ముగించే అవకాశాలు ఉన్నాయి. తర్వాత వీఎఫ్ఎక్స్ వర్క్‌ను ఆగస్టులో ముగించాలని భావించినప్పటికీ అది సాధ్యం కాదని ఇటీవల టీం మీటింగ్‌లో దర్శకుడికి సదరు వీఎఫ్ఎక్స్ కంపెనీ వారు చెప్పారట. దాంతో షూటింగ్ మెల్లగా చేస్తున్నాడని, డిసెంబర్‌లో సినిమా విడుదల చేసుకోవాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. బాలకృష్ణ అభిమానులతో పాటు అంతా ఈ సినిమా కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబోలో ఇప్పటి వరకు వచ్చిన సింహా, లెజెండ్, అఖండ సినిమాలు భారీ విజయాన్ని సొంతం చేసుకున్నాయి. అందుకే ఈ సినిమా సైతం భారీ విజయాన్ని సొంతం చేసుకుంటుంది అనే విశ్వాసంతో చాలా మంది అభిమానులు వెయిట్ చేస్తున్నారు. అఖండ సినిమా హిందుత్వంపై సాగుతుంది. ఇప్పుడు అఖండ 2 లో అంతకు మించి అన్నట్లుగా సనాతన ధర్మం చుట్టూ కథ సాగుతుందని తెలుస్తోంది. ఈ సినిమాకు థమన్ సంగీతాన్ని అందిస్తున్నాడు. ఈ సినిమాలో హీరోయిన్‌గా ప్రగ్యా జైస్వాల్ నటిస్తోంది. ముఖ్య పాత్రలో హర్షాలీ మల్హోత్రా నటిస్తున్నట్లు సమాచారం అందుతోంది. డిసెంబర్ 18న సినిమాను విడుదల చేస్తే బాగుంటుంది అనే అభిప్రాయంలో మేకర్స్ ఉన్నారు. అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

## బంగారు వర్ణంలో మెరుస్తున్న జాన్వీ కుమారి

అతిలోక సుందరి శ్రీదేవి నట వారసురాలుగా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన జాన్వీ కపూర్ చాలా తక్కువ సమయంలోనే తనకంటూ ప్రత్యేక గుర్తింపును దక్కించుకుంది. తల్లి పేరు, తండ్రి బ్రాండ్ ఇమేజ్‌ను వినియోగించుకోకుండానే సినిమా ఆఫర్లు దక్కించుకునే స్థాయికి ఎదిగింది. బాలీవుడ్‌లో ఈమె చేసిన మొదటి సినిమా నుంచి మొన్న వచ్చిన హోమ్బౌండ్ సినిమా వరకు నిరాశనే మిగిల్చాయి. కొన్ని సినిమాలు నటిగా గుర్తింపు తెచ్చి పెట్టినప్పటికీ ఏ ఒక్క సినిమా కమర్షియల్‌గా బ్లాక్ బస్టర్ విజయాలను సొంతం చేసుకోలేక పోయాయి. దాంతో ఈ అమ్మడు బాలీవుడ్ నుంచి టాలీవుడ్‌కి ఎంట్రీ ఇచ్చింది. తెలుగులో ఈమె చేసిన దేవర సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. దేవర విజయంతో టాలీవుడ్‌లో వరుస ఆఫర్లను ఈ అమ్మడు సొంతం చేసుకుంటుంది. ఇప్పటికే రామ్ చరణ్ తో కలిసి బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందుతున్న భారీ బడ్జెట్ మూవీలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. మరో తెలుగు సినిమాకు కమిట్ అయిన జాన్వీ వచ్చే ఏడాదిలో ఆ సినిమా షూటింగ్‌లో పాల్గొనే అవకాశాలు ఉన్నాయి. తెలుగులో వరుస ఆఫర్లు వస్తున్నా ఆచితూచి సినిమాలను ఎంపిక చేసుకుంటున్న జాన్వీ కపూర్ బాలీవుడ్‌లో మాత్రం




బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో సందడి చేసేందుకు గాను రెడీ అవుతోంది. త్వరలో జాన్వీ కపూర్ 'సన్నీ సంస్కారీ కి తులసి కుమారి' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఆ సినిమాలో తులసి కుమారి పాత్రలో జాన్వీ కపూర్ కనిపించబోతుంది. ఇప్పటికే విడుదల కావాల్సిన ఈ సినిమా వాయిదాల మీద వాయిదాలు పడుతూ వస్తోంది. మొన్నటి వరకు సెప్టెంబర్‌లో ఈ సినిమాను విడుదల చేస్తామంటూ చెబుతూ వచ్చిన మేకర్స్ ఇప్పుడు కొత్త డేట్‌ను అక్టోబర్‌కి మార్చారు. అక్టోబర్ 2, 2025న ఈ సినిమాను విడుదల చేయబోతున్నట్లుగా అధికారికంగా ప్రకటన వచ్చింది. కొత్త విడుదల తేదీని ప్రకటించేందుకు గాను మేకర్స్ జాన్వీ కపూర్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఆ పోస్టర్‌లో తులసి కుమారిగా జాన్వీ కపూర్‌ను చూడవచ్చు. చీర కట్టులో జాన్వీ కపూర్ నడుము అందం చూపిస్తూ కవ్విస్తుంది. బంగారు వర్ణపు బ్యాగ్ గ్రౌండ్‌తో పాటు, అదే కలర్ చీర, బ్లౌజ్ ధరించిన జాన్వీ కపూర్ చూపు తిప్పనివ్వడం లేదు. తులసి కుమారి పాత్ర కాస్త బోల్డ్‌గా ఉంటుందని, జాన్వీ కపూర్ గతంతో పోల్చితే ఈ సినిమాలో నటనతో మరింతగా మెప్పించడం ఖాయం అంటూ మేకర్స్ అంటున్నారు. టైటిల్ రోల్ పోషిస్తుంది కనుక ఖచ్చితంగా జాన్వీ కపూర్ నుంచి ప్రేక్షకులు నటనతో పాటు, అందాల ఆరబోత కాస్త ఎక్కువగానే ఆశిస్తారు. కనుక సినిమాలో ఖచ్చితంగా ఆ రెండు అంతకు మించి ఉండే అవకాశాలు ఉన్నాయి. ఈ పోస్టర్‌ను చూస్తూ ఉంటే జాన్వీ కపూర్ అందాల ఆరబోతను ఈ సినిమాలో దండిగానే చూస్తాము అనే విశ్వాసం ను అభిమానులు వ్యక్తం చేస్తున్నారు. బాలీవుడ్‌లో ఇప్పటి వరకు దక్కించుకోని కమర్షియల్ విజయాన్ని తులసి కుమారిగా జాన్వీ కపూర్ అందుకుంటుందా అనేది చూడాలి.

## మెగా కోడలు ఇంటికే పరిమితమా!

మెగా కోడలు లావణ్య త్రిపాఠి పెళ్లైన తర్వాత వెండి తెరపై మెరిసింది లేదు. బుల్లి తెరపై ఓటీటీ సిరీస్ ల ద్వారా అలరించింది తప్ప పెద్ద తెర ప్రేక్షకులకు మాత్రం దూరంగానే ఉంది. వరుణ్ తేజ్ తో లావణ్య వివాహం 2023 నవంబర్ లో జరిగింది. అప్పటి నుంచి ఇప్పటివరకూ ఒక్క సినిమా కూడా చేయలేదు. పెళ్లికి ముందు %-%హ్యాపీ బర్త్ డే%-% సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. అటుపై తెరకే దూరమైంది. తాజాగా లావణ్య గర్భం దాల్చిన విషయాన్ని అధికారికంగా వెల్లడించిన సంగతి తెలిసిందే. వచ్చే ఏడాది పండంటి పాపాయికి జన్మనివ్వనుంది. మరి ఇలాంటి పరిస్థితుల్లో లావణ్య కెరీర్ కంటున్యూ అవుతుందా? అంటే అతి కష్టమనే ఫిలిం సర్కిల్స్ లో చర్చకొస్తుంది. బేసిక్ గా లావణ్య సినిమాల విషయంలో ఆచి తూచి వ్యవహరిస్తుంది. కెరీర్ ఆరంభం నుంచి గ్లామర్ పాత్రలకు దూరంగా



ఉంటూ డీసెంట్ రోల్స్ మాత్రమే చేసుకుంటూ వచ్చింది. ఈ క్రమంలో చాలా ఫ్లాప్ లు ఎదురైనా ఎక్కడా నిబంధన అతిక్రమించకుండా పని చేసుకుంటూ వచ్చింది. లావణ్య తల్లిదండ్రులు అన్నలు..వదినలు కుటుంబమంతా లాయర్లు...జడ్జ్ లు. చిన్నప్పటి నుంచి ఎంతో క్రమశిక్షణ. ఇప్పటికీ అదే క్రమ శిక్షణతో ముందుకెళ్తుంది. మెగా ఫ్యామిలీ ఇంట కోడైలన తర్వాత మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తుంది. వివాహం తర్వాత దాదాపు ఇంటికే పరిమితమైంది. కానీ వివాహానికి ముందు కమిట్ అయిన కొన్ని సినిమాలు మాత్రం అనివార్య కారణాలతో ఇప్పటికీ రిలీజ్ కాలేదు. తమిళ్ లో %-%తానల్%-% అనే సినిమా చేస్తుంది. ఈ సినిమా ఎట్టకేలకు చిత్రీకరణ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ స్టేజ్ లో ఉంది. అలాగే %-%సతీ లీలావతి%-% అనే మరో చిత్రం కూడా చేస్తోంది. ఈ రెండు సినిమాల రిలీజ్ అనంతరం లావణ్య కెరీర్ కంటున్యూ అవుతుందా? లేదా? అన్నది క్లారిటీ వస్తుందని సన్నిహిత వర్గాల సమాచారం.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536